w w w . p r a j a s a k t i

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Publishedfrom Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and ananthapuramu

సంపుటి : 37 సంచిక : 230
12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00

విజయవాడ, ఆదివారం 20 ఆగస్టు 2017

facebook/prajasakti, twitter/prajasakti



తెలుగు బుల్లితెరపై మెగాహీరోగా సుపరిచితుడైన సమీర్ నట ప్రస్థానం వాస్తవానికి వెండతెరతోనే మొదలైంది. 'భాగవతం, రుతురాగాలు, కస్తూరి, శాంతి నివాసం, లేడీ డిటెక్టివ్, కలంకిత..' సీరియల్స్‌లో గుర్తుండిపోయే పాత్రలకు జీవం పోసిన ఆయన 'ఇంద్ర, ఠాగూర్, సై, మగధీర, దువ్వాడ జగన్నాథం..' వంటి చిత్రాల్లోనూ వైవిధ్యమైన నటనతో ఆకట్టుకున్నారు. తెలుగు 'బిగ్‌బాస్' షోతో మళ్లీ ప్రేక్షకుల మన్ననలను అందుకున్న ఆయన తనకు విలనిజం, కామేడీ రెండూ ఇష్టమేనంటున్నారు. కమిటెడ్ నటుడిగా పేరుతెచ్చుకున్న సమీర్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ.. 'జీవన'లో

మృత్యు శకటం!

యుపిలో పట్టాలు తప్పిన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్

23 మంది మృతి **72** మందికి తీవ్ర గాయాలు

ఇళ్లల్లోకి దూసుకెళ్లిన బోగీలు

సమయం సాయంత్రం 5.45 గంటలు... మరో మూడు గంటల్లో ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ గమ్యానికి చేరుకుంటుంది. ప్రయాణికులంతా ఎవరి హడావిడిలో వారున్నారు. అంతలో పెను విస్ఫోటనం సంభవించిందా అన్నట్లు భారీ శబ్దం! ఏం జరిగిందో అర్థం చేసుకునే లోపులే కొందరిని మృత్యువు కబళించింది. మరి కొందరు తీవ్ర గాయాల పాలయ్యారు. కూర్చున్న వాళ్లు కూర్చున్న చోటే తుది శ్వాస విడిచారు. కొందరు రైలు పెట్టెల్లో చిక్కుకుపోయారు. అంతా ఆర్తనాదాలు, హాహాకారాలు...! అప్పటి దాకా ఆహ్లాదం పంచిన రైలు ప్రయాణం విషాద యాత్రగా ముగిసింది! ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ మృత్యు శకటంగా మారింది! ప్రాణాలతో బయటపడిన వారి పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. తీవ్ర గాయాలతోనే తమ ఆత్మీయుల కోసం రైలు పెట్టెల చుట్టూ తిరుగుతూ వారు పడుతున్న ఆవేదన కన్నీళ్లు తెప్పిస్తోంది! మిగతా 9లో



విద్యుత్ వినియోగానికి రీఛార్జి కూపన్లు

సిబ్బందికి పొంచి ఉన్న ఉద్యోగ గండం

2

వేడెక్కిన నంద్యాల

- పోటాపోటీగా బాబు, జగన్‌ల ప్రచారం
- చేరుకున్న ప్రత్యేక పోలీస్ బలగాలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/నంద్యాల లీగల్

నంద్యాల ఉపఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరుకుంది. ప్రచార పర్వం ముగియడానికి సమయం సమీపిస్తుండటంతో తెలుగు దేశం, వైఎస్‌ఆర్‌సిపిలు జోరు పెంచాయి. టిడిపి అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఆదివారం కూడా ఆయన ప్రచారం నిర్వహించనున్నారు. కొద్దిరోజులుగా నంద్యాలలోనే మకాం వేసిన వైసిపి అధ్యక్షుడు జగన్ ప్రచారం కూడా కొనసాగింది. ప్రచార పర్వం ముగిసేంతవరకు ఆయన నంద్యాలలోనే ఉంటానని ప్రకటించారు. అగ్రనేతల పోటాపోటీ ప్రచారం, ప్రసంగాలతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. మరోవైపు ఎన్నికల కమిషన్ నంద్యాలకు ప్రత్యేక పోలీస్ బలగాలను తరలించే ప్రక్రియను ప్రారంభించింది. ప్రచార పర్వంలో చివరి రెండురోజులు కీలకం కావడం. ఆ తరువాత పరిస్థితి మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉండటంతో ఈ విషయంపై ఇసి ప్రత్యేక దృష్టి సారించింది.



నంద్యాల బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

జగన్‌కు బుద్ధి చెప్పండి : చంద్రబాబు

నంద్యాల ఉపఎన్నికలో టిడిపికి ఓటు వేసి సభ్యత, సంస్కారం లేని జగన్‌కు బుద్ధి చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపిస్తున్నామని తెలిపారు. 'కాల్చి పారేయండి... ఉరి వేయండి... బట్టలూడదీయండి' అంటూ మాట్లాడటం ఏమి సంస్కృతో ప్రతిపక్ష నేత జగనే చెప్పాలన్నారు. నంద్యాల ఉపఎన్నికలో టిడిపి అభ్యర్థి భూమాబ్రహ్మానందరెడ్డికి మద్దతుగా శనివారం సిఎం చంద్రబాబు నంద్యాల నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి సిఎం మాట్లాడారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో అనుభవం ఉన్న వ్యక్తిగా తనను నమ్మి ప్రజలు తనకు అధికారాన్ని కట్టబెట్టారని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని చెప్పారు. నంద్యాల ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి ఈ నియోజకవర్గం అభివృద్ధి కోసమే తనవద్దకు వచ్చారని తెలిపారు. శిల్పా మోహన్‌రెడ్డి మూడేళ్లపాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఉంటూ నంద్యాల ప్రజలకు సంబంధించిన ఏ సమస్యను కూడా మిగతా 9లో

పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు

పోలవరం ముంపు మండలాల బంద్ విజయవంతం

2

గోరఖ్‌పూర్‌లో రాహుల్ పర్యటన

మృతి చెందిన పిల్లల కుటుంబాలకు పరామర్శ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ శనివారం గోరఖ్‌పూర్‌లోని బిఆర్‌డి ఆసుపత్రిలో మృతి చెందిన పిల్లల కుటుంబాలను పరామర్శించారు. రాహుల్ గాంధీ వెంట రాజ్యసభ నేత గులామ్ నబి అజాద్ ఉన్నారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత కారణంగా 100 మందికి పైగా పిల్లలు మృతి చెందారు. ఈ సంఘటన జరిగిన 10 రోజుల అనంతరం రాహుల్ గాంధీ గోరఖ్‌పూర్ పర్యటించారు ఈ సందర్భంగా గులాం నబి అజాద్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యానాథ్ ఐదు సార్లు ఎంపిగా పనిచేసినప్పటికీ ఆసుపత్రిలో పరిస్థితులను మిగతా 9లో

డిఎస్పీపై ఇసి వేటు



నంద్యాల డిఎస్‌పి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా నంద్యాల ఉపఎన్నికలో అధికార టిడిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని డిఎస్‌పి గోపాలక్రిష్ణపై ఎన్నికల కమిషన్ (ఈసి) కొరడా ఝుళిపించింది. వైసిపి ఫిర్యాదు మేరకు నంద్యాల డిఎస్‌పిని శనివారం ఎన్నికల బాధ్యత నుంచి తొలగించింది. నంద్యాల ఒఎస్‌డి రవిప్రకాశ్‌కు ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి బాధ్యతలను అప్పజెప్పింది. ఎన్నికలకు నాలుగు రోజుల ముందు ఈ బదిలీ జరగడంతో అధికార పార్టీకి పెద్ద షాక్ తగిలినట్లయింది. సిఎం చంద్రబాబుకు సంబంధించిన ఫ్యాన్సీ కారు (వంటవాహనం) వైసిపి పట్టుకున్నప్పుడు డిఎస్‌పి వ్యవహరించిన తీరు, డబ్బు పంపిణీలో అధికార పార్టీ టిడికి వత్తాసు పలుకుతున్నాడని ఎన్నికల అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందాయి. వైసిపి నాయకులపై అనవసరమైన కేసులు బనాయించారని, ఇళ్లలో సోదాలు చేయిస్తున్నాడని, బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆధారాలతో వైసిపి నాయకులు ఎన్నికల అధికారికి దృష్టికి తెచ్చారు. దీంతో 15 రోజులుగా ఎన్నికల అధికారి నిఘా పెట్టి గోపాలక్రిష్ణను బదిలీ చేశారు. ఈ ఏడాది జులై ఏడున ఆయన నంద్యాల డిఎస్‌పిగా బాధ్యతలు తీసుకున్నారు. అంతకుముందు ఎపిఎస్‌పి రెండో బెటాలియన్ కర్నూలులో పనిచేశారు.

రీషెడ్యూల్‌కు రాం..రాం..

- విపత్తు రైతుకు దగా
- రూ.6,962 కోట్లకు 396 కోట్లు
- కొత్త అప్పులు రూ.10 కోట్లే
- మాఫీ ఎఫెక్టు అంటున్న బ్యాంకులు
- నోరెత్తని సర్కారు
- కర్షకులకు ప్రైవేటు వ్యాపారులే దిక్కు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు కాస్తంత వెసులుబాటు కల్పించే ఉద్దేశంతో ఎప్పటి నుంచో అమలు చేస్తున్న పంట రుణాల పునర్వ్యవస్థీకరణ (రీషెడ్యూల్) ఆంధ్రప్రదేశ్‌లో అపహాస్యం పాలవుతోంది. విపత్తు ప్రాంతాల్లో రుణాల చెల్లింపులను వాయిదా వేసి తక్షణం పంటలేసుకొనేందుకు కొత్త అప్పులిచ్చే ఆనవాయితీకి గండి పడింది. దీంతో విపత్తు ప్రాంత రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దయనీయ స్థితి దాపురించింది. నిరుడు 301 కరువు మండలాలను సర్కారు ప్రకటించగా 8,74,163 మంది రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.6,962 కోట్లు రీషెడ్యూల్‌కు అర్హత సాధించాయి. అయితే ఇప్పటి వరకు బ్యాంకులు 48,483 మందికి (5.55 శాతం) చెందిన రూ.396 కోట్ల (5.70 శాతం) అప్పులను రీషెడ్యూల్ చేసి 1,113 మందికి (2.29 శాతం) రూ.10.35 కోట్లు (2.60 శాతం) కొత్త రుణాలిచ్చాయి. రీషెడ్యూల్‌కు అర్హత పొందిన రైతుల్లో కొత్త అప్పులు ఇచ్చింది 0.12 శాతం మాత్రమే. ప్రభుత్వరంగ బ్యాంకులు స్వల్పంగానైనా మిగతా 9లో

ఐటి ఢమాల్

బ్లూంబెర్గ్ : భారత్ ఐటి రంగం గడిచిన ఏడేళ్ళ కాలంలో తీవ్రంగా దెబ్బతిన్నదని విదేశీ మీడియా పేర్కొంది. ఇన్ఫోసిస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విశాల్ సిక్కా రాజీనామాతో ఒకప్పుడు భారత్‌లో ఖ్యాతి గాంచిన ఐటి రంగం మసకబారింది. సాఫ్ట్‌వేర్ సర్వీస్‌ల ఎగుమతులు ఏడేళ్ళ కాలంలో ఎన్నడూ లేనంతగా తిరోగమన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల 2013 నుంచి కరెంటు ఖాతా లోటు భారీగా పెరిగిపోయింది. రూపాయి ఒత్తిడికి గురవుతున్నది. విధాన నిర్ణేతలు కూడా లాభాలనే కాంక్షిస్తుండటంతో అది ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొందరు అనేక ఆటంకాలు సృష్టించినప్పటికీ భారతీయ కంపెనీలు గడిచిన దశాబ్దకాలంలో విజయ పథంలోనే నడి చాయి. అవరోధాలు సృష్టించిన వారే ప్రస్తుత వాతావరణంలో సవాళ్ళను ఎదుర్కొంటున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆర్థిక సలహాదారు అరవింద సుబ్రమణ్యన్ ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. ప్రభుత్వం తన ఆర్థిక సర్వేను ఈ నెలో ప్రచురించిన సంగతి తెలిసిందే. అమెరికాలో ఎన్నికలు, బ్రెగ్జిట్ రిఫరెండంకు ముందు, తరువాత పెరుగుతున్న ప్రపంచీకరణ వ్యతిరేక ధోరణలు కూడా మిగతా 8లో




వరదల ఉధృతితో విలవిల్లాడుతున్న అస్సాంలో వణ్య జీవులు కూడా పెద్ద సంఖ్యలో చనిపోయాయి. కజిరంగ నేషనల్ పార్కులో 15 ఖడ్గమృగాలు, 185 జింకలు, ఒక రాయల్ బెంగాల్ టైగర్ (చిత్రంలో చూడవచ్చు), కొన్ని ఏనుగులు సహా 225 జంతువులు ప్రాణాలు కోల్పోయాయి. వీటి కళేబరాలు వరద నీటిలో తేలుతున్న దృశ్యాలు స్థానికులకు కంటతడి పెట్టిస్తున్నాయి.

ఎంబిఎ, ఇంజనీర్లకు స్వీపర్ పోస్టులు

- ఎస్సీలకు పైస్థాయి ఉద్యోగాల నిరాకరణ
- కోయంబత్తూరు నగర కార్పొరేషన్ నిర్వాకం

చెన్నయ్ : తమిళనాడులోని చేనేత పరిశ్రమకు ప్రసిద్ధిగాంచిన కోయంబత్తూరు నగర కార్పొరేషన్...ఎంబిఎ, ఇంజనీర్ అభ్యర్థులకు స్వీపర్ పోస్టులు ఇచ్చి వార్తల్లో నిలిచింది. విద్యార్హతలున్నప్పటికీ టైప్ రైటింగ్‌లో ఉత్తీర్ణత సాధించలేదనే కారణంతో జూనియర్ అసిస్టెంట్, బిల్ ట్యాక్సు ఉద్యోగాలను ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నిరాకరించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. తమను ఎదగనీయకుండా చేసేందుకే కార్పొరేషన్‌లోని కొంతమంది అధికారులు నిబంధనలు మార్చారని ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు పేర్కొన్నారు. స్వీపర్ పోస్టులకుగాను కోయంబత్తూరు కార్పొరేషన్ గతంలో నోటిఫికేషన్ జారీ మిగతా 8లో



కేసినేని నాని

వైసిపికి ఓటమి భయం : టిడిపి ఎంపీలు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే వైసిపి నాయకులు దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారని టిడిపి ఎంపిలు కొనకళ్ల నారాయణ, కేసినేని నాని విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. సిఎం భోజన వాహనంలో డబ్బులున్నాయంటూ భాధ్యతగల ఎంపిలు, ఎమ్మెల్యేలు అధికారుల్ని తప్పుదోవపట్టించి అభాసుపాలయ్యారన్నారు. జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న ముఖ్యమంత్రి వ్యానుపై కావాలనే తప్పుడు నివేదికలిచ్చారన్నారు. వైసిపి అబద్ధాల్ని ప్రచారం చేస్తోందన్నారు. ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

చెట్లు నరికితే చర్యలు : కోడెల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చెట్లను నరికే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటే కొంత వరకు ఈ సమస్యను అరికట్టే అవకాశముంటుందని శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు అభిప్రాయపడ్డారు. అడవులు అంతరించి పోవడంతో భూమిపై ప్రాణవాయువు తగ్గి ప్రజలకు ఊపిరి తిత్తులు, ఇతర చర్మ సంబంధమైన వ్యాధులు ఎక్కువవుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్‌లో ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై శనివారం జరిగిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



ప్రజ్ఞ

1. ఆర్‌బిఐ త్వరలో విడుదలచేయబోయే రూ.50 నోటుపై వున్న రథం ఎక్కడుంది?
2. ఇన్ఫోసిస్ సిఇఒ పదవికి రాజీనామా చేసింది ఎవరు?
3. ఇంటర్నెట్ సంబంధిత సమస్యలు పరిష్కారానికి సైబర్ కోర్టును ప్రారంభించిన దేశం ఏది?
4. డబ్ల్యుహెచ్ఒ గణాంకాల ప్రకారం దోమకాటు వల్ల సోకే వ్యాధులతో ఏటా ఎంత మంది మరణిస్తున్నారు?
5. స్పెయిన్‌లోని ఏ నగరంలో ఇటీవల ఉగ్రదాడి జరిగింది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నంద్యాల ఉప ఎన్నిక సర్వే నిషేధంపై హైకోర్టులో కేసు

రేపు విచారించనున్న డివిజన్ బెంచ్

ప్రజాశక్తి - హైదరాబాద్

నంద్యాల ఉప ఎన్నికపై సర్వేల్ని నిషేధిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యంపై సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించనుంది. ఎన్నికకు 48 గంటల ముందు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించరాదని, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ముందుగా నిషేధం విధించడం చెల్లదని సోషియో పొలిటికల్ అనాలసిస్ అండ్ రీసెర్చ్ సెంటర్ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. నంద్యాల అసెంబ్లీ స్థానానికి ఎన్నిక జరిగే వరకు విద్యార్థులు, సంస్థలు, ప్రభుత్వోద్యోగులు, ఎన్‌జీవోల ఓటర్ల అభిప్రాయాలపై సర్వేలు చేయడాన్ని ఎన్నికల సంఘం నిషేధించింది. సర్వేలపై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ ఆ సెంటర్ కార్యదర్శి ఎస్. రాంబాబు దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో నంద్యాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి, ఎలక్షన్ కమిషన్ కార్యదర్శిలను ప్రతివాదులుగా చేశారు.

బిసి గురుకులాలకు 13 పోస్టులు మంజూరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలకు రెగ్యులర్ ప్రాతిపదికన13 పోస్టులను మంజూరు చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి హేమ మునివెంకటప్ప శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటిల్లో ఒక ప్రిన్సిపాల్, ఒక పిఇటి, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పిజిటి) 7, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టిజిటి) 4 పోస్టులు ఉన్నాయి. పిజిటి కింద ఇంగ్లీషు, తెలుగు, హిందీ, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ పాఠ్యాంశాలకు ఒక్కోటి, టిజిటి కింద ఇంగ్లీషు, మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కోటి మంజూరు చేశారు. నాన్ టీచింగ్ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసుకోవాలని ఈ ఉత్తర్వుల్లో సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో బెస్త వారి కోసం కొత్తగా ప్రారంభించిన గురుకులాల్లో వీటిని భర్తీ చేయనున్నారు. మొత్తం 44 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల మంజూరు కోసం బిసి సంక్షేమ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా 13 పోస్టులకే అనుమతులు మంజూరయ్యాయి.

కృష్ణా పుష్కరాలకు ఆర్టీసి ఖర్చును చెల్లించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గతేడాది కృష్ణా పుష్కరాల సందర్భంగా ఎపిఎస్ ఆర్టీసి చేసిన ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించింది. ఈ మేరకు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా పుష్కరాల్లో ప్రయాణికులను పుష్కర ఘాట్లకు చేర్చేందుకు, ప్రయాణికులకు సదుపాయాలు కల్పించేందుకు ఎపిఎస్ ఆర్టీసి ఖర్చు చేసిన రూ.29.50 కోట్లు, తిరిగి చెల్లిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్టీసి నిధుల నుంచి కృష్ణా పుష్కరాలకు ఖర్చు చేశామని, బడ్జెట్‌లో నిధుల కొరత వల్ల సిబ్బంది వేతనాలు చెల్లించేందుకు కష్టంగా ఉందని ఆర్టీసి ఎండి మాలకొండయ్య చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ చెల్లింపులు చేసింది.





తూర్పుగోదావరి జిల్లా చింతూరులో వర్షంలోనే రాస్తారోకోలో పాల్గొన్న మిడియం బాబూరావు, ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య, నిర్వాసితులు, బంద్ కారణంగా నిలిచిపోయిన వాహనాలు

పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు

- పోలవరం ముంపు మండలాల బంద్ విజయవంతం
- చింతూరులో భారీ వర్షంలోనూ ధర్నా
- హాజరైన ఒడిశా, చత్తీస్‌గఢ్ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తమకు పూర్తి పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలుచేసిన తర్వాతే ప్రాజెక్టు నిర్మించాలని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు నినదించారు. తూర్పుగోదావరి జిల్లా ముంపు మండలాల్లో శనివారం జరిగిన బంద్ విజయవంతమైంది. ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యాన చేపట్టిన బంద్ సందర్భంగా ఎటపాక, చింతూరు, కూనవరం, విఆర్ పురం మండలాల్లో దుకాణాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఆర్‌టిసి బస్సులు తిరగలేదు. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్ లావాదేవీలు స్తంభించాయి. భారీగా పోలీసులు మోహరించారు. కూనవరం మండలంలో బంద్‌ను నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

భవిష్యత్ పోరాటలకు సిద్ధం కావాలి

చింతూరు జాతీయ రహదారిపై నిర్వాసితులు వర్షాన్నిసైతం లెక్కచేయకుండా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఒడిశాలోని మల్కన్‌గిరి ఎంఎల్ఎ మనీష్ మడకం (బిజెడి) నిర్వాసితులనుద్దేశించి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. భద్రాచలం ఎంఎల్ఎ సున్నం రాజయ్య మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు ఎకరానికి రూ.28 లక్షలు ఇచ్చారని, పట్టిసీమ నిర్వాసితులకు రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఇచ్చారని చెప్పారు. అదే తరహా ప్యాకేజీని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ పోలవరం ముంపు మండలాల్లో రీ- సర్వే తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కారణంగా ఏయే గ్రామాలు ఎక్కడెక్కడ మునుగుతున్నాయో నిర్దిష్టంగా చెప్పాలన్నారు. సిపిఎం రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వం దిగి రాకుంటే భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని నిర్వాసితులను కోరారు. ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా బిజెపి నాయకుడు తోయామూక మాట్లాడుతూ ముంపు గ్రామాల నిర్వాసితులందరికీ నష్టపరిహారం పూర్తిగా అందించాకే ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.



కూనవరంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

రూ 20,000 కోట్లతో వైద్యశాఖ ప్రాజెక్టులు

వచ్చే మార్చి నాటికి శంకుస్థాపన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్య రంగంలో పలు ప్రాజెక్టులకు ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనుంది. వాటికి సంబంధించి భూ కేటాయింపుల కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు పలు సూచనలు చేసింది. ఈ నెలలోనే 3 మెగా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు కసరత్తు చేస్తోంది. వాటితో పాటు మరో నాలుగు కలిపి మొత్తం ఏడు ప్రాజెక్టుల్ని వచ్చే ఏడాదిలోగా ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టులన్నిటి విలువ దాదాపు రూ 20 వేల కోట్లు. వాటిలో ఇప్పటికే రూ 1600 కోట్లతో ఇండో యుకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇక మిగిలిన వాటిలో బిఆర్ఎస్ వెంచర్స్ ప్రాజెక్టు వ్యయం రూ 7500 కోట్లు కాగా అమరావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఎమ్ఎస్) వ్యయం రూ 600 కోట్లు. అయితే ఎఐఎమ్ఎస్ ఏర్పాటుకు సిఆర్‌డిఎ పరిధిలోనే స్థలాన్ని కేటాయించాల్సి ఉందని అధికారుల ద్వారా తెలిసింది. అలాగే రూ 1261 కోట్లతో ఏర్పాటు చేయనున్న నియో ఫార్మా పరిశ్రమకు రాంకీ ఫార్మా పార్కులో 35 ఎకరాల్ని ప్రభుత్వం కేటాయించింది. ఇక రూ. 350 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇలైట్ హాస్పిటల్స్‌కు అక్టోబర్‌లో శంకుస్థాపన చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. మరోవైపు రూ.1000 కోట్లతో ఏర్పాటు చేయనున్న మోహం హాస్పిటల్స్ అండ్ రిసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్, రూ 4626 కోట్లతో మెడ్‌టెక్ పార్కులో ఏర్పాటుచేసే మెడ్‌టెక్ ఇన్నోవేషన్ పార్ట్‌నర్స్ (ఎమ్‌టిఐపి) సంస్థలకు వచ్చే ఏడాది మార్చి నాటికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం కార్యచరణ ప్రణాళికను రూపొందించింది.

'ఉపాధి' పై అస్పష్టత!

కొత్తగా రాజధాని ప్రాంతంలో శంకుస్థాపన చేసిన ఇండో యుకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ద్వారా దాదాపు వెయ్యి మందికి ఉద్యోగావకాశాలుంటాయని ప్రతిపాదిత ప్రాజెక్టు రిపోర్టులో ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ ఇన్‌స్టిట్యూట్ ద్వారా వైద్య ఆరోగ్య రంగంలో దాదాపు 10వేల మందికి ఉపాధి అవకాశాలుంటాయని ప్రచారం చేస్తోంది. కొత్త ప్రాజెక్టుల ద్వారా ఉపాధి కల్పించే విషయంలో కేవలం ప్రచారం కోసమే ప్రభుత్వం ఇలా అంకెలను మార్చి చెబుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టీచర్లకు అర్ధ జీతపు సెలవు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా, మండల పరిషత్, పురపాలక సంఘాలు, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు అర్ధజీతపు ఎన్‌క్యాష్‌మెంట్ సెలవుకు అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఫైల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేశారని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐ వెంకటేశ్వరరావు, పి బాబురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నంద్యాలలో బిజెపి బలపరిచిన టిడిపి అభ్యర్థిని ఓడించండి..

ఆవాజ్ రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో బిజెపి బలపరిచిన టిడిపి అభ్యర్థిని ఓడించాలని ఆవాజ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆవాజ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముర్తుజా, ఎం ఇంతియాజ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి ఆర్థిక రాజకీయ విధానాలను టిడిపి కూడా అనుసరిస్తోందని వారు తెలిపారు. ముస్లిం మైనార్టీల పట్ల ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలనూ టిడిపి అవలంబించలేదని పేర్కొన్నారు. జస్టిస్ రంగనాథ్ కమిషన్ రిపోర్టు ఆధారంగా ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ అమలు పరుస్తామని ఎన్నికల్లో టిడిపి హామీ ఇచ్చి, అమలు చేయలేదన్నారు. ముస్లిం మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన ఈ మూడేళ్లలో బడ్జెట్ కేటాయించలేదని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం ఏలాంటి చర్యలూ తీసుకోలేదని, ముస్లింలపై జరుగుతున్న దాడులను ఏ సందర్భంలోనూ ఖండించలేదని వివరించారు. అన్ని సామాజిక తరగతుల కంటే ముస్లింలు దారిద్ర రేఖకు దిగువన ఉన్నారని నివేదికలు చెప్పుతున్నాయన్నారు. వీరి పట్ల నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, కనీసం మంత్రివర్గంలో మైనార్టీలకు చోటు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో బిజెపి బలపరిచిన టిడిపి అభ్యర్థిని ఓడించాలన్నారు.

ఆపరేషన్ జనాకర్ష

- ఎన్నికలపై బాబు దృష్టి
- అధికారులపై తగ్గిన ఒత్తిడి
- సిఎస్‌కు సమీక్షల భాధ్యత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కీలకమైన పాలనా వ్యవహారాలకు సమయం తగ్గించుకుని, జనాన్ని ఆకట్టుకునే చర్యలకు ఎక్కువ సమయం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈ మార్పు అవసరమని సిఎం భావిస్తున్నారు. ఇన్నాళ్లూ ఎక్కువ కాలం వివిధ సమీక్షలతో గడిపిన ఆయన, ఇక మీదట ఆ బాధ్యతను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌కు అప్పగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల దినేష్‌కుమార్ కూడా సమీక్షల జోరును పెంచారని ప్రచారం సాగుతోంది. రోజూ చంద్రబాబునాయుడు గంటల కొద్దీ సమీక్షల నిర్వహణలో నిమగ్నమైపోయేవారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సమీక్షలు కొనసాగుతునే ఉండేవి. ఈ పరిస్థితి అధికారులకు తీవ్ర అసౌకర్యంగా ఉండేది. వారికి సాధారణంగా చేపట్టాల్సిన దైనందిక విధులకూ సమయం లభించేదికాదు. ముఖ్యమంత్రే స్వయంగా ఎక్కువగా సమీక్షలు నిర్వహిస్తున్నందున సిఎస్ సైతం వాటిలో ఒక పాత్రధారిగానే మిగిలిపోతుండేవారు. కానీ ఇప్పటికే ఈ పరిస్థితిలో తాజాగా మార్పు కనిపిస్తోంది. చంద్రబాబు సమీక్షలను తగ్గించుకున్నారు. సిఎస్ సమీక్షలను పెంచారు. 2019లో జరిగే సాధారణ ఎన్నికలకు కేవలం 20 నెలలు మాత్రమే సమయమున్నందున, ఇప్పటి నుంచి రాజకీయాలపై ఎక్కువగా దృష్టి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిపక్ష వైకాపా నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తుండడం, అనేక అంశాల్లో ప్రజల నుంచీ వ్యతిరేకత పెరగడం, అనుకున్న స్థాయిలో పథకాలు అమలు లేకపోవడం వంటి కారణాలు చంద్రబాబును ఇబ్బంది పెడుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఇబ్బందులు తప్పవనే భయం కూడా ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటి నుంచీ వివిధ అంశాలపై దృష్టి పెట్టకపోతే పార్టీకి నష్టం వాటిల్లగలదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓటు బ్యాంకుకు కావాల్సిన సంక్షేమం, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు వంటి కీలక విభాగాలపై సమీక్షలు నిర్వహించి, వాటి ప్రగతి వేగవంతమయ్యేలా చూడాలని సిఎస్‌కు చంద్రబాబు సూచించినట్లు సమాచారం. కొద్ది రోజులుగా సిఎస్ వివిధ శాఖ అధికారులతో నిర్వహించే సమీక్షలు ఊపందుకున్నాయి. అయితే చంద్రబాబు నిర్వహించిన సమీక్షల్లా ఇవి గంటల తరబడి కాకుండా క్లుప్తంగా, అర్థవంతంగా ఉంటున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈవిధానం వల్ల తమపై ఒత్తిడి కూడా కొంతవరకు తగ్గి, సమీక్షలేతర పాలన వ్యవహారాలు, క్షేత్రస్థాయి పరిశీలనలకు అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్ వినియోగానికి రీచార్జి కూపన్లు

సిబ్బందికి పొంచి ఉన్న ఉద్యోగ గండం

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు)



విద్యుత్ వినియోగానికి రీచార్జి కూపన్లు రానున్నాయి. ఇప్పటిదాకా మనం ఇళ్ళలో వినియోగించుకుంటున్న విద్యుత్‌ను సిబ్బంది స్థంభం నుంచి ఇంట్లోకి కనెక్షన్ ఇచ్చి విద్యుత్ మీటరు బిగిస్తారు. నెలనెలా విద్యుత్ మీటరు రీడింగ్ తీసి బిల్లు చేతిలో పెడతారు. దాన్ని విద్యుత్ వసూలు కేంద్రానికి వెళ్లి చెల్లిస్తాం. ప్రస్తుతం విద్యుత్ వినియోగదారులు అనుసరిస్తున్న పద్ధతి ఇది. భవిష్యత్ కాలంలో ఈ పద్ధతి మారనుంది. సెల్‌ఫోన్ రీచార్జి అయిపోయిన వెంటనే డబ్బులు చెల్లించి ఎలా రీచార్జి చేసుకుంటామో ఇళ్ళలో వినియోగించే విద్యుత్‌కూ అలాగే రీచార్జి కూపన్లు రాబోతున్నాయి. ఇందుకు సంబంధించి ప్రత్యేక (రీచార్జి చేసుకునేందుకు వీలుగా) మీటర్లు రాబోతున్నాయి. మనం చేయవలసిందల్లా నెలకు ఎంత విద్యుత్ వినియోగిస్తామో సుమారుగా తెలుసుకొని ఆమేరకు రీచార్జి చేసుకోవడమే. విద్యుత్ ఎక్కువ వినియోగించి రీచార్జి అయిపోతే మళ్లీ డబ్బులు చెల్లించి రీచార్జి వేసుకోవాలి. దీన్నే సైబర్ విద్యుత్ వినియోగం అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఇటీవల విద్యుత్ సైబర్ గ్రిడ్ త్వరలో రాబోతుందని ప్రకటించారు. సైబర్ గ్రిడ్ అందుబాటులోకి వస్తే విద్యుత్ వినియోగానికీ సెల్‌ఫోన్ కార్డుల్లాగా రీచార్జి కూపన్లు తీసుకోవలసి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని విశాఖపట్టణంలో ఈ తరహా పరిశోధనలు జరుగుతున్నాయి. మోడల్ జిల్లాగా రాష్ట్రంలో విశాఖ, మరొక జిల్లాను ముందుగా ఎంచుకోనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే విద్యుత్ సిబ్బంది బిల్లులు చెల్లించని వారి చుట్టూ తిరగడానికే అధిక సిబ్బందిని కేటాయించవలసి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. సైబర్ గ్రిడ్ విధానం అమలులోకి వస్తే సిబ్బందిని తగ్గించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. విద్యుత్ ఎగవేతదారులూ ఉండరని చెబుతోంది. ఇప్పుడు ఇళ్ళ వెంట నెలనెలా మీటరు రీడింగ్‌ల కోసం వచ్చే సిబ్బందినీ తగ్గించే అవకాశం ఉంది. సైబర్ గ్రిడ్ విద్యుత్ విధానం అమలులోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది ఉద్యోగులు తమ జీవన భృతి కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

విశాఖలో ఉన్మాది ఘాతుకం

- పెట్రోలు పోసి .. నిప్పంటించి.. ప్రియురాలి హత్య
- తానూ ఆత్మహత్యకు పాల్పడ్డ నిందితుడు
- అక్కను రక్షించే యత్నంలో తమ్ముడు మరణం



రూప మృతదేహం, (ఇన్‌సెట్లో) రూప ఫైల్‌ఫొటో

ప్రజాశక్తి- విశాఖ, భీమునిపట్నం

విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం టి.నగరపాలెంలో ఒక యువకుడు ప్రేమించిన అమ్మాయిపై పెట్రోలు పోసి, తగులబెట్టాడు. అనంతరం తానూ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. టి.నగరపాలేనికి చెందిన పొట్నూరు రూప (20) స్థానిక బాసర కళాశాలలో బిఎస్సీ సెకెండ్ ఇయర్ చదువుతోంది. ఉపాధి కోసం ఏడాది క్రితం విజయనగరం నుంచి వచ్చిన పతివాడ హరి సంతోష్ (24), తండ్రి రమణతో కలిసి తగరపువలసలో నివసిస్తున్నాడు. హైవేకి ఆనుకొని ఉన్న పరుపులు, దిండులు కుట్టే దుకాణంలో పని చేస్తున్నాడు. కొద్దికాలం క్రితం అతడికి రూపతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. ఈ విషయం తెలిసి రూప కుటుంబీకులు హరిసంతోష్‌ను మందలించారు. దీంతో శనివారం మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో రూప ఇంటికి వెళ్లి, ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తరువాత అక్కడినుంచి పరారయ్యాడు. మంటల్లో చిక్కుకున్న రూప కేకలు వేయడంతో పక్క గదిలో ఉన్న తమ్ముడు ఉపేంద్ర ఆమెను రక్షించే ప్రయత్నంలో మంటల్లో చిక్కుకుని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. రూప సంఘటనాస్థలిలోనే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన రూప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. హంతకుడైన హరిసంతోష్‌ను అరెస్టు చేసేవరకూ మృతదేహాన్ని తరలించొద్దంటూ పట్టుబట్టారు. పరారైన హరి సంతోష్ విజయనగరం జిల్లా విటి అగ్రహారం వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని పోలీసులు రూప కుటుంబ సభ్యులకు తెలియజేసి, తరువాత రూప మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని మధురవాడ పోలీస్ సబ్ డివిజన్ ఎసిపి మోహనరావు, భీమిలి సిఐ బాల సూర్యారావు, ఎస్ఐ పి.శ్రీను పరిశీలించారు. సిఐ బాల సూర్యారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయేషా కేసు పునర్విచారణకు న్యాయస్థానం తిరస్కరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఆయేషామీరా హత్య కేసు పునర్విచారణ అంశం తమ పరిధిలోకి రాదని విజయవాడ నాల్గో అడిషనల్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది. కేసు పునర్విచారణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఈ కేసుపై ప్రభుత్వం నియమించిన సిట్ ఇటీవల పిటిషన్ వేసిన నేపథ్యంలో కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. కృష్ణాజిల్లా మండల కేంద్రమైన ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో జరిగిన బిఫార్మసీ విద్యార్థి ఆయేషామీరా హత్య కేసులో సత్యంబాబును ప్రధాన నిందితునిగా అప్పట్లో పోలీసులు చేర్చారు. కింది కోర్టు సత్యంబాబును నేరస్తుడిగా భావించి శిక్ష విధించింది. అయితే సత్యంబాబు తాను నిరపరాధినని హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు విచారించి నిర్దోషిగా ఏడేళ్ల తర్వాత జైలు నుంచి విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో అసలు నిందితులెవరో తేల్చాలని, అసలైన దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని, దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని ఆయేషామీరా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు పునర్విచారణకు ఇటీవల సిట్‌ను నియమిస్తూ జిఒ జారీ చేసింది. దీంతో రంగంలోకి దిగిన సిట్ బృందం రెండురోజుల క్రితం కేసు పునర్విచారణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ విజయవాడ కోర్టును ఆశ్రయించింది. విచారణకు అనుమతినివ్వాలా? వద్దా? అనే అంశంపై శుక్రవారం వాదోపవాదనలు జరిగాయి. అనంతరం శనివారం సిట్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. విద్యార్థిని హత్యకు గురైన ప్రదేశం విజయవాడ న్యాయస్థానం పరిధిలో ఉండటంతో తాము అనుమతి కోసం ఇక్కడ పిటిషన్ వేసినట్లు సిట్ తరపు న్యాయవాది వాదించారు. అయితే హైకోర్టులో కేసు నడిచిన నేపథ్యంలో ఈ అంశం తమ పరిధిలోకి రాదని, హైకోర్టులో ఇంపీరియల్ పిటిషన్‌ను వేసుకోవాలని సిట్ బృందానికి కోర్టు సూచించింది.

సిఎం ప్యాంట్రీకార్ తనిఖీపై ఇసికి ఐఎస్‌డబ్ల్యు ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాన్వాయ్‌లోని ప్యాంట్రీకార్‌ను కర్నూలు జిల్లా గాజులమెట్ట వద్ద పోలీసులు తనిఖీ చేసిన వ్యవహారంపై రాష్ట్ర నిఘా, భద్రత విభాగం (ఐఎస్‌డబ్ల్యు) దృష్టి సారించింది. ఈ వ్యవహారంపై ఐఎస్‌డబ్ల్యు ఎన్నికల కమిషన్‌కు శనివారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉండే చంద్రబాబుకు మావోయిస్టులు నుంచి బెదిరింపులు వచ్చిన విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. తమిళనాడు ఎర్రచందనం కూలీల ఎన్‌కౌంటర్ అనంతరం జరిగిన పరిణామాలు, ఢిల్లీలోని ఎపి భవన్‌లో సిఎంపై రెక్కీ నిర్వహించిన విషయాన్నీ ఫిర్యాదులో ప్రస్తావించినట్లు సమాచారం. చంద్రబాబు ప్యాంట్రీకార్ వచ్చే సమాచారాన్ని ముందుగానే ఎవరు బహిర్గతం చేశారు? ఏ లక్ష్యంతో చేశారో విచారణ చేయాలని కోరినట్లు తెలుస్తోంది. నంద్యాల ఎన్నికల ప్రచార రోడ్‌షోలో 'చంద్రబాబును కాల్చేపారేసినా తప్పులేదంటూ' వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా ఫిర్యాదులో పొందుపరిచినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారంపై ఇసికి ఫిర్యాదు చేయడాన్ని వైసిపి తప్పుబట్టింది. అనుమానిత వాహనాలను తనిఖీ చేయాల్సిందిగా కోరే అధికారం ఎవ్వరికైనా ఉంటుందని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి టి అశోక్ యాదవ్ తెలిపారు. పోలీసులు కేవలం ప్యాంట్రీకార్‌ను మాత్రమే తనిఖీ చేశారనీ, దాని వెంబడే వచ్చిన మరికొన్ని అనుమానిత వాహనాలను పోలీసులు వదిలేశారనీ ఆయన చెప్పారు. పోలీస్, రెవిన్యూ తదితర ప్రభుత్వ యంత్రాంగాన్ని టిడిపి అధికారం ముసుగులో స్వలాభం కోసం వాడుకుంటోందని విమర్శించారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయం కలేనా..?

- ప్రకటించింది రూ.500 కోట్లు.. మంజూరు చేసింది రూ.11 కోట్లు
- ఈ నిధులు కూడా కాగితాలకే పరిమితం
- పరిశోధనకు దూరం కానున్న సీమ విద్యార్థులు



అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం జంతలూరు వద్ద సెంట్రల్ యూనివర్శిటీ కోసం కేటాయించిన స్థలం.

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు పాలకులు ఇచ్చిన హామీ సాధ్యమవుతుందా... లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విభజన నేపథ్యంలో రాష్ట్రంలో కీలకమైన ఎయిమ్స్, అగ్రికల్చర్ యూనివర్సిటీలాంటి సంస్థలను నెలకొల్పుతామని కేంద్ర ప్రభుత్వం ఆశలు రేపింది. ఇందులో భాగంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని అనంతపురంలో ఏర్పాటు చేస్తామని గతంలో హామీఇచ్చారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు అనేక మార్లు దీనిపై ప్రకటనలు గుప్పించారు. ఏళ్లు గడుస్తున్నా దీనిపై ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి ఉంది.

గతేడాది సెప్టెంబరులో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం జంతలూరు గ్రామంలో కేంద్ర విశ్వవిద్యాలయం నెలకొల్పుతామని కేంద్ర మానవ వనరుల విద్యా శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ ప్రకటించారు. ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణపై దృష్టి సారించకపోవడంతోనే వెనుకబడిన రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం జరుగుతోందని మేధావి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టి మూడేళ్లు దాటినా 'అదిగో... ఇదిగో...' అని మాటలు చెప్పడం తప్పితే ఆచరణలో కేంద్రీయ విశ్వవిద్యాలయం పనులు ఇంచు కూడా కదలని పరిస్థితి. ఏర్పాటులో పురోగతి కనబడకపోవటంతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తారా లేక ఇతర ప్రాంతాలకు తరలిస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే ఈ ప్రాంత విద్యార్థులు, విద్యావంతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధించి జంతలూరు గ్రామంలో 450 ఎకరాలను అనువైన స్థలంగా అధికారులు గుర్తించారు. 2015-16 విద్యా సంవత్సరంలో తాత్కాలికంగా జెఎన్‌టియులో తరగతులు మొదలవుతాయని ప్రభుత్వం అప్పట్లో హడావుడి చేసింది. ఇందుకు సంబంధించి 2015-16లో కేంద్రం రూ.కోటి విడుదల చేసి చేతులు దులుపుకుంది. 2016-17కు గత ఫిబ్రవరి బడ్జెట్‌లో కేవలం రూ.పది కోట్లు కేటాయించారు. 2017-18 సంవత్సరానికి అసలు నిధుల ప్రస్తావనే లేదు. దాదాపు రూ.500 కోట్లు వ్యయం చేయాల్సిన విశ్వవిద్యాలయానికి ఇప్పటికి కేటాయించింది కేవలం రూ.11 కోట్లు మాత్రమే. అది కూడా కాగితాల మీదే ఉంది. డబ్బు రూపంలో ఒక్కపైసా కూడా విడుదల చేసిన దాఖలాలు లేవు. వచ్చే విద్యా సంవత్సరానికి కనీసం తాత్కాలిక భవనాల్లో అయినా తరగతులు ప్రారంభిస్తారా లేక అనంత యువత ఆశయాన్ని నీరు గారుస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకూ దేశంలో 46 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. గోవా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తప్ప మిగతా అన్ని రాష్ట్రాల్లోనూ, ఢిల్లీ, పాండిచ్చేరి వంటి కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. దేశంలోనే కరువుకు కేరాఫ్‌గా ఉన్న అనంతలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే అనంత రూపురేఖల్లో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలన్నింటిలోనూ దేశ, విదేశాల విద్యార్థులు విద్యనభ్యసిస్తారు. అందరికీ జాతీయస్థాయిలో పోటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఒక్కో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో దాదాపు ఐదు వేల మంది విద్యార్థులు, పరిశోధన విద్యార్థులకు విద్యావకాశాలు ఉంటాయి. ఈశాన్య రాష్ట్రాల్లో కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోలాగా రాయలసీమ ప్రాంత విద్యార్థులకు ప్రత్యేక స్థానిక కోటాను విశ్వవిద్యాలయ ప్రవేశాల్లో అమలుపరిస్తే సీమ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. విస్తృత స్థాయి బోధన, పరిశోధనలు కొనసాగుతాయి. 2017-18 విద్యా సంవత్సరానికైనా కనీసం తాత్కాలిక భవనాల్లో తరగతులు ప్రారంభించి, పూర్తిస్థాయి నిధులు కేటాయించి కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని అనంత ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి మార్గదర్శకాలూ అందలేదు...



కేంద్రీయ విశ్వవిద్యా లయం ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలూ అందలేదు. స్థలం ఎంపిక చేయటం వరకూ అందరికీ తెలిసిన విషయమే. దీనిపై చట్టం చేశారని కొంత మేరకు సమాచారం ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల ఆధారంగానే విశ్వవిద్యాలయం నిర్మాణం జరగాల్సి ఉంది.

-కూడేరు రాజగోపాల్, జెఎన్‌టియు ఉపకులపతి

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి



విభజన సందర్భంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. కేంద్రీయ విశ్వవిద్యాలయంపై గతేడాది చట్టం చేయాల్సి ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విశ్వవిద్యాలయంపై ఒత్తిడి పెంచాలి.

- డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ

అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలి. ఇప్పటికే భూమిని గుర్తించినట్లు చెబుతున్నా ఎలాంటి అభివృద్ధి చర్యలూ లేవు.

- డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, చరిత్ర, సాహిత్య పరిశోధకులు

'మోడల్' స్కూళ్లకు మొండిచేయి

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటుంది. ఈ పథకం కోసం వెచ్చించే నిధులు కేంద్ర ప్రభుత్వం 75 శాతం రాష్ట్ర ప్రభుత్వం 25శాతం కేటాయించనున్నది. ఇదంతా నాణేనానికి ఒకవైపు మాత్రమే మరోవైపు మాత్రం 2015 నుంచి కేంద్రం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఆ భారమంతా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తూ వచ్చింది. ప్రస్తుతం ఈ ఆర్థిక భారాన్ని మోయలేమని చేతులెత్తేసింది.దీంతో మూడు నెలలుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదు.

75 శాతం వాటా నిలిపివేసిన కేంద్రం సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు బంద్

2013లో రాష్ట్రంలో 155 మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేశారు. 2013 నుంచి 2014 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి మోడల్ పాఠశాలలకు రావాల్సిన వాటాకు రాష్ట్ర ప్రభుత్వం వాటా జతచేసి ఉద్యోగులు, సిబ్బంది జీతాలు చెల్లించేవారు. 2015 నుంచి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన వాటా నిలిపివేయడంతో చంద్రబాబు ప్రభుత్వం కేంద్రం నుంచి రావాల్సిన వాటాను రాబట్టుకోలేక సర్దుబాటు చేసుకుంటూ వచ్చింది. క్రమంగా తలకుమించిన భారంగా భావించిన రాష్ట్ర ప్రభుత్వం మోడల్ పాఠశాలల ఉద్యోగుల జీతాలు చెల్లింపులో జాప్యం చేస్తూ వస్తోంది.

రాష్ట్రంలో మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి దాదాపు 40 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఆన్‌లైన్లో ప్రతినెలా బిల్లులు పంపిస్తున్నప్పటికీ జీతాలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఈ విషయమై మోడల్ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ నర్సింహారావును ప్రజాశక్తి వివరణ కోరగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన వెంటనే మూడు నెలల జీతాలు చెల్లిస్తామన్నారు.



రణస్థలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఇంటర్ విద్యార్థులకు 'మధ్యాహ్న భోజనం' ఏదీ?

ఆంగ్ల మాధ్యమానికి నోచని సక్సెస్ పాఠశాలలు హామీలను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అటకెక్కించింది. సక్సెస్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం చదువుతున్న విద్యార్థుల కోసం ఇంటర్‌లో కూడా ఆంగ్ల మాధ్యమం కోర్సు ప్రవేశపెడతామని ఇచ్చిన హామీ కూడా రెండేళ్లు దాటిపోయినా అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 398 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో సుమారు రెండు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు.

గ్రామీణ ప్రాంతం నుంచి మండల కేంద్రంలోని కళాశాలలకు ఉదయాన్నే బయలుదేరాల్సి ఉండటం... ఆ సమయంలో భోజనం క్యారియర్లను తీసుకురాలేకపోతున్నారు.. కొందరు అల్పహారంతో కడుపునింపుకుంటే, మరికొందరు సాయంత్రం ఇంటికి చేరే వరకు ఖాళీ కడుపుతోనే ఉంటున్నారు. దీంతో విద్యార్థులు చదువుపై సరైన ఏకాగ్రత చూపలేకపోతున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకొని ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని 2015లో టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. అది నేటికీ అమలు కాకపోవడంతో విద్యార్థులకు ఎదురుచూపులే మిగిలాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్య అందించేందుకు ప్రభుత్వం 2008లో సక్సెస్ పాఠశాలలను ప్రవేశపెట్టింది. టిడిపి అధికారంలోకొచ్చాక 2015లో 3,428 పాఠశాలలను పూర్తి స్థాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలుగా మారుస్తూ జిఒ నంబర్ 53ని విడుదల చేసింది. సక్సెస్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థుల కోసం ఇంటర్‌లో కూడా ఇంగ్లీష్ మీడియం కోర్సు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం హామీ ఇచ్చింది. రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీ ఆచరణకు నోచుకోకపోవడంతో పదో తరగతిలో ఇంగ్లీష్ మీడియం చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో తెలుగు మీడియంలో చదవాల్సి వస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా మున్సిపల్ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంను ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోంది. సక్సెస్ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నా ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పస్తులతోనే తరగతులు వింటున్నాం



ఇంట్లో ఇబ్బందులతో ఒక్కో రోజు కళాశాలకు ఇంటి నుంచి క్యారియర్ తీసుకురాలేకపోతున్నాం. పస్తులతోనే తరగతులను వింటున్నాం. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తే మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

-ఎం.ఎర్రంనాయుడు, ద్వితీయ సంవత్సరం విద్యార్థి, దీర్ఘాసి, పోలాకి మండలం

కారం మిల్లుల్లో ఆహార నియంత్రణాధికారుల దాడులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని కారం మిల్లుల్లో ఆహార నియంత్రణాధికారులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. కారంలో పెద్ద ఎత్తున చైనా కారం, కలర్స్ కలుపుతున్నారనే అనుమానంతో ఆహార నియంత్రణ శాఖ కమిషనర్ సుజాత శర్మ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు, ఇన్‌స్పెక్టర్లు మూకుమ్మడిగా 9 బృందాలుగా ఏర్పడి మిర్చియార్డు సమీపంలోని కారం తయారీ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. 36 నమూనాలు సేకరించామని, నమూనాలను పరీక్షలకు పంపిస్తామని, కల్తీ ఉన్నట్లు తేలితే ఆయా మిల్లులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా తాలుకాయాలు, మిర్చి తొడేలనూ కారంలో కలుపుతున్నట్లు గుర్తించారు. మిర్చియార్డు సమీపంలోని లక్ష్మీగణపతి కారం తయారీ మిల్లులో 1500 కేజీల విలువైన 30 బస్తాల పాతకారం నిల్వలు గుర్తించి వాటిని సీజ్ చేశారు. దాడుల్లో 13 జిల్లాల ఆహార నియంత్రణాధికారులు పాల్గొన్నారు.



అత్తమామల ఇంటివద్దే తల్లి, బంధువులతో దీక్ష చేపట్టిన యువతి

అత్తింటి ఎదుట కోడలు దీక్ష

ప్రజాశక్తి -బాపట్ల (గుంటూరు)

వరకట్నం కోసం తన భర్త, అత్తమామలు వేధిస్తున్నారని, వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ అత్తింటి ఎదుట ఓ వివాహిత శనివారం దీక్షకు పూనుకుంది. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా చీరాల మండలం రామ్‌నగర్‌కు చెందిన దేవూరి అనూషా బాపట్లకు చెందిన దేవూరి వికాస్‌ను 2017 ఏప్రిల్ 22న ప్రేమ వివాహం చేసుకుంది. వివాహ సమయంలో రూ.10 లక్షల నగదు, 20 సవర్ల బంగారాన్ని కట్నంగా ఇచ్చామని తెలిపింది. అయినా మరింత కట్నం తీసుకురమ్మని భర్త, అత్తమామలు తనను ఇంటి నుంచి గెంటివేశారని విలపిస్తూ తెలిపింది. అత్త దేవూరి వేళాంగిణి, మామ దేవూరి పిచ్చయ్య, (బాపట్ల హెడ్ పోస్టాఫీసులో ఉద్యోగి) ఆడపడుచులు బోగిరి తులసి, దేవూరి తేజస్వినిలు తన భర్తకు తప్పుడు మాటలు చెప్పి కాపురం చేయనీయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అనూషా తెలిపింది. తనకు న్యాయం జరిగేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆమె స్పష్టం చేస్తూ దీక్షకు దిగింది.

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల విస్తారంగా, మరికొన్ని చోట్ల ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. శనివారం కురిసిన ఈ వర్షాలతో పంటలకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. తూర్పు మన్యంలోని విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చింతూరు డివిజన్‌లో అత్యధికంగా సరాసరిన 72.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోనసీమ, డెల్టా పరిధిలో చిన్నపాటి వర్షం కురుస్తూనే ఉంది. ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా గత 24 గంటల్లో 26.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదవ్వగా వేలేరుపాడు మండలంలో అత్యధికంగా 65.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జీలుగుమిల్లి మండలంలో పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. విశాఖ ఏజెన్సీతోపాటు మైదాన ప్రాంతం నర్సీపట్నం పరిసర గ్రామాల్లోనూ విస్తారంగా వర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ముంచంగిపుట్టు వారపుసంతలో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడ్డారు. నర్సీపట్నంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్ర, శనివారాల్లో ఆకాశం మేఘావృతమై పగటి ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలకు పడిపోయాయి. కంచికచర్లలో మార్కెట్ యార్డు వద్ద నిల్వ ఉంచిన పెసలను కాపాడుకోవడానికి రైతులు పరదాలు కప్పారు. ముసునూరు మండలంలో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నను కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడ్డారు. రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. విజయవాడలో 12.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా 10.3 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. కొంతకాలంగా వర్షాభావంతో నీరు లేని వరి పంట పొలాలకు ఈ వర్షం ఉపకరించినట్లయింది. విజయనగరం జిల్లావ్యాప్తంగా 12.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా మక్కువ, గరుగుబిల్లి మండలాల్లో 36 మిల్లీమీటర్లు, అత్యల్పంగా విజయనగరంలో 2.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



తూర్పుగోదావరి జిల్లా విఆర్.పురం మండలం అన్నవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

పశ్చిమ దిశగా బలమైన గాలులు

ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా, పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా అల్పపీడనం ఏర్పడిందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీనికి అనుసంధానంగా ఉపరితల ఆవర్తనం 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించి ఉందని తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జల్లులు, వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పారు. అదే విధంగా పశ్చిమ దిశగా వీచే గాలులు గంటకు 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో కోస్తా వెంబడి వీస్తాయని వెల్లడించారు.

పోలీసులతో ప్రభుత్వాలు మనుగడ సాధించలేవు

కాపు ఉద్యమ నేత ముద్రగడ

ప్రజాశక్తి - కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)



ప్రజలతో మమేకమైన ప్రభుత్వాలే చరిత్రలో నిలిచిపోతాయని, పోలీసులతో నడిపించే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం వద్ద కాపు జెఎసి నాయకులతో కలిసి 25వ రోజున చేపట్టిన పాదయాత్రనూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేటువద్ద శిబిరంలో నిరసన తెలిపారు. ముద్రగడ నివాసంలోని గేటువద్దకు భారీస్థాయిలో కాపులు, ఇతర సామాజిక తరగతులకు చెందిన వారు చేరుకుని నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం మాజీ ఎంఎల్ఎ తానేటి వనిత, మాజీ ఎంఎల్‌సి కోడూరి శివరామకృష్ణ, బిసి నాయకులు కొవ్వూరు గారిపాటి కృష్ణ, తోట రామకృష్ణ కిర్లంపూడి వచ్చి ముద్రగడకు మద్దతు తెలియజేశారు.

ఇచ్చిన మాటను నెరవేర్చాలని కోరితే ఎందుకంత పౌరుషం

కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని అడుగుతుంటే ఎందుకు అంత పౌరుషమని చంద్రబాబును ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. చంద్రబాబు తీరుతో కాపులు విసిగిపోతున్నారని, సమస్య పరిష్కరించకుండా 25 రోజులు పాదయాత్రను అడ్డుకోవడం దారుణమన్నారు. హామీలను నెరవేర్చాలని అడుగుతుంటే ఇంత దారుణమైన స్థితిలో కక్షసాధింపు ఎందుకని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సముద్రంలో కలిసిపోతుందన్నారు. రాష్ట్ర జనాభాలో 4వ వంతు జనాభా కలిగిన కాపు సామాజిక తరగతి సమస్యపై చంద్రబాబు స్పందించకుండా కాపులను అణగదొక్కడం సరికాదని అన్నారు.

శ్రీచైతన్య బస్సు.. ఆయిల్ ట్యాంకర్ ఢీ

ప్రజాశక్తి-ఫిరంగిపురం

శ్రీ చైతన్య జూనియర్ కళాశాల బస్సును ఓ ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న సంఘటన గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిరంగిపురం నుంచి నరసరావుపేట వెళుతున్న కళాశాల బస్సును రేపూడి గ్రామ సమీపంలో ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు విద్యార్థినులు, ఒక మహిళా లెక్చరర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం గురించి తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి మరో ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో తేజస్విని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు, చిత్రంలో చినరాజప్ప

ఎన్నికలను డిస్టర్బ్ చేస్తున్న ముద్రగడ

ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

ప్రజాశక్తి-కాకినాడ

మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఎన్నికలను డిస్టర్బ్ చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పత్తిపాటి పుల్లరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సిఎం చంద్రబాబు కాపులను బిసిల్లో చేరుస్తారని తెలిసే ముద్రగడ లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారని రాజప్ప విమర్శించారు. పాదయాత్రలు, మోకాలు యాత్రలు ఎటువంటి యాత్రలకైనా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. గోడదూకైనా ముద్రగడ పాదయాత్ర చేయడానికి సిద్ధమైతే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. పాదయాత్ర కోసం ముద్రగడ దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇస్తామన్నారు. ప్రభుత్వంపై జగన్ లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. నంద్యాలలో సిఎంకు సంబంధించిన ఆహార పదార్థాల వ్యాన్‌ను సైతం తనిఖీ చేయడం ద్వారా ప్రతిపక్ష నేతల మానసిక వైఖరి ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాకినాడ కార్పొరేషన్‌లో రెబల్ అభ్యర్థులు మాట వినకపోతే పార్టీ నుంచి బహిష్కరిస్తామన్నారు.

గోపాల మిత్రల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

అనంతపురంలో అక్రమంగా తొలగించిన గోపాల మిత్రలను తిరిగి పనిలోకి తీసుకోవాలని, ఇతర పారితోషకం పెంపుదల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంటూరు జిల్లాలోని గోపాల మిత్రలు గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పారితోషకం పెంచాలని కోరుతూ ధర్నా చేసిన నేరానికి అనంతపురంలో 60 మంది గోపాల మిత్రలను తొలగించారన్నారు. ఎటువంటి ఉత్తర్వులూ లేకుండా, నోటిమాటతో విధుల నుండి తొలగించారని చెప్పారు.

సందర్భం

ప్రశ్న, ప్రజ్ఞ, ప్రగతి : కన్యాశుల్కం త్రినేత్రాలు

కాలాన్ని తట్టుకు నిలబడే ఒక కళారూపం ఎప్పుడూ శ్రద్ధతో నిర్మితం అయిన భావనాలయం. ఇక్కడ భావనలే సమస్త రూపాలూ దాలుస్తాయి. వాటి వాస్తవ ఆధారాలు లోకంలో ఉంటాయి. నాటకానికి మొదటి దర్శకుడు రచయితే. తానే ఈ కథన స్వరం పలు పాత్రలకు ఇచ్చి, వర్ణనలను మినహాయించుకుని, చెప్పదలుచుకున్న వాతావరణాన్ని తన ఊహా రంగస్థలిపై సృష్టి చేస్తాడు. సంభాషణలు, కదలికలు, సంగీతం మాత్రమే కథను నడిపిస్తాయి. సాహిత్యంలో మిగతా ఏ ప్రక్రియలైనా ఒక్క రచయితే నిర్వహించవచ్చు కానీ, నాటకం అనేది ఒక సమాహార కళ. అక్షరంగా మొదలై అభినయంగా ముగిసే, ఒక పరిణామ ప్రక్రియ. ఈ నాటక ప్రక్రియతో ఆధునిక తెలుగు సాహిత్యం ప్రారంభం కావడం, ఒక పరిణతిని సూచిస్తుంది. అలాగే కొన్ని ప్రశ్నలకు కూడా దారి తీస్తుంది.

కన్యాశుల్కం నాటకం ఈ ఏడాది ఆగస్టులో నూట పాతికేళ్ల ఉత్సవ సందర్భంగా మన ముందర ఉన్నది. ఈ నాటకం ప్రశ్నలకు పురిటి గది. 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అని గిరీశం ద్వారా మహాకవి హాస్య మహాశాసనం జారీ చేసినట్టే, మనమూ గ్రహించవలసింది 'ప్రశ్న అడగని వాడు ఎద్దు మొద్దై పుట్టున్' అని. నాటకం గురించి ప్రశ్నలా? అన్నీ అడిగేసాము కదా అనుకునే వారికి, దారి చూపినది గురజాడ వారే. నవీన కావ్య కళ తనది అని చెప్పారు. సంస్కృతిపరులు అర్థం చేసుకుని హర్షించేందుకు ప్రశ్నలు అవసరం. నాటకాన్ని ఇలా మొదలయింది, ఇది ఇంతే అనుకునే వారికి ఏమీ చెప్పలేము కానీ మొదటి ప్రశ్న, ఆరంభ దృశ్యం గురించే.

గురజాడ వారి నాటకం గిరీశం స్వగతంతో బొంకుల దిబ్బ మీదనే ఎందుకు మొదలవ్వాలి? విజయనగరంలో ఇంకేవీ ప్రముఖ స్థలాలు లేవా? ఎందుకీ ఎంపిక చేశారు గురజాడ? అది నాటక రచయిత ఇష్టం, మనం ఎవరం అడగడానికి అనడం ఒక కొత్త ప్రశ్నకు ఒక మూస జవాబు. ఇంకో విధంగా ఆలోచించడం అక్కర లేదు అనుకునే అజ్ఞానంతో కూడిన దబాయింపు కూడా. బొంకుల దిబ్బ అన్నది ఉంటుందా, అసలు అక్కడ నిలబడి ఎవరైనా బొంకులే పలుకుతారా, పలికితే, వినేవారికి అవి బొంకులని తెలిసిపోవా, ఇంకప్పుడు బొంకుల దిబ్బ విశేష లక్షణం ఏమున్నది?

కోట ఎదురుగా ఉండే ఎత్తైన మిట్ట ప్రాంతం బొంకుల దిబ్బ. ఇవి బొంకులు కావు బంకులు. ఇంగ్లీష్‌లో బంక్ (bunk). పెద విజయరామరాజు కాలంలో, తరువాత సీతారామరాజు కాలంలో కూడా, కోట ఎదురుగా నిలబెట్టిన చిన్న జైలు గదులు ఈ బంక్‌లు. వీటిలో, అప్పట్లో శ్రీకాకుళం నుంచి, దాదాపు రాజమహేంద్రవరం దాకా ఉన్న తమ రాజ్యంలో, తమను ఎదిరించిన వారిని, పన్నులు కట్టడంలో ఎగవేతదారులను, చిన్నా చితకా నేరస్తులను తెచ్చి ఈ బంక్‌లో బందీలుగా ఉంచేవారు. వారి తిండి, నిద్రా అక్కడే. ఈ బంక్‌ల వల్ల ఈ దిబ్బ బంకుల దిబ్బగా గుర్తింపు చెంది, కాలగతిలో అలా జనం నోళ్లల్లో మార్పు చెంది బొంకుల దిబ్బగా మారింది. ఇదంతా గురజాడ వారికి తెలుసు. ఆ కారణంగానే, బొంకుల దిబ్బ ఒక నేర నేపథ్యం గల ప్రదేశం. జైలుకి వెళ్లేంత పెద్ద నేరాలు కాకపోయినా చిన్నా చితకా నేరాలు, మీద పడి తన్నడాలు, అప్పులు ఎగ్గొట్టడాలు, స్త్రీలతో విచ్చలవిడి శృంగార సంబంధాల యావ, వివాహితలైన యువతులకు లవ్ లెటర్లు రాయడాలు, ఆధునికత ముసుగులో, ఒక నేరపూరిత, దగుల్బాజీ మనస్తత్వం గల వ్యక్తిని తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా, నాటక పాత్రగా పరిచయం చేస్తున్నారు గురజాడ. ఆ పాత్ర సాహిత్య ప్రవేశం, నాటక కథరీత్యా కూడా ఎంతో ప్రతీకాత్మకం. నేరమయ చరిత్ర గల బొంకుల దిబ్బ, గురజాడ వారి దృష్టిలో, గిరీశం వంటి నేర బుద్ధి గల కుటిలుడి కథా ప్రవేశానికి అనువైన ప్రదేశం. ఈ బొంకుల దిబ్బ నాటక ఆరంభ స్థలంగా ఎంపిక చేశారు.



ఈ నాటకం, రెండు అగ్రహారాలలోని బడుగు బాపనయ్యల ఇళ్ల బాగోతాల మీదుగా నడిచి, ఒకసారి మఠం సీనులో, మంది నోళ్లలో పడి చివరికి, ఉన్నదల్లా పీల్చుకు తినేసే ప్లీడర్ల వ్యవస్థ అయిన కోర్టుల పాలు అవుతుంది. వ్యక్తురాలైన బుచ్చమ్మ ఎవరితోనో ఇల్లు వదిలి వెళ్లిపోవడం కోర్టు దృష్టిలో నేరం కాదు. అది ఒక ఇంటి వ్యవహారం. ఇక పెళ్లి కూతురి చావు కేసు, అటు శవమూ లేక, ఇటు సాక్షులూ లేక, చతికిలబడి పోతుంది. నాటకం మొదలు బంకుల దిబ్బ కాగా, ఇక నాటకం ముగింపు స్థలం కూడా గురజాడ వారి జాగ్రత్తైన ఎంపికే. కరటక శాస్త్రి, శిష్యుడి బతుకులు బాగు చేసి పంపిస్తుంది మధురవాణి తన ఇంటినుంచే.

ఇక మిగిలిన దృశ్యం, న్యాయం దొరకని కోర్టుల కన్నా, ఈ దురదృష్టవంతులకు న్యాయం చేద్దామని పరితపించే సౌజన్యారావు ఇల్లు. అగ్నిహోత్రావధాన్లుకి ఆఖరున బుచ్చమ్మకి న్యాయం చెయ్యమన్న హితబోధ, లేదా ఆయనపై కేసులు సవ్యమైన కారణాల కోసం నడుస్తాయి అన్న హెచ్చరిక చేస్తాడు ఈ న్యాయవాది. లుబ్ధావధాన్లుకు మంచి బుద్ధులు చెప్పి, మీనాక్షి బతుకు బాగు చేయవలసిన బాధ్యత తనదే అని గుర్తు చేసింది కూడా సౌజన్యారావు గారే. ఇక బుచ్చమ్మ విషయంలో గిరీశం మాట కాసేపు నమ్మిన ఈ న్యాయవాది, చేసిన నిజమైన న్యాయం, మధురవాణి చెప్పినది విని, బుచ్చమ్మ చుట్టూ రక్షణ ఛత్రం వేసి, కపటి అయిన గిరీశాన్ని 'గెట్ అవుట్' అంటూ బయటకు పొమ్మనడం. న్యాయవర్తనం పట్ల వారికి విశ్వాసం ఎక్కువ కనుక, దుష్టబుద్ధి గల గిరీశానికి సైతం 'చదువుకుంటివా, నీక్కూడా సహాయం దొరుకుతుంది' అని భరోసా ఇస్తారు. 'ఒరులేయవి యొనరించిన నరవర, యప్రియంబు తన మనంబునకగు, తానొరులకు యవి సేయకుండుటునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్' అనే భారత పద్యానికి ప్రతిరూపం అయిన అచ్చమైన ఆచ్ఛాణీ సౌజన్యారావు. ఆయనా యువకుడే!

ఆచ్ఛాణీ అంటేనే ఎలిజిబుల్ బాచిలర్ (పెళ్లి కాదగ్గ బ్రహ్మచారి అని అర్థం). అందుకే ముద్దు కోరుతుంది మధురవాణి, న్యాయవాదిని ధర్మ సంకటంలో పడవేస్తుంది. ఇది తెలీక సౌజన్యారావు పాత్రను నడివయసు వాడిగా చూపుతున్నారు మన దర్శకులు. నిజానికి ఈ నాటకంలో గురజాడ ఇద్దరు యువకులను చూపెట్టారు, ఒకడు వచ్చీరాని చదువులతో మోసాలు మరిగిన కపటి గిరీశం, రెండోవారు బాగా చదువుకుని, ఆ చదువు ద్వారా, సమాజంలోని వారికి మేలు చేసేందుకు పాటుపడే వారుగా సౌజన్యారావు. ఇంగ్లీష్ చదువులే ఇద్దరివీ – వానాకాలం చదువు గిరీశానిది, శ్రద్ధగా చదువుకున్న వారు సౌజన్యారావు, ఇద్దరూ యువకులే. తన వెర్రి వేషాల వల్ల గిరీశం ఎక్కువ యువకుడు గానూ, తన నింపాదితనం వలన సౌజన్యారావు నడి వయసు వ్యక్తిగా మనకు తోస్తారు. ఇది నిజానికి నిజం కాదు. అసలు గిరీశం వంటి అరకొర చదువుల అయ్యవార్ల వల్లనే విద్య భ్రష్టు పట్టుతున్నది అందుకే, 'నీ ఇంగ్లీష్ చదువులే కొంపముంచాయి' అని వెంకటేశాన్ని తండ్రి రామచంద్రపురం చెరువు గట్టున కొట్టేది కూడా గిరీశం నిర్వాకాల వల్లనే.

చూసారా, రచనా ప్రణాళిక – మొదటి ద శ్యం ఒక నేరమయ చరిత్ర గల బొంకుల దిబ్బ, గిరీశం వంటి అప్రతిష్ట పాలైన వారుండే చోటు, అక్కడ మొదలు పెట్టడానికీ గురజాడ వారికి ఒక సమంజసత ఉన్నది. అలాగే ఆఖర్న ఈ కథల కొండవాగు ఒరిసొరిసి పారి చివరికి చేరేది, సౌజన్యారావు ఇల్లు, అది న్యాయానికి పుట్టినిల్లు, నాటకంలో న్యాయమే జరగాలని కదా, ఇంత కథా రాశారు గురజాడ.

ఇక నాటకంలో మొదటి స్వగతపు మాటలు మోనోలాగ్ – 'సాయంకాలమైంది'. గిరీశం ప్రాతినిధ్యం వహించే, అటువంటి సమాజ వ్యవహర్తలు ఆచరించే కుటిలత్వం, మోసం, దగా, ఆధునికత పేరిట ప్రజా వ్యతిరేక ధోరణులను చలామణీ చేయడం, తనకు తెలియని జ్ఞానాన్ని నటించడం, ఇవన్నీ పిండప్రాయంలో, ఆనాటి సమాజంలో ఉన్న దుర్లక్షణాలు. వీటన్నిటికీ పొద్దు వాలిపోవాలి. అదీ సాయంకాలం అవడం అంటే. కేవలం ఒకరోజు ముగియడం కాదు, ఒక దుర్నడతల శకం ముగియాలని గురజాడ నాటిన శబ్ద బీజం ఇది. చూడండి ఇది మొదలు విజయనగరం నుంచి బయటకు నడిచిన గిరీశం ఈ కథాక్రమంలో ఎన్నో ప్రయత్నాలు చేసి అన్నింటా విఫలుడై, చివరికి, నాటకంలోంచి కూడా రాత్రివేళ బయటకు పంపించబడతాడు. ఎవరి చేత? ఉత్తమ మానవులైన మధురవాణి, సౌజన్యారావుల చేత. అలా వాడికి పొద్దు వాలి పోయి, అది రాత్రిలా ఘనీభవిస్తుంది. అదే 'డామిట్! కథ అడ్డంగా తిరిగింది!' అంటే. 'సాయంకాలమైంది' అనేది ఈ పాత్ర నాటకారంభంలో చెప్పిన స్వగతం ఐతే, ఆఖరుది కూడా అర్ధ స్వగతమే. ఇది నాటకంలో గురజాడ పాటించిన కళల తూకం. గిరీశం అనే అల్పుడు, సౌజన్యారావు అనే సజ్జనుడు అనే కాంట్రాస్ట్ సృష్టించాడు. ఆడంబరపు పల్కుల గిరీశం, మంచికి నిలిచే సౌజన్యారావు ముందు ఎందుకూ కొరగాకుండా పోతాడు. ఒక గ్రామీణ సమాజాన్ని తాను మోసం చేయగలడు, పిల్లలను బురిడీ కొట్టించగలడు, చదువుకోని ఆడపిల్లలకు అచ్చి బుచ్చి కబుర్లు చెప్పగలడు. కానీ నిజమైన విద్యావంతుల దగ్గర వాడు దమ్మిడీకి కూడా కొరగాడు.

ఈ నాటకంలో ఏ మాటా తీసేసి, మరొక మాట పెట్టలేము అని పెద్దలు అన్నారంటే, ఇంత విశేషమైన సార్థకత ఆ మాటలకు, సందర్భాలకు ఉన్నది. బహుళార్థ సాధక కళా రూపాలు ఎప్పుడూ అరుదుగానే సంభవిస్తాయి. వాటిలో మనకు సమీప కాలంలో వచ్చిన కన్యాశుల్కం నాటకం, తన జవసత్వాల వల్ల ఒక అయిదు పాతికలు పూర్తి చేసుకుని మరో పాతిక దిశగా ప్రయాణం ఆరంభించిన ఈ ఘట్టం సాహిత్య చరిత్రకు మనలను సాక్షులు చేస్తున్న మహత్తర సందర్భం.

– రామతీర్థ
98492 00385

(ఆగస్టు 25-27, కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాలు విజయనగరం, విశాఖపట్నం వేదికల్లో)

అక్షరం

వెలుగు వైపు నడిపే కళాత్మక సాధనం కవిత్వం



కవి పేరు లేకుండా ఒక కవితను ప్రచురించి, ఆ కవి ఎవరో కనుక్కోండి అంటే కవితను బట్టి, శైలిని బట్టి కవితా నిర్మితిని బట్టి, కవితా విస్తృతిని బట్టి, వస్తువును బట్టి – ఆ కవి ఎవరో చెప్పొచ్చు. స్వతంత్ర ముద్ర సాధించుకున్న కవుల విషయంలో ఇది చాలా వరకూ వాస్తవం. కానీ, ఇప్పుడు సొంతముద్ర ఉన్న కవులు తరిగి పోతుండడంతో గుర్తించటం కూడా కష్టమే అవుతుంది.

రాయగా రాయగా కవిత్వం రాయడమైతే వచ్చేస్తుంది. రాయటంలో సులువులు బోధపడతాయి. అది ఒక అలవాటుగా మారి రాయకుండా ఉండలేని స్థితి దాపురిస్తుంది. ఆ స్థితిలో కవిత్వం లోపించవచ్చు. అనుభవం పలచబడవచ్చు. అనుభూతి మందగించవచ్చు. అక్షరాల వెనుక తడిపొడి పాఠకుడికి అందకపోవచ్చు. తద్వారా ఆ కవి అతి త్వరలో కనుమరుగు కావడానికి ఎక్కువ అవకాశం ఉండొచ్చు.

ఏ ప్రమేయం లేకుండా ఉత్తినే గట్టుమీద నిష్ప్రయోజనంగా షికారు కొట్టినట్లు కనిపించేది కవిత్వం కాదు. అలాగని ఫెళాఫెళమంటూ మోతాదు మించిన చప్పుడు చేసి పబ్లిసిటీ ప్రయోగం చేసేదీ కాదు. విరిసీ విరియని చిరునవ్వు, రెప్ప దాటీ దాటని కన్నీటి చుక్క, అంతరాంతరాల్లో చిన్న దిగులు పెట్టించే సున్నితమైన నిశ్శబ్ద ఘోషలా ఉండాలి కవిత్వభాష.

కాలానుగుణంగా కవిత్వపు రూపాల్లో వస్తున్న మార్పులను అన్వయించుకుంటూ అభ్యుదయం కొరకు కవిశ్రేణులు జరుపుతున్న ప్రతి కదలికల్నీ, భావచిత్రాల్నీ కవిత్వ పరిణామ క్రమంలో భాగంగానే గుర్తించాలి. ప్రేమ– కళ– చైతన్యం – నాదం– విప్లవం అనే బలీయమైన అంశాలను సమన్వయ పరచేశక్తి కవిత్వానికి ఉండాలి. గ్రూపు కవిత్వాలు, విభేద కవిత్వాలు గాక పరివర్తన కవిత్వం వెలువడాలి. కవి పరివర్తన చెందాలి. పాఠకుని పయనించే ప్రభావం సమాజం మీద పడాలి. అంత శక్తివంతంగా ఉండాలి. ఏ కవితా ప్రక్రియ కొత్తగా వచ్చినా వడిసిపట్టుకోవడం పరిపూర్ణత సాధించిన కవికి అసాధ్యమేమీ కాదు. చూస్తుండగానే, సూటిగానే ఆ నవీన ప్రక్రియలో ప్రవేశించి ప్రత్యక్షమవ్వడం ఆ కవి ప్రతిభపైనే ఆధారపడి ఉంటుంది.

కవిత్వం ఎవరి కొరకు...? పీడితులు, తాడితుల కొరకు, దోపిడికి గురి అవుతున్న ప్రజల కొరకు, సమాజం కొరకు, వెలుగు కొరకు, తూర్పు కొరకు.. కొందరు వీటిని పాత పదాలుగా భావించవచ్చు. మారిన ప్రపంచంలో ఈ పదాలను ఎటు దొరికితే అటు మలుచుకోవడానికి అవకాశముంది. పై వాక్యాన్ని తప్పు అనలేం. వదులుకోనూ లేము. చిత్రమేమంటే – ఆ వాక్యాల పరిచయం ఒక రకంగా ఇప్పుడు కొందరి దృష్టిలో 'అవుటాఫ్ డేట్' అనిపించవచ్చు. కవితాయానంలో ఆరంభాలూ, మలుపులూ, ముగింపులూ క్రొంగొత్తగా ఉంటాయి. కవితా వస్తువులన్నీ భావ చిత్రాల చుట్టూ అల్లుకుంటూనే ఉంటాయి. కవిత్వ కళ ఆత్మ కళగా, హృదయకళగా విమర్శ పరిభాషలో ప్రస్తావించబడుతూ ఉంటుంది. అది మనిషిని తన అంతస్సీమల్లో గూడుకట్టుకున్న చీకటి నుంచి తేజస్సు దిశగా ప్రస్థానం సాగింపజేసే కళాత్మక సాధనం.

కవిత్వం – అక్షర లక్షల విలువ చేసే సారాన్ని జీవన సారాంశంగా తెలియజేస్తుంది. శిల్పపరమైన ఎత్తుగడ ఒక పరిణామ దశకు కొనసాగింపుగా వెలుగు నీడగా పరుచుకుంటుంది. దూరదృష్టితో లోపభూయిష్టమైన వ్యవస్థను ఎత్తి చూపుతుంది.

సహజ రంగూ రుచీ లేనిది ఏదీ ప్రకృతిలో లేదు. కానీ కవిత్వంలో అవి కృత్రిమంగా ఉండకూడదనే నియమం ఒకటి చాలా కాలం నుంచి అమలులో ఉంది. ఇక్కడ రంగు అంటే కులం, రుచి అంటే పేదా గొప్పా తారతమ్యమని అంతరార్థం. సజీవ సామాజిక, మానవ సంబంధాల్లో నుంచి వెలువడే కవిత్వంలో వీటిని పరిహరించేవారు ఉన్నారు. విశ్వమానవ భావనతో కవిత్వం ఉండాలని లాక్షణికులు అంటారు. అట్టడుగు ప్రజలంటూ సమాజం పిలిచేవారి జీవిత దృశ్యాలని కవిత్వంలో ఆవిష్కరిస్తే, ఆ సొగసు స్థానీయత వేరుగా ఉంటాయి. ఇందులో ఇజాలు, ట్రెండ్‌ను బట్టి మానవ ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని, కవితా ప్రక్రియల్లో రచనలు సాగుతాయి.

ఇటీవల కవిత్వంలో ప్రాంతీయ మాండలిక స్పృహతో స్థానిక భావజాలాన్ని కాపాడుకుంటూ కవులు తమ ఉనికిని అస్థిత్వ మూలాన్ని ప్రతిబింబించే రచనలు ఎక్కువగా చేస్తున్నారు. కవితా క్షేత్రంలో ఎన్ని వాదాలొస్తే, అంత మంచిది. వీటి మధ్య జరిగే చర్చలు, మీమాంస, సంఘర్షణ చూస్తే సమాజం ఎంత చైతన్యవంతంగా ఉందో తెలుస్తుంది. ఏదో ఒక వాదమే రాజ్యమేలాలనడం సంకుచితతత్వం, నియంతృత్వం అవుతుంది.

కవిత్వపు మూలాల్లోకి చూడటానికి అలవాటుపడే కవుల తీరే వేరు. కవిగా స్థానమేమిటి? కవిత్వం ఏమి ఆశిస్తున్నాం? అసలు కవిత్వం అంటే ఏమిటి? వస్తువుని భావచిత్రాలతో మేల్కొల్పేదేమిటి? అప్పుడు బాధ్యత ఏమిటి? అలా అనుకోవడంలోనే ప్రశ్నించుకోవడంలోనే ఒక అద్భుతమైన మార్పు, శక్తీ వస్తాయి. కొంతమంది కవులు తమ రచనల పట్ల, సాహిత్యం పట్ల, ఒక మంచి ప్రణాళికలో ఉంటారు. అందుకు ఆ కవుల జీవితం సరళంగా, సహజసిద్ధంగా, ఆనందంగా గడపడానికి కారణమవుతుంది.

– ఎస్ఆర్ భల్లం
98854- 42642




శైశవ గీతం

అమ్మ గర్భగుడిలో
ఉమ్మనీటి చెమ్మలో జరాయువై
జన్మకు సిద్ధమవగా
నవ నాడులూ నలిగి
నవ మాసాల సుడులు పిగిలి
కంటిపాప జాడకై
కన్నీటి చారికల్లో
కనురెప్పల ఉలికిపాటులో
కాగితపడవలై తేలియాడితే...
జననమొక జంఝూటమై
ఆయువు... ప్రాణవాయువుకై పరితపిస్తూ...
పరితాపాన్ని మిగులుస్తూ...

స్వార్థపు శంఖంలో తీర్థమై
మొదలెట్టని జీవనయాత్రలో
చరమాంకానికి సన్నద్ధమౌతూ
చరిత్రపుటల్లో నిర్జీవ సారాంశమై
శైశవాన్ని స్వాగతిస్తూ
కర్మభూమి కైలాసం
ధర్మ సంస్థాపనలో
జీవించే హక్కు బీజప్రాయంలోనే
సజీవ సమాధి దృశ్యం ...
గోవులు వర్ధిల్లే గోతంత్ర రాజ్యంలో
శైశవ గీతం ఇక ఓ శవాల నిట్టూర్పు !

– ఇల్ల ప్రసన్న లక్ష్మి
9494165632




తల్లుల గర్భశోకం

తల్లుల రోదనల ప్రకంపనం
ఎంత హృదయ విదారకంగా ఉందో!
గుండెలు పగిలిపోతున్న శబ్దాల విలయం
ఎంత ఆవేదనాభరితమవుతుందో !
కంఠ నరాలు తెగిపోయేలా
తల్లి పేగులు కదిలిపోయేలా
దుఃఖం దుఃఖనదై ప్రవహిస్తోంది ...
గంగకు సమాంతరంగా దేశాన్ని
ముంచెత్తుతోంది..

తల్లుల్లారా...
మీ కడుపు కోతకు కారణమెవ్వరు?
మీ కన్నీళ్లకు కరిగేదెవ్వరు?
ఇక్కడ అన్నీ ఉక్కు గుండెలే తల్లీ
ఏడవకండేడవకండి ...
యోగేంద్ర చక్రాల కింద శలభాలై నలిగిపోకండి
..
కన్నపేగు తెంచినవాడు
కన్నీటికి కరిగే మామూలు మనిషి ఎలా
అవుతాడు?
ఏడవకండేడవకండి ...
మీ శక్తిని కాస్త దాచుకొండి ...
సమాధిని తవ్వే సమయం కోసం
ఏడ్వని కళ్లతో ఎదురు చూడండి ..!

- తంగిరాల సోని
9676609234



నిశ్శబ్ద గాయం

ఎవడి నిర్లక్ష్యానికో
నోరు తెరిచిన బోరుబావి
కొన్ని లేత నవ్వులని భోంచేస్తోంది
చివరి ఆశనీ చిదిమేస్తూ
గొంతు తడప లేని కన్నీరు
బీడు భూమిలో ఇంకిపోతుంది

నీ చూపుడు వేలిపై నల్లని సిరాచుక్క
నిలదీయలేని నీ అసమర్థతని నిరూపిస్తుంది

నిన్ను నువ్వు నడివీధిలో
అమ్మేసుకున్నపుడు
నీలోంచి వెలువడిన ఆర్తనాదం
ఆత్మవంచనకి ఆయుష్షు పోస్తుంది

వేకువచెట్టుకి ఉరేసుకున్న
నిన్నటి నీ విలువలు
రాతిరి జరిగిన
అత్యాచారాన్ని ప్రపంచానికి తెలియనివ్వవు
రేగిన గాయం రాసుకున్న గేయం
కీచురాళ్ల కచేరీలో కలిసిపోతుంది

కవిత్వం

రక్తమోడుతున్న రెక్కలతో
ఒక పావురం ఎటో ఎగిరిపోతుంది
నిశ్శబ్దగాయమొక ఆయుధమై
తెగిపడిన దేహాల మధ్య నిన్ను
సమాధి చేస్తుంది ...

– అన్వేషి
77027 72301



మరొకసారి!

కొత్త నీరు చేరుతోన్న నదిలా
ఎర్రగా ఆకాశం
అలా ఆ వంతెన దాటుతూ
ఆమె

ఇలా ఈ కొండ పాదం నుండి కదులుతూ
అతడు
ఉప్పనయిన అల ఒకటి
ఇద్దరికీ చేరువగా

వెన్నెల కడిగిన ముఖంతో
సూరీడు
వాన తడిపిన వాయిలాకు
పచ్చగా
రాలిన నక్షత్రాల దోసిళ్ళతో వాళ్ళకి
ఎదురుగా పసివాడు!!

- కెక్యూబ్ వర్మ
9493436277

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి సవ్వడి పేజీలో ప్రచురణార్థం రచయిత (త్రు)ల నుంచి రచనలు ఆహ్వానిస్తున్నాం. ప్రగతిశీల సాహిత్యంపై వ్యాసాలూ, సమీక్షలు; సమకాలీన సాహిత్య ధోరణులపై విశ్లేషణలూ రాసి పంపవచ్చు. కళారంగంపైనా, నాటకాలపైనా విశ్లేషణలు రాయవచ్చు. రచనలను ఈమెయిల్లో కూడా పంపించవచ్చు. కాపీలను పేజీ మేకర్ ఫైలుతో పాటు పిడిఎఫ్‌గా మార్చి పంపాలి.

email id :
prajasavvadi@gmail.com

జీవన the family





సమీర్.. తెలుగు ప్రేక్షకులకు బాగా పరిచయమున్న నటుడు. ఇంట్లో టీవీ సీరియల్స్ చూసేవాళ్ళకు.. "భాగవతం, రుతురాగాలు, కస్తూరి, శాంతి నివాసం, లేడీ డిటెక్టివ్, కలంకిత.." ఇలా చాలా సీరియల్స్‌లో సమీర్ గుర్తుండిపోయే పాత్రలే చేశాడు. సినిమాల విషయానికి వస్తే.. "ఇంద్ర, ఠాగూర్, సై, షిరిడీసాయి, మగధీర, శ్రీరామదాసు, శ్రీరామరాజ్యం, గోవిందుడు అందరివాడే, దువ్వాడ జగన్నాథం.." ఇలా వెండితెరపై ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించాడు. ఒకప్పుడు.. టీవీకీ, సినిమాకీ చాలా అంతరం ఉండేది. ప్రస్తుతం రెండు మాధ్యమాలకు పెద్దగా తేడా ఉండటంలేదు. నటుడు సమీర్ పేరు చెప్పగానే.. ఎవరికివారే.. సమీర్ మావాడు అంటారు. అదే ఈ ఆరడుగుల నటుడి ప్రత్యేకత. టీవి మాధ్యమం ప్రేక్షకులకు దగ్గరవుతున్న సమయంలోనే బుల్లితెరపై మెగాహీరోగా పేరుతెచ్చుకున్నారు సమీర్. నిజానికి సినిమా నుంచే ఇతడి నటప్రస్థానం ప్రారంభమైంది. తొలుత సినిమా.. ఆతర్వాత టీవీల్లో బిజీ.. ఆ తర్వాత సినిమాల్లో బిజీబిజీ. సుమారు వందసినిమాలు, 70-80 టీవి సీరియల్స్‌లో నటించి.. టీవి-సినిమా అనే సరిహద్దు గీతను చెరిపేసిన నటుల్లో సమీర్ ఒకరు. ఈ మధ్యనే.. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని సొంతం చేసుకున్న తెలుగు 'బిగ్‌బాస్' షోతోనూ సమీర్ మరింత దగ్గరయ్యారు. పాత్ర ఏదైనా.. కమిటెడ్ నటుడిగా పేరుతెచ్చుకున్న నటుడు సమీర్ 'జీవన' గమనం ఆయన మాటల్లోనే..



విలనిజం.. కామెడీ రెండూ ఇష్టమే!

దాదాపు 20 ఏళ్ళుగా నటనా రంగంలో ఉన్నాను. 1996 నుంచి నా కెరీర్ ప్రారంభమైంది. అయితే నటనని ఓ కెరీర్‌గా చేసుకోవాలని సీరియస్‌గా ప్లాన్ చేసుకోలేదు. కానీ, చిన్నప్పటి నుంచి కల్చరల్ యాక్టివిటీస్‌లో ఎక్కువుగా పాల్గొనేవాడ్ని. స్కూల్ డేస్ నుంచే స్టేజ్‌షోస్, కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో ముందుండేవాడిని. అలా ఫైన్ ఆర్ట్స్, స్పోర్ట్స్, మ్యూజిక్.. వీటన్నింటి పట్ల తెలియకుండానే నాలో ఓ ప్యాషన్ తయారైంది. మిగతా ఎన్ని ఆసక్తులు ఉన్నాగానీ నటనకే మొగ్గుచూపాను.

అమ్మే స్ఫూర్తి

అమ్మ విన్నకోట మహాలక్ష్మి. క్లాసికల్ డ్యాన్సర్. అప్పట్లోనే కూచిపూడి, భరతనాట్యంలో ఇండియా తరపు గౌరవప్రతినిధిగా అంతర్జాతీయ నృత్య కార్యక్రమంలో పాల్గొన్న కళాకారిణి. నాట్యమే కాదు, థియేటర్ ఆర్ట్స్‌లోనూ ఆమె రెండు పీజి డిగ్రీలు చేశారు. అలా ఇంటి నుంచే నిలువెత్తు అమ్మ రూపంలో కళలపై ఆసక్తి, అభిమానం పెరుగుతూ వచ్చాయి.

సినిమాలతోనే.. మొదలు

చాలామంది నేను టీవీ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చాననుకుంటారు. నిజానికి డిగ్రీ చదివే రోజుల్లోనే వరుసగా మూడు సినిమాలు చేశా. అందులో మొదటిది ఉషాకిరణ్ మూవీస్‌వారు మోహన్‌గాంధీ దర్శకత్వంలో తీసిన "మౌన పోరాటం" సినిమా. ఇందులో స్టూడెంట్ లీడర్‌గా చేశా. రెండోది కోడి రామకృష్ణగారి 'రాజధాని' సినిమా. తర్వాత మూడో సినిమానే కమల్‌హాసన్, కె.విశ్వనాథ్ కలయికలో వచ్చిన "శుభ సంకల్పం"లో చేసే అవకాశం వచ్చింది. ఇక టీవీ విషయానికి వస్తే.. బాపుగారి దర్శకత్వంలో వచ్చిన "భాగవతం" నా మొదటి టీవి సీరియల్. అటు సినిమా.. ఇటు టీవి రెండింటా.. ప్రారంభంలోనే గొప్ప దర్శకుల చేతుల్లోపడ్డా. నటుడిగా ఇంతకంటే ఏంకావాలి.



అలా.. నటన సీరియస్‌గా


డిగ్రీ పూర్తవుతున్న సమయంలోనే మా అమ్మగారికి బాగా పరిచయం ఉన్న దేవదాస్ కనకాలగారు ఒకసారి మా ఇంటికి రావడం జరిగింది. అప్పుడు అమ్మ నా గురించి చెప్పింది. అలా నా గురించి దేవదాస్ గారికి చెప్పడం.. వారు నిర్వహిస్తున్న ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో నేను చేరడం అనుకోకుండా జరిగిపోయాయి. అలా థియేటర్లో రెండేళ్ళ డిప్లమో పూర్తి చేశా. డిగ్రీ చదివేరోజుల్లో ఎందుకనో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేయాలనే ఉత్సాహం ఉండేది. పోలీస్ ఆఫీసర్స్‌ని చూసినప్పుడల్లా.. అలా అనుకునేవాడ్ని. ఆ డ్రెస్‌లో ఉన్న పవర్ అలాంటిది. అయితే నటుడిగా మాత్రం పోలీసాఫీసర్ పాత్రలు చాలా చేశాను. పోలీస్ గెటప్‌లో నన్ను నేను చూసుకుని.. చాలా తృప్తిగా ఫీలవుతుంటా.

విశాఖ తీరాన

పుట్టింది వైజాగ్. అయితే అమ్మనాన్నలు వ్యాపారరీత్యా దుబాయ్‌లో ఉండటంతో స్కూల్‌డేస్ అంతా.. అంటే టెన్త్ వరకూ కొడైకెనాల్, చెన్నయ్ కళాక్షేత్రంలో నేను, మా చెల్లాయి చదువుకున్నాం. ముందే చెప్పినట్టు.. మూడోక్లాస్ చదివేటప్పటి నుంచే స్కూల్లో ఏ కల్చరల్ ప్రోగ్రామ్ జరిగినా పాల్గొనేవాడిని. చదువు విషయంలో క్లెవర్‌గానే ఉండేవాడిని. చదువుతోపాటు మృదంగం కూడా కొన్నాళ్ళు నేర్చుకున్నా. టెన్త్ తర్వాత చెన్నయ్ నుంచి వైజాగ్ మారిపోయాం. ఇంటర్, డిగ్రీ వైజాగ్‌లో చేశా.

కాలేజ్ సరదాలు

వైజాగ్‌లో బుల్లయ్య కాలేజ్‌లో ఇంటర్ చేరా. అప్పుడే ఆరడుగల ఎత్తు ఉండేవాడ్ని. నేను సీనియర్నో, జూనియర్నో తెలియక సీనియర్ స్టూడెంట్స్ ర్యాగింగ్ చేయడానికీ భయపడేవారు. ప్రిన్సిపాల్ అయితే యమస్ట్రిక్ట్. ఆయన మిలిటరీలో చేసొచ్చారు. ఇంటర్లో కూడా.. చిన్నపిల్లల మాదిరిగా మాతో నిక్కరూ చొక్కా యూనిఫారమ్స్ వేయించేవారు. ఇక మా ఇంగ్లీషు మేడమ్ అంటే.. మా స్టూడెంట్స్ అందరికీ చాలా ఇష్టం. ఎందుకంటే మేడమ్.. అంత అందంగా ఉండేవారు. ఆవిడ క్లాస్ అంటే.. ఎవ్వరూ మిస్సయ్యేవారు కాదు. ఆవిడ క్లాస్ చెప్పడమూ అంతే బావుండేది. ఒకసారి మేడమ్.. నా మీద కంప్లయింట్ ఇచ్చారు. ప్రిన్సిపాల్‌గారు రమ్మన్నారని కబురొచ్చింది. వెళ్లగానే మేడమ్ కూడా అక్కడే ఉన్నారు. విషయం ఏమంటే.. నేను మేడమ్‌ని 'హలో డార్లింగ్!' అన్నానని కంప్లయింట్. నిజానికి నేనూ నా స్నేహితులు "హలో డార్లింగ్" అనే సినిమాకి వెళదామని మాట్లాడుకున్నాం. అప్పుడావిడ వెనుకే ఉన్నారట! నేను ప్రిన్సిపాల్‌తో అదే చెప్పా. మేడమ్ కూడా విషయం తెలుసుకుని.. 'అయ్యో!' అని బాధపడి నాకే సారీ చెప్పారు. ఇక చదువుకునేటప్పుడు ఫాలోయింగ్స్, ప్రేమల సంగతి సరేసరి. చెన్నయ్‌లో ఉన్నప్పుడే ఓ అమ్మాయి ప్రేమిస్తున్నానంటూ రక్తంతో ప్రేమలేఖ రాసింది. నేను గట్టిగా మందలించాను. వైజాగ్‌లో అయితే.. లవ్ మ్యాటర్ విషయాల్లో శివ సినిమాల్లో మాదిరిగా ఫైట్స్ కూడా జరిగేవి. మొత్తానికి స్టూడెంట్ లైఫ్ చాలా చాలా జాలీగా సాగింది.





చిరంజీవి.. అభిమానినే

చిరంజీవి గారికి వీరాభిమానిని. అన్నయ్యతో నాలుగైదు సినిమాలు చేసే అవకాశం దక్కింది. ఫస్ట్ సినిమా 'ఇంద్ర'. చిరంజీవిగారితో చేస్తున్నానని తెలియగానే.. ఆ రోజు నిద్రపట్టలేదు. అయితే అన్నయ్యతో కాంబినేషన్ సీన్లు లేవు. చాలా బాధపడ్డా. తర్వాత 'ఠాగూర్' చేశా. ఆ సినిమా సమయంలో నేను టీవీల్లో బాగా బిజీ. అది చిరంజీవిగారికి తెలిసి.. "ముందు.. సమీర్ సీన్స్ తీసి పంపించేయండి" అని డైరెక్టర్‌గారితో ఎంతో హంబుల్‌గా చెప్పడం ఇప్పటికీ గుర్తే. బాలకృష్ణగారూ.. ఎంతో ఫ్రెండ్లీ, జోవియల్‌గా ఉంటారు. పవన్‌కల్యాణ్‌గారితో కలిసి పనిచేయడం ఎంతో గొప్ప అనుభవం. చాలా సింపుల్‌గా గడుపుతారు. సెట్లో తనో హీరో అనే మాటే మర్చిపోతారు. అరమరికలు లేకుండా.. కో ఆర్టిస్టులతో సరదాగా ఉంటారు.

ఈ మధ్య పాల్గొన్న 'బిగ్‌బాస్' షో.. నన్ను చాలామందికి దగ్గర చేసింది. నటుడిగా ఉన్నప్పుడు ఏ పాత్రయినా చేయాలి.. చేయగలగాలి. అయితే పూర్తిస్థాయిలో విలనిజం, కామెడీ పాత్రలు వస్తే చేయాలని ఉంది. కుటుంబపరంగా భార్య, బాబు. మాది.. క్యూట్ అండ్ హ్యాపీ ఫ్యామిలీ.

సంభాషణ : గంగాధర్ వీర్ల


జీవన చిత్రం



జుట్టుకు బలాన్నిచ్చే కలబంద

ఇంటి పెరట్లో సాధారణంగా పెరిగే కలబందకు జుట్టుకు బలాన్నిచ్చే ఎన్నో ఔషధ లక్షణాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు.

- కలబంద రసం, గుజ్జులో వైద్య గుణాలుండటం వల్ల జుట్టు వత్తుగా, బలంగా తయారౌతుంది.
- కలబంద వెంట్రుకలలోని సాధారణ సమస్యలను తగ్గించటమే కాకుండా, సహజ హెయిర్ కండిషనర్‌లా పనిచేస్తుంది.
- తలపై చర్మానికి దురద ఉన్నా, చర్మంలో నూనెలు ఎక్కువ విడుదలౌతున్నా, చుండ్రు ఏర్పడినా వీటిని తగ్గిస్తుంది.
- తలపై చర్మంలో ఎక్కువగా దుమ్మూ ధూళీ ఎక్కువగా చేరి, జుట్టు రాలటం వంటి సమస్యలుంటాయి. కలబంద నుండి తయారు చేయబడిన ఉత్పత్తులు జుట్టు రాలటాన్ని బాగా అరికడతాయి. పాక్షిక బట్టతలను అడ్డుకుంటాయి.
- తలపై చర్మంలో జుట్టు రాలిన ప్రాంతంలో కలబంద జెల్ ను వాడతారు. దీనిలో ఉండే ఎంజైమ్‌లు కొంతమందిలో రాలిన జుట్టును తిరిగి పెరిగేలా చేస్తాయి. ఈ జెల్ ను నేరుగా తలపై చర్మానికి రాయవచ్చు. దీనివలన ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవు.
- తలపై చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు కలబంద తోడ్పడుతుంది. అదనంగా జుట్టు పెరిగేలా చేస్తుంది.




జీవన సౌరభం

తప్పులు చేసినప్పుడు బాధపడకుండా వాటి నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి.

మీ కోసం

అవిసెగింజల్ని తినడం వల్ల మెదడులో సెరోటిన్ అనే రసాయనం విడుదలై ఒత్తిడి బారిన పడకుండా కాపాడుతుంది. అలాగే రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాల్ని తగ్గిస్తుంది.





త్రై సి బాకీల నియంత్రణే లక్ష్యం

సిండికేట్ బ్యాంకు సిఇఒ మెల్విన్ రెగో

సిండికేట్ బ్యాంకు తన స్థూల మొండి బాకీలను 8.75 శాతానికి తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఈ ఎన్‌పిఎలు 9.96 శాతంగా ఉన్నాయి. బ్యాంకును ఒత్తిడికి గురి చేస్తున్న 6.27 శాతం నికర నిరర్ధక ఆస్తులను 5శాతానికి నియంత్రించాలని నిర్ధేశించుకున్నాం. గత జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మొండి బాకీల కేటాయింపులు 79 శాతం పెరిగి రూ.1,243 కోట్లకు చేరాయి. కరెంట్ ఎకౌంట్ అండ్ సేవింగ్ ఎకౌంట్ (కాసా) డిపాజిట్లను పెంచుకోవడంపై దృష్టి పెట్టాము. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఇ రంగాల రుణాలు పెరిగాయి.

కోతల బాటలో మరో రెండు బ్యాంకులు

ముంబయి : సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ మరో రెండు బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంకు కూడా సేవింగ్ అకౌంట్ డిపాజిట్లపై అందించే వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో రూ.50 లక్షలు కన్నా తక్కువున్న డిపాజిట్లపై వడ్డీరేట్లు 3.5 శాతానికి పడిపోయాయి. రూ.50 లక్షలు ఆపై ఉన్న డిపాజిట్లకు వడ్డీరేట్లను యథాతథంగా 4 శాతంగానే కొనసాగిస్తున్నట్లు ఆ బ్యాంకు తెలిపింది. ఈ వడ్డీరేట్లు ఆగస్టు 19 నుంచి అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. కాగా యూనియన్ బ్యాంకు కూడా సేవింగ్ ఖాతాలపై అర్ధశాతం వడ్డీ రేట్లకు కోత పెట్టినట్లు తెలిపింది. రూ.25లక్షల డిపాజిట్ల వరకు మూడున్నర శాతం వడ్డీ చెల్లించనున్నట్లు పేర్కొంది. రూ.25 లక్షలు పైబడిన వాటిపై యథాతథ వడ్డీ రేటును అందించనున్నట్లు తెలిపింది. ఎస్‌బిఐతో మొదలైన సేవింగ్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల తగ్గింపు ఒక్కో బ్యాంకు ఈ కోతలకు వరుస కడుతున్నాయి. ఇప్పటికే బ్యాంకు ఆఫ్ బరోడా, యస్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, యస్ బ్యాంకు, కర్నాటక బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు కూడా వడ్డీరేట్లను తగ్గించాయి.

పిఎస్‌బిలకు మరింత మూలధనం : ఉర్జిత్

ముంబయి : ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరింత మూలధనం అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. శనివారం ముంబయిలో సిఐఐ ఏర్పాటు చేసిన 'ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ' జాతీయ సదస్సులో ఉర్జిత్ మాట్లాడుతూ మొండి బాకీల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకులకు పునర్‌మూలధనం అవసరమన్నారు. మార్కెట్ నుంచి నిధులను సమీకరించడం, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో తమ వాటాను తగ్గించడంతో పాటు పలు రంగాల్లో అదనపు క్యాపిటల్‌ను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బాకీలు 9.6 శాతానికి చేరడం ఆమోదయోగ్యం కాదన్నారు.

టిటికెలో వాటాలపై సిగ్నా దృష్టి

హైదరాబాద్ : భారత్‌కు చెందిన టిటికె గ్రూపు, అమెరికా కంపెనీ సిగ్నా కార్పొరేషన్‌ల సంయుక్త బీమా కంపెనీ సిగ్నా టిటికె హెల్త్ ఇన్సూరెన్స్‌లో సిగ్నా తన వాటా పెంపున కోసం ప్రయత్నిస్తోంది. సిగ్నా కార్పొరేషన్ తన వాటాను 26 శాతం నుంచి 49 శాతానికి పెంచుకోవడా నికి ఐఆర్‌డిఎఐకి దరఖాస్తు చేసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. సిగ్నా టిటికెలో సిగ్నా కార్పొరేషన్ తన వాటాను పెంచుకోవడం చాలా కీలకమైన నిర్ణయమని సిగ్నా టిటికె హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ సందీప్ పటేల్ పేర్కొన్నారు.

ఐపిఒకు హెచ్‌డిఎఫ్‌సి లైఫ్

ముంబయి : హెచ్‌డిఎఫ్‌సి స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ (హెచ్‌డిఎఫ్‌సి లైఫ్) ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం అనుమతులు కోరుతూ మార్కెట్, పెట్టుబడి నియంత్రణ రెగ్యులేటరీ అయినా సెక్యూరిటీ ఎక్చేంజీ బోర్డు ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకుంది. ఐపిఒ కోసం హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ తన ప్రతిపాదిత పత్రాన్ని సెబీకి అందించింది. ఈ బీమా కంపెనీలో ప్రస్తుతం హెచ్‌డిఎఫ్‌సికి 61.5 శాతం వాటా ఉంది. మరో 35 శాతం వాటా బ్రిటన్‌కు చెందిన స్టాండర్డ్ లైఫ్ కలిగి ఉంది. ఈ ఐపిఒలో 299.8 మిలియన్ షేర్లను విడుదల చేయాలని ఆ కంపెనీ నిర్ణయించుకుంది.

అనిశ్చితిలోనూ బంపర్ ఆఫర్

- రూ.13,000 కోట్ల షేర్లు తిరిగి వెనక్కి..
- షేర్‌పై రూ.1,150 చెల్లింపు
- ప్రస్తుత విలువ కంటే 25% అదనం
- ఇన్వెస్టర్లకు బంఫర్ ఆఫర్

బైబ్యాక్ షేర్లకు ఇన్ఫోసిస్ ఆమోదం



బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ ప్రస్తుత అనిశ్చితి పరిస్థితుల్లోనూ షేర్ల తిరిగి కొనుగోలుకు ముందుకు వచ్చింది. శనివారం జరిగిన ఇన్ఫోసిస్ బోర్డు సమావేశంలో రూ.13,000 కోట్లతో షేర్ల బైబ్యాక్‌ను చేపట్టడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. దీంతో ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లోనూ మదుపర్లకు బంఫర్ ఆఫర్‌ను ప్రకటించినట్లయ్యింది. ఆ కంపెనీ సిఇఒ విశాల్ సిక్కా రాజీనామా చేసిన మరుసటి రోజే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. వాటాదార్లకిచ్చిన షేర్లను తిరిగి వారి నుంచే సదరు కంపెనీ కొనుగోలు చేయడాన్ని బైబ్యాక్ అంటారు. ఒక్కో షేరును రూ.1,150 ధరకు కొనుగోలు చేయనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. శుక్రవారం నాటి మార్కెట్ ట్రేడింగ్‌లో బిఎస్ఇలో ఇన్ఫీ షేరు ముగింపు ధర రూ.932గా ఉంది. దీంతో పోల్చితే 25శాతం ప్రీమియం ఇస్తూ ఈ షేర్లను తిరిగి కొనుగోలు చేస్తామని ఆ కంపెనీ తెలిపింది. తద్వారా ఇన్ఫోసిస్ 11.3 కోట్ల షేర్లను లేదా 4.92 శాతం ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేయనుంది. షేరు రూ.1,150 వద్ద టెండర్ మార్గం ద్వారా 11,30,43,478 కోట్ల షేర్లను కొనుగోలు చేస్తామని ఇన్ఫోసిస్ బిఎస్ఇ ఫైలింగ్‌లో పేర్కొంది. దీనికోసం బోర్డు ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 36 సంవత్సరాల చరిత్ర కలిగిన ఇన్ఫోసిస్ తొలిసారిగా బైబ్యాక్ ఆఫర్ చేయనున్నది. సంస్థ వద్ద అధికంగా నిధులు ఉండటంతో డివిడెండ్ లేదా బైబ్యాక్ చేయాలని కంపెనీ వ్యవస్థాపకులు, మాజీ ఎగ్జిక్యూటివ్ అధికారులు తీవ్ర ఒత్తిడిని తీసుకురావడంతో కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రితం ఏప్రిల్‌లోనే ఈ బైబ్యాక్ ఆఫర్‌పై ప్రతిపాదన వచ్చింది. బైబ్యాక్ వల్ల మదుపర్ల షేరు వారి ఆర్జన పెరగనుంది. అదే విధంగా వాటాదార్లకు కంపెనీ వద్ద ఉన్న అదనపు నగదు ఇవ్వడానికి వీలువుతుంది. 2017 జూన్ 30 నాటికి ఇన్ఫోసిస్ వద్ద రూ.39,335 కోట్ల విలువ చేసే నగదు, నగదు సమానమైన ఇతర పెట్టుబడులు ఉన్నాయి. ఈ కంపెనీ కంటే ముందే టిసిఎస్ రూ. 16వేల కోట్ల మెగా బైబ్యాక్‌ను చేపట్టింది. విప్రో రూ.2500 కోట్లతో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ రూ.3,500కోట్లతో బైబ్యాక్‌ను చేపట్టి మార్కెట్లో మంచి విలువను పెంచుకున్నాయి.

ఎల్ఐసి ఆగ్రహం

ఇన్ఫోసిస్ మేనేజ్‌మెంట్ వ్యవహారంపై దేశీయ అతిపెద్ద ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ (డిఐఐ) అయినా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం జరిగిన పరిణామానికి మదుపర్లు రూ.30,000 కోట్ల మేర నష్టపోయిన విషయం తెలిసిందే. ఇందులో ఎల్ఐసి భారీగా నష్టపోయింది. దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్‌లో ఎల్ఐసికి 7.03 శాతం వాటా ఉంది. అయినా బైబ్యాక్ టెండర్‌లో అన్ని షేర్లను వెనక్కి తీసుకునే ఉద్దేశ్యం లేదని పేర్కొంది. పాక్షికంగా కొన్ని షేర్లను వెనక్కి తీసుకునే అవకాశం ఉందని ఎల్ఐసి ఉన్నతాధికారి ఒక్కరు తెలిపారు.

బరిలో ఆ నలుగురు..



ప్రవీణ్‌రావు



రంగనాథ్



రవి కుమార్



మోహిత్ జోషి

ఇన్ఫోసిస్ నుంచి విశాల్ సిక్కా అనుహ్యాంగా వైదొలగడంతో ఆ సిఇఒ పోస్టుకు పలువురి పేర్లు వినబడుతున్నాయి. ఐటిలో ప్రస్తుతం నెలకొన్న సవాళ్ల నేపథ్యంలో అత్యంత సమర్థుడైన సిఇఒ అవసరం చాలా ఉంది. ఈ పోస్టుకు ఎవరు సమర్థులు అనే దానిపై ఆ కంపెనీ వ్యవస్థాపకులు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తర్జన భర్జన పడుతున్నారు. కాగా ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లోనే పని చేస్తున్న నలుగురు పేర్లు పరిశీలనకు వస్తున్నాయని తెలుస్తోంది. ప్రస్తుత తాత్కాలిక సిఇఒ ప్రవీణ్ రావు, సిఎఫ్ఒ రంగనాథ్ డి మవినకెరె, ప్రెసిడెంట్ అండ్ డిప్యూటీ సిఒఒ రవి కుమార్ ఎస్, బిఎఫ్ఎస్ఐ హెడ్ మోహిత్ జోషి పోటీలో ఉన్నారు. బయట వ్యక్తిని మాత్రం ఇన్ఫీ సిఇఒగా తీసుకురాదని కూడా తెలుస్తోంది. ప్రస్తుతం కో-చైర్మన్‌గా ఉంటున్న రవి వెంకటేషన్ ఈ పదవి చేపట్టవచ్చని ఊహాగానాలు వస్తోన్నాయి. బెంగళూరులో వెంకటేషన్ మీడియాతో మాట్లాడుతూ ఈ వార్తలను కొట్టిపారేశారు. తనకు ఆ హాట్ సీటులో కూర్చోవడం ఇష్టంలేదంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే తామున్న పరిస్థితుల్లో సమర్థుడైన నాయకుడు అవసరం ఉందన్నారు.

ఎవరి విశిష్ట వారిదే...

సిఇఒ బరిలో ఉన్న ఈ నలుగురు ఎవరికి వారే ప్రత్యేక విశిష్టత, ప్రతిభా, నైపుణ్యం కలిగి ఉన్నవారే. కొన్ని ఏళ్లుగా ఇన్ఫోసిస్‌లో కీలక బాధ్యతల్లో పని చేస్తూ కంపెనీని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో వారి పాత్ర కీలంగా ఉంది.

తాత్కాలిక సిఇఒగా వ్యవహరిస్తోన్న యుబి ప్రవీణ్ రావు 30 సంవత్సరాల నుంచి ఇన్ఫోసిస్‌లో తన సేవలు అందిస్తున్నారు. 1986లో ఈ కంపెనీలో చేరిన ఆయన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ హెడ్ వంటి కీలక బాధ్యతలను పోశించిన విశేష అనుభవం ఉంది. సిఎఫ్ఒగా ఉన్న రంగనాథ్ 15 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఫైనాన్స్, విలీనాలు, కొనుగోళ్లు, కార్పొరేట్ ప్లానింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అత్యంత కీలకమైన బాధ్యతలనునెరవేర్చుతున్నారు. డిప్యూటీ సిఒఒగా ఉన్న రవి కుమార్ కూడా ప్రపంచ మార్కెట్లో ఇన్ఫోసిస్ విస్తరణలో అత్యంత బాధ్యతయుతంగా పని చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. బిఎఫ్ఎస్ఐ హెడ్ జోషి కంపెనీ విక్రయ కార్యకలాపాల బాధ్యతలు చూస్తున్నారు.





కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు.
సెల్ : 9440262072

భారత రాజ్యాంగం - ముఖ్యాంశాలు

ఇండియన్ పాలిటీ (గ్రూప్స్ ప్రత్యేకం)

భారత రాజ్యాంగం - ముఖ్య నిబంధనలు

నిబంధనలు	అంశం
1	భారతదేశం పేరు, భూభాగం
3	నూతన రాష్ట్రాల ఏర్పాటు, రాష్ట్ర సరిహద్దుల సవరణ
13	ప్రాథమిక హక్కులను హరించే శాసనాలు చెల్లవు
14	చట్టం ముందు సమానత్వం
16	ప్రభుత్వోద్యోగాల్లో సమాన ఉద్యోగావకాశాలు
17	అంటరానితనం నిషేధం
19	భావప్రకటనా స్వేచ్ఛ, మొదలైన కొన్ని హక్కుల రక్షణ
21	వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కుల రక్షణ
21ఎ	ప్రాథమిక విద్యాహక్కు
25	అంతరాత్మ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛగా మతాన్ని, ఆవలంబించడానికి, ఆచరించడానికి ప్రచారం చేసుకోడానికి గల స్వేచ్ఛ
30	విద్యాలయాలను స్థాపించి, నిర్వహించుకోవడంలో అల్ప సంఖ్యాకులకు హక్కు
31సి	కొన్ని ఆదేశిక సూత్రాలను అమలుచేసే శాసనాలకు మినహాయింపులు
32	ప్రాథమిక హక్కుల పరిరక్షణకు రిట్లు జారీ చేయడం
38	ప్రజా సంక్షేమానికి అవసరమైన సామాజిక వ్యవస్థను రాజ్యం ఏర్పాటు చేయాలి
40	గ్రామ పంచాయితీల ఏర్పాటు
44	పౌరులందరికీ ఉమ్మడి పౌరస్మృతి
45	శిశు సంరక్షణ, ఆరు సంవత్సరాలలోపు బాలబాలికలకు విద్య
46	షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాల వారి విద్య, ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడం
50	కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖ ఏర్పాటు
51	అంతర్జాతీయ శాంతిని, భద్రతను పెంపొందించాలి
51ఎ	ప్రాథమిక విధులు
72	శిక్షలను రద్దు, క్షమాభిక్ష ప్రసాదించడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారం
74	రాష్ట్రపతికి సలహాలు, సహాయం అందించేందుకు కేంద్ర మంత్రి మండలి ఉంటుంది.
78	రాష్ట్రపతికి అన్ని విషయాలను తెలియజేయడం ప్రధానమంత్రి బాధ్యత
110	ద్రవ్య బిల్లుల నిర్వచనం
112	వార్షిక ఆర్థిక నివేదిక
123	పార్లమెంటు విరామ సమయంలో ఆర్డినెన్స్ జారీ చేసేందుకు రాష్ట్రపతికి ఉన్న అధికారం
143	సుప్రీంకోర్టును సంప్రదించేందుకు రాష్ట్రపతికి అధికారం
నిబంధనలు	అంశం
155	గవర్నర్ నియామకం
161	కొన్ని కేసులలో నేరస్తులను క్షమాభిక్షను ప్రసాదించడం మొదలైన అంశాలకు సంబంధించి గవర్నర్‌కు ఉన్న అధికారం
163	గవర్నర్‌కు సలహాలను, సమయాన్ని అందించేందుకు మంత్రిమండలి ఉంటుంది
167	గవర్నర్‌కు అన్ని విషయాలను తెలియజేయడం ముఖ్యమంత్రి బాధ్యత
169	రాష్ట్రాలలో శాసన మండలి రద్దు లేక ఏర్పాటు చేయడం
200	బిల్లులకు ఆమోదం తెలపడం
213	శాసనసభల సమావేశంలో లేనప్పుడు ఆర్డినెన్సును జారీ చేయడానికి గవర్నర్‌కు ఉన్న అధికారం
226	హైకోర్టుకు ఉన్న రిట్ ఆదేశాలు జారీ చేసే అధికారం
239ఎఎ	ఢిల్లీకి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తి
249	జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంటు శాసనాలు చేయవచ్చు
262	అంతర్ రాష్ట్ర నదీ జలాలు, లేదా నదీలోయల వివాదాలు పరిష్కారం
263	అంతర్ రాష్ట్రీయ మండలి ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు
265	శాసనపూర్వక అనుమతిలేనిదే పన్ను విధించరాదు
275	కొన్ని రాష్ట్రాలకు కేంద్ర గ్రాంట్లు లేక సహాయం
280	ఆర్థిక సంఘం
300	న్యాయ సంబంధిత చర్యలు (దావాలు, ప్రొసీడింగులు)
300-ఎ	ఆస్తిహక్కు చట్టబద్ధమైన హక్కుగా గుర్తింపు, శాసనం ద్వారా తప్ప మరే విధంగానూ వ్యక్తుల ఆస్తులను స్వాధీనం చేసుకోరాదు లేదా తీసివేయరాదు
311	కేంద్ర, రాష్ట్ర సివిల్ ఉద్యోగులను ఉద్యోగం నుంచి తొలగించడం, హోదా తగ్గించడం మొదలైనవి
312	అఖిల భారత సర్వీసులు
315	కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్లు
320	పబ్లిక్ సర్వీస్ కమిషన్ల విధులు
323ఎ	పరిపాలనా న్యాయస్థానాలు
324	ఎన్నికలపై ఆదేశాలనివ్వడం, ఎన్నికల నియంత్రణ ఎన్నికల కమిషన్ దేశంలో ఉండటం
330	షెడ్యూల్డు కులాలు, తెగలకు లోక్‌సభలో సీట్లు రిజర్వేషన్
335	ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను పరిగణలోకి తీసుకొని వారికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించడం
352	అత్యవసర పరిస్థితి (జాతీయ ఎమర్జెన్సీని) ప్రకటించడం
356	రాష్ట్రాలలో రాష్ట్రపతి పరిపాలన
360	ఆర్థిక అత్యవసర పరిస్థితి
368	రాజ్యాంగ సవరణ విధానం
370	జమ్మూ, కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి

భారత రాజ్యాంగం - షెడ్యూళ్లు

షెడ్యూల్డు సంఖ్య వర్ణణ		షెడ్యూలులోని విషయాల నిబంధనలు
మొదటి షెడ్యూలు	రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలజాబితా	1నుండి 4
రెండో షెడ్యూలు	రాష్ట్రపతి, గవర్నర్లు, ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు (హైకోర్టు, సుప్రీంకోర్టు), కంప్ట్రోలర్-ఆడిటర్ జనరల్ తదితరుల జీతభత్యాలు	59, 65, 75, 97,129 మొదలైనవి
మూడో షెడ్యూలు	వివిధ పదవీ స్వీకార ప్రమాణాలు ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులు, పార్లమెంటు సభ్యులు,	75,99,124 148,164,219
నాలుగో షెడ్యూలు	భారతదేశంలోని ప్రతి రాష్ట్రానికి రాజ్యసభలో సీట్ల కేటాయింపు	4,80
అయిదో షెడ్యూలు	షెడ్యూల్డు ప్రాంతాలు, గిరిజనుల పరిపాలన, నియంత్రణ	244(1)
ఆరో షెడ్యూలు	అసోం, మేఘాలయ,త్రిపుర, మిజోరాం రాష్ట్రాల గిరిజనప్రాంతాల పరిపాలన నిబంధనలు	244(2),275
ఏడో షెడ్యూలు	కేంద్రం- రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ, దీనిలో మూడు జాబితాలు ఉంటాయి. 1. కేంద్ర జాబితా (కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి) 100 అంశాలు 2. రాష్ట్ర జాబితా (రాష్ట్ర ప్రభుత్వ అధికారాలు) 61 అంశాలు 3. ఉమ్మడి జాబితా (కేంద్ర - రాష్ట్రాలు) 52 అంశాలు	246
ఎనిమిదో షెడ్యూలు	అధికార భాషలు - రాజ్యాంగం గుర్తించిన 22 భారతీయ భాషల జాబితా -1967లో 21 వ రాజ్యాంగ సవరణతో సింధీని జతచేశారు. - 1992లో 71 వ రాజ్యాంగ సవరణతో కొంకణీ, మణిపూరి, నేపాలీ భాషలు జతచేశారు. - 2003లో 92వ రాజ్యాంగ సవరణతో సంతాలీ, మైథిలీ, బోడో, డోగ్రీ భాషలను జతచేశారు.	344,351
తొమ్మిదో షెడ్యూలు	భూ సంస్కరణలు, రిజర్వేషన్లు (1951లో మొదటి రాజ్యాంగ సవరణతో జతచేశారు)	31-బి
పదో షెడ్యూలు	ఫిరాయింపుల నిరోధక చట్టం (1985లో 52వ రాజ్యాంగ సవరణతో జతచేశారు)	102, 191
పదకొండో షెడ్యూలు	పంచాయతీ రాజ్ వ్యవస్థ (1992లో 73వ రాజ్యాంగ సవరణలో పొందుపరచారు)	243 జి
పన్నెండో షెడ్యూలు	నగరపాలక వ్యవస్థ (1992లో 74వ రాజ్యాంగ సవరణలో పొందుపరిచారు)	243 - డబ్ల్యు

భారత రాజ్యాంగం - భాగాలు

భాగం	నిబంధనలు	విషయం
మొదటిభాగం	1-5	భారత యూనియన్ - దాని ప్రాంతాలు
రెండో భాగం	6-11	పౌరసత్వం
మూడోభాగం	12-35	ప్రాథమిక హక్కులు
నాలుగోభాగం	36-51	ఆదేశిక సూత్రాలు
నాలుగు -ఎ భాగం	51-ఎ	ప్రాథమిక విధులు
అయిదో భాగం	52-151	కేంద్రప్రభుత్వం
ఆరోభాగం	152-237	రాష్ట్రప్రభుత్వం
ఏడోభాగం	238	రాజ్యాంగ ఏడో సవరణ ద్వారా 1956లో తొలగించారు.
ఎనిమిదో భాగం	239-242	కేంద్రపాలిత ప్రాంతాలు
తొమ్మిదో భాగం	243-243(ఒ)	పంచాయతీ రాజ్‌వ్యవస్థ
తొమ్మిది- ఎ భాగం	243 (పి) - 243(జడ్,జి)	నగరపాలక వ్యవస్థ
తొమ్మిది - బి భాగం	243 (జెడ్‌హెచ్) -243 (జెడ్,టి)	సహకార సంఘాలు
పదోభాగం	244,244(ఎ)	షెడ్యూల్డు, ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు
పదకొండో భాగం	245-263	కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య శాసన పరిపాలన సంబంధాలు
పన్నెండో భాగం	264-300(ఎ0	కేంద్రానికి- రాష్ట్రాలకు మధ్య విత్తపర సంబంధాలు
పదమూడో భాగం	301-307	అంతరాష్ట్ర వాణిజ్యం
పద్నాలుగో భాగం	308-323	పబ్లిక్ సర్వీసులు
పద్నాలుగు -ఎ భాగం	308 (ఎ) (బి)	ట్రిబ్యునళ్లు
పదిహేనో భాగం	324 - 329	ఎన్నికల వ్యవస్థ
పదహారో భాగం	330- 342	కొన్ని వర్గాలకు ప్రత్యేక నిబంధనలు
పదిహేడో భాగం	343- 351	అధికార భాషలు
పద్దెనిమిదో భాగం	352-360	అత్యవసర పరిస్థితి అధికారాలు
పందొమ్మిదో భాగం	361-367	సంకీర్ణ, సకల వివిధ అంశాలు
ఇరవయ్యో భాగం	368	రాజ్యాంగ సవరణ
ఇరవై ఒకటో భాగం	369-392	తాత్కాలిక, పరిణామాల నిబంధనలు
ఇరవై రెండో భాగం	393-395	లఘు శీర్షిక, హిందీలో అధికారిక పాఠం

★

అభివృద్ధిలో పత్రికల భాగస్వామ్యం అవసరం

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో కలెక్టర్ వీరపాండియన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజాభివృద్ధిలో పత్రికల భాగస్వామ్యం అవసరమని, అందుకు దోహదపడే కథనాలను వెలువరిస్తూ మీడియా, పత్రికలు ముందుకు సాగాలని కలెక్టర్ జి.వీరపాండియన్ పిలుపునిచ్చారు. అనంతపురం ప్రజాశక్తి ఎడిషన్ ప్రత్యేక సంచికను శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల మన్ననలను పొందుతూ ముందుకు సాగుతోందన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను వెలుగులోకి తేచ్చేందుకు మంచి ప్రయత్నం చేస్తోందని కొనియాడారు. మీడియాకూ మంచి గుర్తింపు ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందులో పనిచేసే వారిపై ఉందన్నారు.

దేవరపల్లి దళితులకు నష్టపరిహారమివ్వండి : మాల్యాద్రి

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

దేవరపల్లి దళితుల భూమిని దళితులకే అప్పగిస్తున్నామంటూ ప్రకటన చేసిన ప్రభుత్వం భూములను బాగుచేసుకునేందుకు దళితులకు నష్టపరిహారం చెల్లించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులో ఆయన మాట్లాడారు. దళితుల భూమిని నాశనం చేయడానికి ఖర్చు పెట్టిన ప్రభుత్వం దాని బాగు కోసం ఎందుకు ఖర్చు పెట్టదని ప్రశ్నించారు. భూమిని నాశనం చేసి దళితులను తీవ్రంగా నష్టపరిచారన్నారు. సాగుకు కూడా సహాయం చేయలేదన్నారు. ఈ నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులపై చేస్తున్న దాడులపై ప్రతిపక్ష నేత జగన్ ఏమి మాట్లాడకపోవడం దారుణమన్నారు. దళితులకు మద్దతు ఇవ్వడమే గాని ప్రభుత్వం వైఖరిపై జగన్ ఎందుకు మాట్లాడటంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

నిర్వాసితులకు సమస్యలున్న మాట వాస్తవమే

శ్రీకాకుళం కలెక్టర్ కె.ధనంజయరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు, నిర్మాణాలకు చెల్లింపులు, యూత్ ప్యాకేజీ డబ్బులు అందజేత తదితర సమస్యలున్న మాట వాస్తవమేనని కలెక్టర్ కె.ధనంజయరెడ్డి అంగీకరించారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసిత కాలనీల్లో తాగునీరు, రోడ్లు, కాలువలు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతుల సమస్య ఉందని, ఇందుకోసం రూ3.2 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించామని వెల్లడించారు. ప్రతి శనివారమూ నిర్వాసితుల నుంచి వినతులను స్వీకరిస్తున్నామని, యుద్ధప్రాతిపదికన వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నిర్వాసితులు ప్రాజెక్టు పనులను అడ్డుకోవడం వల్లే వారిపై కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందన్నారు. గతంలో చోటుచేసుకున్న ఘటనలను దృష్టిలో ఉంచుకునే పోలీసులను భారీగా మోహరించాల్సి వచ్చింది తప్ప, నిర్వాసితులను భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశం తమకు లేదన్నారు. రైతులు ప్రస్తుతం భూములను సాగు చేస్తున్నా, వాటిని 2006లోనే నీటిపారుదలశాఖకు అప్పగించారని చెప్పారు. అందువల్ల అవి ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నట్లేనని, ఈ కారణంగానే వారికి 2013 భూసేకరణ చట్టం వర్తించదని స్పష్టం చేశారు. నిర్వాసిత కుటుంబాల్లో మైనర్లకు యూత్ ప్యాకేజీ అందించే అవకాశం లేదన్నారు. నిర్వాసితులకు సంబంధించిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని, ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి సి.ఎం త్రివిక్రమ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధరబాబు, ఎఎస్‌పి షరీన్ బేగం పాల్గొన్నారు.

మా హక్కులను కాపాడండి

మానవ హక్కుల కమిషన్‌కు వంశధార యువత ఫిర్యాదు

ప్రజాశక్తి - హిరమండలం

వంశధార జలాశయం నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా, తమ హక్కులను హరిస్తూ పోలీసు నిర్బంధం నడుమ ప్రభుత్వం పనులు చేపడుతోందని శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నిర్వాసిత గ్రామాల యువత మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ఎదుట శనివారం ప్లకార్డులను ప్రదర్శించి వంశధార నిర్వాసిత రైతులను రక్షించాలని... ప్రాథమిక హక్కలను పరిరక్షించాలని నినాదాలు చేశారు. పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా... పునరావాసం కల్పించకుండా పనులు చేపడుతున్నారని, అడ్డుకున్న రైతులపై లాఠీఛార్జి, అరెస్టులు చేసి అక్రమ కేసులు బనాయించారని వివరించారు. పోలీసు నిర్బంధంలో వంశధార నిర్వాసిత గ్రామాలున్నాయని, కనీస అవసరాలకూ గ్రామం నుంచి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. గ్రామాల్లో నిర్వాసితుల కదలికలను డ్రోన్ కెమెరాతో చిత్రీకరిస్తున్నారని, దీనివల్ల మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిర్వాసిత గ్రామాల్లో జిల్లాస్థాయి అధికారులు పర్యటించకుండా సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

గోదావరి జిల్లాల్లో 'తపాలా' ఆందోళనలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను పెంచాలని కోరుతూ గ్రామీణ డాక్‌సేవక్‌లు ఉభయ గోదావరి జిల్లాల్లో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి నాలుగోరోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అమలాపురం, ఏలేశ్వరం, పెద్దాపురం, కొత్తపేట, రావులపాలెం తపాలా కార్యాలయాల వద్ద డాక్‌సేవక్‌లు ధర్నా నిర్వహించారు. జిడిఎస్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినదించారు. తపాలా శాఖలోని గ్రూప్-సి, గ్రూప్-డి ఉద్యోగుల సంఘం నాయకులు వీరి సమ్మెకు మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో తపాలా ఉద్యోగులు ధర్నా చేశారు. ధర్నాకు సిపిఎం మండల కార్యదర్శి జి.వెంకట్రావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సముద్రాల సాయికృష్ణ సంఘీభావం తెలిపారు.



విజయవాడలో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న స్వరూపరాణి

12వ రోజుకు మున్సిపల్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి అన్నారు. 279 జిఒను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను 12వ రోజు ఆమె ప్రారంభించారు. విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కార్మికులు అవసరమైన దానికంటే తక్కువ సంఖ్యలో ఉన్నవారని అన్నారు. కార్మికులతో అదనంగా పని చేయించుకుంటూ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేందుకు మంత్రులు యనమల రామకృష్ణుడు, పి.నారాయణ కార్మిక సంఘాలను చర్చలకు పిలిచి పరిష్కరించకుండా పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ 22న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పీర్‌లెస్ యాజమాన్యం ఉద్యోగ వ్యతిరేక చర్యలు మానుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

పీర్‌లెస్ సంస్థ యాజమాన్యం ఉద్యోగ వ్యతిరేక చర్యలు మానుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అనేక ఏళ్లుగా కంపెనీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగులను విఆర్‌ఎస్ పేరుతో బయటకు పంపే ప్రయత్నం మానుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంస్థలోని ఉద్యోగుల మనుగడ కోసం న్యాయ పోరా టం చేస్తున్నారని, వారికి నష్టదాయకమైన విఆర్‌ఎస్ పథకాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విదేశీ సంస్థలకు తలుపులు బార్లా తెరుస్తున్న ప్రభుత్వం దేశీయ కంపెనీలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం పరిపాటిగా మారిందని విమర్శించారు.

2000 సంవత్సరంలో విఆర్‌ఎస్ పేరుతో 70 శాతం మందిని యాజమాన్యం బయటకు పంపగా మిగిలిన 30 శాతం మంది ఉద్యోగులు రేయింబవళ్ళు కష్టపడి నష్టాల్లో ఉన్న కంపెనీని లాభాలబాట పట్టించారని తెలిపారు. కంపెనీ ఇప్పటికీ లాభాల్లోనే ఉందనీ, కంపెనీలో రూ.1,500 కోట్లకు పైబడి ఉన్న అన్‌క్లెయిమ్‌డ్ మెచ్యూరిటీ మొత్తాల నుంచి యాజమాన్యం వడ్డీ పొందడమేగాక, కంపెనీ షేర్‌హోల్డర్లు ఏటా 70 నుంచి 80 శాతం డెవిడెంట్లు తీసుకుంటున్నారనీ తెలిపారు. కంపెనీకి రూ.1700 కోట్ల నికర ఆస్తులు (నెట్‌ఓన్‌డ్ ఫండ్) ఉన్నాయనీ, కాబట్టి కంపెనీ అభివృద్ధికి పాటుపడిన ఉద్యోగులను ఖర్చు తగ్గింపు సాకుతో బయటకు పంపే ప్రయత్నాలు యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ప్రవేశపెట్టిన విఆర్‌ఎస్ పథకాన్ని నిరసిస్తూ పీర్‌లెస్ ఉద్యోగులు దేశ వ్యాప్తంగా చేస్తున్న ఆందోళనలకు తమ యూనియన్ పూర్తి మద్దతు తెలుపుతోందన్నారు.

రైతు గ్రూపు ఖాతాలు రద్దు


- రుణాలివ్వడం కుదరదంటున్న బ్యాంకు అధికారులు
- కైకరం స్టేట్‌బ్యాంక్‌లో ఘటన
- మౌన ముద్రలో ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

కౌలురైతులకు రుణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతు గ్రూపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ రుణాలిచ్చేది లేదంటూ బ్యాంకు ఖాతాలనే రద్దు చేస్తున్న పరిస్థితి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రారంభమైంది. అవే సర్వే నెంబర్లపై భూ యజమానులకు రుణాలిచ్చామని, మళ్లీ రుణాలు ఇవ్వడం కుదరనందున ఖాతాలను రద్దు చేస్తున్నామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో మూడు లక్షల మంది కౌలురైతులున్నారు. వారిలో 2.80 లక్షల మందికి రుణార్హత కార్డులు అందించినట్లు రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వ్యవసాయ రుణాల కింద రూ.2,016 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలందించగా, అందులో రూ.112 కోట్లు మాత్రమే కౌలురైతులకు రుణాలిచ్చారు.

ఎల్ఇసి (రుణార్హత) కార్డుల ద్వారా భూయజమానులకు పంటేతర రుణం, కౌలురైతులకు పంట రుణం ఇవ్వాల్సి ఉంది. ఎల్ఇసి కార్డుల ద్వారా బ్యాంకర్లు రుణాలివ్వకపోవడంతో రైతులతో జాయింట్ లైబెల్టీ గ్రూపులుగా (జెఎల్‌జి) ఏర్పాటు చేసి రుణాలందించాలని అధికారులు నిర్ణయించారు. విఆర్ఒ, తహశీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారులంతా కలిసి ముగ్గురు లేక ఐదుగురు రైతులతో ఈ గ్రూపులను ఎంపిక చేశారు. గ్రూపుగా ఏర్పడిన రైతులు బ్యాంకులకు వెళ్లి రూ.వెయ్యితో ఖాతా తెరిస్తే, వారికి బ్యాంకులు రుణాలివ్వాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో రుణాలు ఇవ్వడం లేదు.



రైతుల గ్రూపు ఖాతా పుస్తకంపై క్లోజ్‌డ్ అని రాసిన బ్యాంకర్లు

ఖాతాలను రద్దు చేస్తున్న బ్యాంకులు

ఉంగుటూరు మండలం కైకరంలో జెఎల్ గ్రూపులుగా ఏర్పడి స్టేట్‌బ్యాంకులో రైతులు ఖాతాలు తెరిచారు. పది గ్రూపుల ఖాతాలు రద్దు చేశామని చెప్పి బ్యాంకు పుస్తకంలో అధికారులు రాసిచ్చారు. అదే సర్వే నెంబర్లకు సంబంధించి భూయజమానికి రుణం ఇచ్చామని, మీకు మళ్లీ ఇవ్వడం కుదరదని సమాధానం ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్లతో సంబంధం లేకుండా రుణాలివ్వడం కోసమే జెఎల్ గ్రూపులను ఏర్పాటు చేశారు. మళ్లీ అదే పరిస్థితి ఎదురవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు మూడువేల వరకూ రైతుబృందాల గ్రూపులు ఉన్నాయి. రుణాలివ్వనప్పుడు వీటిని ఎందుకు ఏర్పాటు చేసినట్లో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ సుధాకర్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

నా దృష్టికి రాలేదు : సూర్యారావు, ఎల్‌డిఎం

రైతులతో ఏర్పాటు చేసిన జెఎల్ గ్రూపుల ఖాతాలను రద్దు చేసినట్లు నా దృష్టికి రాలేదు. స్టేట్ బ్యాంకు అధికారులతో మాట్లాడి విషయం తెలుసుకుంటాను.

మా గ్రూపును రద్దు చేశారు



మా ఊరిలో ముగ్గురు రైతులం కలిసి రెవెన్యూ అధికారుల అనుమతితో జెఎల్ గ్రూపుగా ఏర్పాటై, స్టేట్ బ్యాంకులో ఖాతా ప్రారంభించాం. రుణం కోసం వెళ్తే అదే సర్వేనెంబర్‌పై భూ యజమానికి రుణం ఇచ్చాం కాబట్టి, మీ ఖాతాను రద్దు చేస్తున్నామని చెప్పారు.

లంకా శ్రీనివాసరావు, కైకరం

రుణాలివ్వడం కుదరదన్నారు



మా ఊరిలో ఐదుగురు రైతులం కలిసి కనకదుర్గ జెఎల్ గ్రూపుగా ఏర్పడ్డాం. రుణం ఇవ్వడం కుదర దంటూ గ్రూపు ఖాతా రద్దు చేస్తున్నట్లు అధికారులు రాసిచ్చారు. ఎందుకు గ్రూపు ఏర్పాటు చేయిం చారో.. ఎందుకు రద్దు చేశారో అర్థం కావడం లేదు.

గున్ను వీరాంజనేయులు, కౌలురైతు, కైకరం

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ ఫొటోగ్రాఫర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా పలు అసోసియేషన్‌లు వివిధ కార్యక్రమాలు నిర్వహించాయి. గుంటూరు జిల్లాలో ఎలైడ్ ట్రేడ్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ (పట్వా) ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురంలోని లయన్స్ అసోసియేషన్ హాల్‌లో ఉచిత వైద్య పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐడి ఎఎస్‌పి జె.భాస్కరరావు, పట్వా ఛైర్మన్ కె.కృష్ణ, జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఎస్‌హెచ్ఒ భవనంలో ఏపిజెయఫ్ ఆధ్వర్యంలో సీనియర్ ఫొటో జర్నలిస్టులు మేడూరి రాజేంద్రప్రసాద్, అంకాళ సుబ్బారావులను సన్మానించారు. కృష్ణాజిల్లాలోని గుడివాడ, నూజివీడు, మచిలీపట్నం, ఉయ్యూరు, నందిగామలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు జరిగాయి. సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. వైజాగ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులోని కాళీమాతా టెంపుల్ నుంచి విశాఖ మ్యూజియం వరకూ మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జివిఎంసి కమిషనర్ హరినారాయణన్ ప్రారంభించారు. ఫొటో జర్నలిస్టుల ప్రతిభను కొనియాడారు. మూడు రోజులుగా కర్నూలు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్ శనివారం ముగిసింది. అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు సందర్శించి ఫొటోలను తిలకించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఫొటోలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళాపరిషత్‌లో అనంత హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఛాయచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఉత్తమ ఛాయచిత్రాలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. దాదాపు 150 చిత్రాలను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో ఫొటోగ్రాఫర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్, సిఐటియు జిల్లా నేత కందారపు మురళి, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సుధారాణి, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్ పాల్గొని ఫొటోగ్రాఫర్లకు శాలువా కప్పి సత్కరించారు.



గుంటూరులో పట్వా అధ్వర్యంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న సిఐడి అదనపు ఎస్‌పి జె భాస్కరరావు



గన్నవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

బెల్టుషాపుల నియంత్రణ సాధ్యమే

ఎక్సైజ్ సిఐ పాండురంగారావు

ప్రజాశక్తి - గన్నవరం

ప్రజలంతా సహకరిస్తేనే గ్రామాల్లో బెల్టుషాపుల నియంత్రణ సాధ్యమవుతుందని ఎక్సైజ్ సిఐ జి.పాండురంగారావు అన్నారు. శనివారం కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బండారుగూడెం, తేలప్రోలు, బుద్దవరం, దావాజిగూడెం, రాజీవ్‌నగర్‌లలో బెల్టుషాపుల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పాండు రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బెల్టుషాపులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. అయితే అక్కడక్కడా మొబైల్ సేల్స్ జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అవీ లేకుండా చేయడానికి ప్రజల సహకారంతో కృషి చేస్తామన్నారు. బెల్టుషాపు డీలర్లు కూడా నిబంధనలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు సత్యవాణి, హనీఫ్‌బాబు పాల్గొన్నారు.

పోలీసుల సాయంతో వైన్‌షాపు ప్రారంభం

తీవ్రంగా వ్యతిరేకించిన స్థానిక మహిళలు

ప్రజాశక్తి-కంచరపాలెం, విశాఖ

జివిఎంసి 37వ వార్డు జవహర్‌నగర్‌లో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన వైన్‌షాపును తరలించాలని కోరుతూ 50 రోజులుగా మహిళలు ఆందోళన చేస్తున్నా లెక్కచేయని నిర్వాహకుడు శనివారం పోలీసుల సాయంతో అమ్మకాలు ప్రారంభించాడు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు దుకాణాన్ని దగ్గరుండి ప్రారంభించడంపై స్థానిక మహిళలు తీవ్రంగా వ్యతిరేకించారు. దుకాణం ముందు పెద్దఎత్తున నిరసన తెలిపారు. స్థానిక మహిళలకు సిఐటియు కంచరపాలెం జోన్ అధ్యక్షుడు ఎన్.సింహాచలం మద్దతు పలికారు. వైన్‌షాపును ఎత్తి వేసేందుకు గతంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. హంపి
2. విశాల్ సిక్కా
3. చైనా, 4. 7,25,000 మంది
5. బార్సిలోనా

కాన్‌కాస్ట్ కార్మికుల ర్యాలీ భగ్నం



శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ర్యాలీ నిర్వహించడానికి సిద్ధమైన కార్మికులు

60 మంది అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం దూసిలోని కాన్‌కాస్ట్ పరిశ్రమ కార్మికులు శనివారం తలపెట్టిన ర్యాలీని పోలీసులు భగ్నం చేశారు. శ్రీకాకుళంలోని తహశీల్దార్ కార్యాలయం నుంచి కార్మికశాఖ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లడానికి కార్మికులు సిద్ధమవుతుండగా, పోలీసులు అడ్డగించారు. తాము శాంతియుతంగానే ర్యాలీ చేపడుతున్నామని కార్మికులు చెప్పినా, పోలీసులు వినిపించుకోకపోవడంతో కార్మికులు ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావుతో పాటు 60 మందిని అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు ముందు కార్మికులనుద్దేశించి గోవిందరావు మాట్లాడుతూ కాన్‌కాస్ట్ కార్మికుల వేతన, పిఎఫ్, ఇఎస్‌ఐ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాన్‌కాస్ట్ పరిశ్రమలో 650 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి మార్చి నుంచి వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అండతో యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. కాన్‌కాస్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 21న చేపడుతున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం మొద్దు నిద్ర

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహ్మద్

ప్రజాశక్తి - మచిలీపట్నం

విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర ప్రదర్శిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహ్మద్ అన్నారు. ఎస్ఎఫ్ఐ తూర్పుకృష్ణా కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా మచిలీ పట్నంలో చలో కృష్ణా విశ్వవిద్యాలయం కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక కోనేరు సెంటర్ నుంచి యూనివర్సిటీ వరకు విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. వైస్ ఛాన్సలర్ ఎస్.రామకృష్ణారావు బయటకు రావాల్సిందేనంటూ నినాదాలు చేశారు. విసి ఆదేశాలతో విద్యార్థులను లోపలకు అనుమతించారు. ఈ సందర్భంగా రామకృష్ణా రావు మాట్లాడుతూ.. డిమాండ్లు న్యాయసమ్మత మైనవేనని, వాటిని పరిష్కరించటానికి ప్రభుత్వంతో మాట్లాడతానని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు లేవనెత్తిన అంశాలు పరిష్కరిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి రుద్రవరంలోని నూతన భవనాల్లో తరగతులు ప్రారంభమౌతాయని చెప్పారు. ఎగ్జామ్ కంట్రోలర్‌ను మార్చామని, అన్నీ పరిష్కరిస్తామని వివరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేట్ కళాశాలలూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



కృష్ణా యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్మికులకు తగ్గిన పనులు

ఎపి హమాలీ ముఠా కార్మిక ఫెడరేషన్

ప్రజాశక్తి - మచిలీపట్నం

కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా ప్రవేశపెట్టిన పెద్దనోట్ల రద్దు, నగదు బదిలీ, జిఎస్‌టి పన్ను ప్రభావంతో చిన్న, మధ్యతరగతి వ్యాపారస్తులను తీవ్రంగా దెబ్బ తీసిందని, ముఠా కార్మికులకు పనులు తగ్గాయని ఎపి హమాలీ ముఠా కార్మిక ఫెడరేషన్ కో కన్వీనర్ ముజఫర్ అహ్మద్ అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన కృష్ణాజిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీ ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉపాధి తగ్గిపోవడంతోపాటు నిత్యావసర ధరలు పెరగడం, ఇంటి అద్దె, విద్య, వైద్యానికి డబ్బుల్లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014 ఎన్నికల ముందు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేడు ఆ విషయం గురించి మాట్లాడకపోవటం బాధాకరమన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయటం లేదని విమర్శించారు.

బీడీ కార్మికుల వేతనాలు సవరించండి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బీడీ కార్మికుల వేతనాలను సవరించాలని, జిఒ 41ని అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలులో శనివారం ఇక్బాల్ హుసేన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సమావేశాన్ని గఫూర్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని బీడీ కార్మికులకు 2011లో రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన జిఒ 41 కాలపరిమితి 2016లోనే ముగిసినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. మోడీ, చంద్రబాబునాయుడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, వేతనాల అన్యాయంపై బీడీ కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులకు పనిలేని సమయంలో ఉపాధి కల్పించాలని కోరారు. ఇప్పటికైనా వారి సమస్యలను పరిస్కరించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ , బీడీ కార్మిక రంగం రాష్ట్ర బాధ్యులు పి.చైతన్య ఆయా జిల్లాల నుంచి బీడీ కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. 2017లో యూనియన్ సభ్యత్వాన్ని సెప్టెంబర్ 10లోపు పూర్తి చేయాలని సమావేశం తీర్మానించింది. అనంతరం రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర యూనియన్ కన్వీనర్‌గా పి.చైతన్య, జిల్లాకు నలుగురు చొప్పున సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. సెప్టెంబర్ 14 నుండి 16 వరకు తమిళనాడు వేలూరులో జరుగు అఖిలభారత బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఏడో మహాసభలకు 10 మంది ప్రతినిధులను సమావేశం ఎంపిక చేసింది. సమావేశంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, నగర నాయకులు అబ్దుల్‌దేశాయి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

కీచక లెక్చరర్ మాకొద్దు

డికెడబ్ల్యు కళాశాల విద్యార్థినుల ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు గురిచేసే కెమిస్ట్రీ లెక్చరర్ డి.ప్రభాకర్ తమ కళాశాలకు వద్దని శనివారం కాలేజీ ఎదుట విద్యార్థినులు ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి మూడో సంవత్సరం బిఎస్‌సి విద్యార్థినులు రజిత, స్వప్న మాట్లాడుతూ.. 2015-16 కెమిస్ట్రీ లెక్చరర్ బి.ప్రభాకర్ సీనియర్ విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారని తెలిపారు. విద్యార్థినులపై చేతులు వేయడం పేరు పెట్టి పిలవకుండా అసభ్య కరంగా మాట్లాడేవారన్నారు. అప్పట్లో ఆయన వేధింపులు భరించలేక తామంతా ప్రిన్సిపల్ శైలజకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రస్తుతం ఖమ్మంలో పనిచేస్తూ తిరిగి ఇక్కడకొచ్చారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష సహాయ కార్యదర్శులు నందకిరణ్, శ్రీనివాసులు మాట్లాడుతూ కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ప్రభాకర్ గతంలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా లైంగిక వేధింపులకు గురిచేసేవారని తెలిపారు.

ప్రజాశక్తి
విజయవాడ
ఆదివారం
20 ఆగస్టు 2017
జాతీయం



లడఖ్‌లో పర్యటించనున్న రావత్

లడఖ్: ఆర్మీ ఛీఫ్ బిపిన్ రావత్ ఆదివారం నుంచి మూడురోజుల పాటు లడఖ్‌లో పర్యటించనున్నారు. డోక్లాంలో ప్రతిష్టంభన, తాజాగా పాగోంగ్ ఉద్రిక్తతల నేపథ్యంలో రావత్ లడఖ్ పర్యటన ప్రాధాన్యత సంతరించు కుంది.తూర్పు లడఖ్‌లో రక్షణ పరమైన అంశాలపై సమీక్షించి చైనా సరిహద్దు వెంబడి భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించనున్నారు. అనంతరం ఉన్నతస్థాయి కమాండర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇక పోగాంగ్ సరస్సు 135 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండగా ఈ సరస్సులో మూడోవంతు భారత్ ఆధీనంలో ఉండగా మిగిలినది చైనా ఆధ్వర్యంలో ఉంది.



అమరీందర్‌సింగ్‌కు క్లీన్‌చిట్

ఛండీగఢ్: లుథియానా సిటీ సెంటర్ ప్రాజెక్టు కుంభకోణం కేసులో పంజాబ్ సిఎం అమరీందర్‌సింగ్‌కు క్లీన్‌చిట్ లభించింది. కోర్టు తీర్పుతో ఆయనతోపాటు మరో 31 మందికి కూడా ఈ కేసు నుంచి ఉపశమనం పొందారు. కాంగ్రెస్ అధికారంలోవున్న సమయంలో సిటీ సెంటర్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఢిల్లీకి చెందిన 'టుడే హోమ్స్' అనే సంస్థకు అమరీందర్‌సింగ్ అనుకూలంగా వ్యవహరించారని శిరోమణి అకాలీదళ్ ఆరోపించింది. రూ. 1,144 కోట్ల అవినీతి జరిగిందని పేర్కొంది. 2007లో ఎస్‌ఎడి-బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరీందర్ సింగ్, ఆయన కుమారుడు రనీందర్‌సింగ్, అల్లుడు రామీందర్‌సింగ్‌తో పాటు 36 మందిపై విజిలెన్స్ బ్యూరో కేసు నమోదు చేసింది.

కాశ్మీర్‌లో మోడీ విఫలం

- ఐటీ రిటర్న్స్‌పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కేంద్రం
- జిఎస్‌టితో పెరిగిన ప్రజల బాధలు
- సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి



భువనేశ్వర్: కాశ్మీర్ సమస్య పరిష్కారం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. బుల్లెట్లు, దూషణలతో కాశ్మీర్ సమస్యకు పరిష్కారం సాధ్యం కాదని ప్రధాని నరేంద్రమోడీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించడాన్ని ఏచూరి విమర్శించారు. కొంతకాలం క్రితం కాశ్మీర్‌లో పర్యటించిన పార్లమెంటరీ బృందానికి కేంద్రం ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఏచూరి అన్నారు. సమస్య పరిష్కారానికి దశలవారీగా చేపట్టనున్న చర్యలను హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆ సందర్భంగా ప్రకటించారని..అయితే, వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాశ్మీర్ ప్రజల్లో విశ్వాసం పాదుగొలిపే చర్యలు చేపట్టనున్నట్టు కేంద్రం హామీ ఇచ్చిందని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిందన్నారు. అయితే కేవలం ప్రకటనలతో సమస్య పరిష్కారం కాదన్నారు. ఆదాయ పన్ను చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఏచూరి విమర్శించారు.చౌక దుకాణాల్లో లబ్దిదారులకు చక్కెర, కిరోసిన్ అందటంలేదని ఆయన తెలిపారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు ప్రకటించిన విధంగా రుణ మాఫీ చేయకపోవడంతో ఆ రాష్ట్రాల్లో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఏచూరి తెలిపారు. పంటల ఖర్చుకు ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధర ఇస్తామంటూ ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు పరచాలని ఏచూరి డిమాండ్ చేశారు. పెద్దనోట్ల రద్దు తర్వాత జమైన మొత్తం ఎంతో రిజర్వ్‌బ్యాంక్ చెప్పలేకపోతోందనీ, నోట్లరద్దు సమయంలో నల్లడబ్బు అంతా తెలుపు చేసుకున్నట్టు అర్థమవుతున్నదనీ ఏచూరి అన్నారు. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థల నిధులపై నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్పొరేట్ సంస్థల నుంచి బిజెపికి విరాళాలు

కార్పొరేట్ సంస్థలు పార్టీలకు ఇచ్చిన మొత్తం రూ.900 కోట్లలో అధిక భాగం బిజెపికే(రూ.705 కోట్లు) దక్కిందని, రెండో స్థానంలో కాంగ్రెస్(రూ.198 కోట్లు) ఉన్నట్టు వెల్లడైన విషయాన్ని ఏచూరి గుర్తు చేశారు. కార్పొరేట్ సామాజిక నిధి(సిఎస్ఆర్) కోసం చట్టం తేవాలని ఏచూరి డిమాండ్ చేశారు. ఆ నిధిని ప్రజాస్వామ్య నిధిగా భావించాలని ఆయన సూచించారు. ఎన్నికల కమిషన్ ద్వారా పార్టీలకు ఎన్నికల ఖర్చులు ఇవ్వాలని ఆయన అన్నారు. కొన్ని పార్టీలు ఎన్నికల్లో పెద్దమొత్తంలో ఖర్చు చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను నీరుగారుస్తున్నాయని ఏచూరి విమర్శించారు. కార్పొరేట్ సంస్థలు తాము కోరుకున్న పార్టీని అధికారంలోకి తేవడానికి పెట్టుబడులు పెడ్తూ, ఆ తర్వాత వాటిని రాబట్టుకుంటున్నాయని ఏచూరి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, విదేశాంగ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా 15 రోజులపాటు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఏచూరి తెలిపారు.

ఐటి రిటర్న్స్‌పై తప్పుడు లెక్కలు

జిఎస్‌టి అమలులోకి తెచ్చిన తర్వాత కొత్తగా ఆదాయం పన్ను రిటర్న్స్ 56 లక్షల వరకూ వచ్చాయని ప్రధాని చెప్పగా, ఆర్థికమంత్రి ఆ సంఖ్యను 91 లక్షలుగా పేర్కొన్నారని ఏచూరి గుర్తు చేశారు. మరోవైపు అధికారిక ప్రకటనలో ఆ సంఖ్య 31 లక్షలుగా, ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు 5 లక్షలుగా చెప్పారని ఏచూరి తెలిపారు. ఈ అయోమయాన్ని తొలగించేందుకు కేంద్రం స్పష్టత ఇవ్వాలని ఏచూరి అన్నారు. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత ప్రజల బాధలు మరింత పెరిగాయన్నారు.

భారత్‌కు డ్రోన్ల విక్రయం

అమెరికాలో 2వేల ఉద్యోగాలు

వాషింగ్టన్ : భారత్‌కు 22 సీ గార్డియన్ డ్రోన్‌లను విక్రయించాలన్న నిర్ణయంతో రెండు దేశాల మధ్య సంబంధాలు బలోపేతమవుతాయని అమెరికా, అంతర్జాతీయ వ్యూహాత్మక అభివృద్ధి ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ వివేక్ లాల్ తెలిపారు.. సుమారు రూ.31వేల186 కోట్లు విలువైన డ్రోన్లను భారత్‌కు విక్రయించాలని అమెరికా నిర్ణయించింది. దీనివల్ల అమెరికాలో 2 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందని, మరెన్నో పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన చెప్పినట్లు అట్లాంటిక్ కౌన్సిల్ శుక్రవారం వెల్లడించింది. డ్రోన్ల అమ్మకానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏడాది జూన్‌లోనే ప్రకటించారు. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ వైట్‌హౌస్‌లో ఆయనను కలుసుకున్న సమయంలో ఈ ప్రకటన చేశారు. సీ గార్డియన్ డ్రోన్లను అమెరికా నుండి ఒక నాటోయేతర దేశం కొనుగోలు చేయనుండటం ఇదే తొలిసారి అని లాల్ తెలిపారు. దక్షిణ చైనా సముద్రంపై చైనా దృష్టి పెట్టిన నేపథ్యంలో భారత్ ప్రాంతీయ, ప్రాంతీయేతర భాగస్వాములతో తీరప్రాంత సంబంధాలను నిర్మించుకోవడం ద్వారా హిందూ మహా సముద్రంలో తన ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు దీనిని ఒక అవకాశంగా తీసుకుంటుందని భావిస్తున్నట్లు లాల్ తెలిపారు. భారత్‌కు ప్రధాన రక్షణ భాగస్వామి హోదా కల్పించిన నాటి నుంచి జరిగిన తొలి అతి పెద్ద రక్షణ ఒప్పందం ఇది అని ఆయన పేర్కొన్నారు.

మిజోరం మంత్రి రాజీనామాకు ఎన్‌జిఓ సమన్వయ కమిటీ డిమాండ్

షిల్లాంగ్: మిజోరం మత్స్య శాఖ సహాయక మంత్రి బుద్ధధన్ చక్మా రాజీనామా చేయాలని స్వచ్ఛంద సంస్థల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. స్వయంప్రతిపత్తి అధికారాలున్న చక్మా జిల్లా మండలి ఎన్నికల్లో బుద్ధధన్ జోక్యం చేసుకున్నారని, దీనికి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యంగ్ మిజో అసోసియేషన్(వైఎంఎ) అధ్యక్షుడు లాల్‌బియాక్జువాలా శనివారం తెలిపారు. ఆగస్టు 25లోగా ఆయన రాజీనామా చేయాలనీ, లేకపోతే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మిజోరం సిఎం లాల్ తన్హ్వాలా మత్స్య శాఖ మంత్రి కావడంతో ఆయనపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. జూలై 27న ఇక్కడ సమావేశమైన ఎన్‌జిఓ సమన్వయ కమిటీ సభ్యులు బుద్ధధన్ రాజీనామా అంశంపై చర్చించారనీ, అనంతరం ఆయన రాజీనామా కోరుతూ లాల్ తన్హ్వాలాకు అభ్యర్థన లేఖ అందించారని లాల్‌బియాక్జువాలా చెప్పారు. ఆగస్టు 26న మరోసారి సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు.

రాజీ కుదిరింది...!

- ఒపిఎస్ శిబిరం ప్రకటన
- సోమవారం ఉమ్మడి ప్రకటన
- విలీనం కోసం బిజెపి ఒత్తిడి

చెన్నై: అన్నాడిఎంకెలో విలీన చర్చలు చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయని అన్నాడిఎంకె రెబల్ నేత పన్నీరు సెల్వం పేర్కొన్నారు. రెండురోజుల్లో ప్రకటన వెలువడుతుందనీ, పార్టీ కేడర్ అభిప్రాయలకు అనుగుణంగా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్నాడిఎంకెలో రెండు శిబిరాల మధ్య ప్రతిష్టంభనపై సుదీర్ఘ సమావేశాల అనంతరం చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు పన్నీరు సెల్వం శిబిరంలోని సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రకటన చేస్తారని తెలిపారు. బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా రాష్ట్రంలో పర్యటించడానికి ఒక్కరోజు ముందు ఈ ప్రకటన వెలువడింది. శనివారం పన్నీరు సెల్వం విలేకర్లతో మాట్లాడుతూ.. 'రెండురోజుల్లో నిర్ణయం ఉంటుంది. పార్టీ కేడర్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటున్నాం' అని పేర్కొన్నారు. శశికళను ఆమె కుటుంబాన్ని పార్టీ నుంచి బహిష్కరించడం, జయలలిత మృతిపై సిబిఐ విచారణ చేయించడానికి పళని వర్గం అంగీకరించింది. మూడో డిమాండ్‌గా పన్నీరుకు ముఖ్యమంత్రి లేదా పార్టీ అధ్యక్ష పదవి ఏదో ఒకటి ఇవ్వాలని కోరారు. అయితే అందుకు పళని శిబిరం నుంచి అభ్యంతరంగా రాగా ఉమ్మడి అన్నాడిఎంకెలో జనరల్ సెక్రటరీతో సమానమైన పోస్టును ఒపిఎస్ కోసం సృష్టించారు. డిప్యూటీ సిఎం పదవి రెండు మంత్రి పదవులు కేటాయించడం ద్వారా చర్చలు ఫలప్రదమైనట్లు పన్నీరు శిబిరంలోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పార్టీ విలీనం తర్వాత జనరల్‌బాడీ సమావేశంలో శశికళ తొలగింపు నిర్ణయం తీసుకోనున్నారు.. ఒప్పందాన్ని పన్నీరు సెల్వం గ్రూపులోని సీనియర్ నాయకులు ధ్రువీకరించారు. కనీసం 10 మంది పన్నీరు వర్గానికి కీలకమైన పదవులు దక్కనున్నాయని తెలిపారు. వీటితో పాటు మరికొన్ని జిల్లాల్లో పార్టీ కార్యదర్శులు పదవులను పన్నీరు వర్గం కోరింది. అయితే ఈ ఒప్పందం కోసం కేంద్రంలోని బిజెపి తీవ్రంగా ప్రయత్నించిందని ఆరోపణలున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ నేత ఒకరు ఒత్తిడితో ఈ ఒప్పందం చేయించారని పలువురు పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఐదునెలల పాటు పన్నీరు ఒత్తిడిని ఎదుర్కొనప్పటికీ ఒక మెట్టు దిగక తప్పలేదనీ సీనియర్ నాయకులు ఒకరు తెలిపారు. ఈ ఒప్పందాలపై 'ఒపిఎస్ అనాసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇక ఒపిఎస్ శిబిరంలో కూడా అసమ్మతి గళం వినిపిస్తోంది.



కార్గిల్ మార్గాన్ని తెరవండి : మెహబూబా ముఫ్తీ



కాశ్మీర్: పాకిస్తాన్‌తో యుద్ధం అనంతరం మూసివున్న కార్గిల్ మార్గాన్ని తెరవాలని జమ్మూకాశ్మీర్ సిఎం మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు. బాహ్య ప్రపంచంతో కార్గిల్‌ను అనుసంధానించాలని కోరారు. గతంలో మధ్య ఆసియా ప్రవేశద్వారమనే హోదా కార్గిల్‌కు ఉండేదని, ఆ హోదాను కాపాడుకోవాలని ఆమె చెప్పారు. కార్గిల్-స్కర్దు, తుర్తుక్-ఖప్లు మార్గాలు తిరిగి ప్రారంభించడం ద్వారా పొరుగు దేశంతో శాంతి సంబంధాలు మెరుగౌతాయని ఆమె అభిప్రాయపడ్డారు. స్వాతంత్రదినోత్సవ ప్రసంగంలో కాశ్మీర్ అంశంలో మోడీ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆమె జవాబిస్తూ "మోడీలో నాకు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రతిబింబం కనిపిస్తోంది. వాజ్‌పేయి మార్గంలో ప్రధాని పయినిస్తారనే ఆశాభావం నాకుంది. కాశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వం మంచి విధానాలతో ముందుకొస్తుంది" అని పేర్కొన్నారు.

గోరఖ్‌పూర్ పిక్నిక్ స్పాట్ కాదు : యోగి

- తిప్పికొట్టిన కాంగ్రెస్
- ఖండించిన అఖిలేష్

గోరఖ్‌పూర్: సొంత నియోజకవర్గంలోని ఆసుపత్రిలో తానున్నప్పుడు వరుసగా చిన్నారులు మరణిస్తున్నా చూస్తూ ఊరుకున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్ష పార్టీ నేతల గోరఖ్‌పూర్ పర్యటనపై అసహనం వ్యక్తం చేశారు. గోరఖ్‌పూర్‌ను పిక్నిక్ స్పాట్‌గా మార్చేందుకు రాహుల్, అఖిలేష్ యాదవ్‌లు పర్యటిస్తున్నారన్నారు. యోగి వ్యాఖ్యలను కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీలు తిప్పికొట్టాయి. శనివారం ఇక్కడ 'స్వచ్ఛ్ ఉత్తరప్రదేశ్ – స్వస్థ్య ఉత్తరప్రదేశ్' కార్యక్రమ ప్రారంభం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "లక్నోలో కూర్చున్న షెజాదా అఖిలేష్), ఢిల్లీలోవున్న యువరాజు(రాహుల్ గాంధీ)లకు ఈ కార్యక్రమం ప్రాముఖ్యత అర్థం కాదు.

గోరఖ్‌పూర్‌ను పిక్నిక్ స్పాట్‌గా మార్చేందుకే వారు పర్యటిస్తున్నారు. అందుకు మేం అనుమతించం" అని చెప్పారు. గోరఖ్‌పూర్ నుంచే స్వచ్ఛ సుందర్ యుపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఓ వైపు ఈ కార్యక్రమం జరుగుతుండగానే మరోవైపు బిఆర్‌డి ఆసుపత్రిలో మరణించిన చిన్నారుల కుటుంబసభ్యులను రాహుల్ గాంధీ పరామర్శించారు.

మాటలు జాగ్రత్త!: కాంగ్రెస్

యోగి పిక్నిక్ స్పాట్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. యోగి ఇకపై జాగ్రత్తగా మాట్లాడాలని లేదంటే ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సూచించింది. సమస్యను తప్పుదోవపట్టించేలా బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, చిన్నారులు వరుసగా మరణించడం వంటి తీవ్రమైన సమస్యలపై ఎప్పుడూ సున్నితంగానే వ్యవహరించామని, రాహుల్ పర్యటన నిష్కళంకమైనదని కాంగ్రెస్ పేర్కొంది. ఆ పార్టీ నేత శోభా ఓజా మాట్లాడుతూ "రోజురోజుకీ దిగజారుతున్న పరిస్థితిని చక్కదిద్దేందుకు యోగి ప్రభుత్వం ఏం చేసింది. 2 గంటల 30 నిమిషాల పాటు ఆసుపత్రిలో ఆదిత్యనాథ్ ఏం చేశారు" అని ప్రశ్నించారు.

మరోవైపు మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ కూడా యోగి వ్యాఖ్యలను ఖండించారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజల్ని ఎంత కాలం యోగి మోసగిస్తారని ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. యుపిని స్వచ్ఛ, ఆరోగ్య రాష్ట్రంగా మార్చగలరా? అని ప్రశ్నించారు.

ఎన్డీయేలో చేరనున్న జెడి(యు) నితీష్ గ్రూప్

- పాట్నాలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం
- నిరసన సమావేశాన్ని ఏర్పాటు చేసిన శరద్ యాదవ్
- లాలూతో కలిసి పోరుకు నిర్ణయం



న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్(ఎన్డీయే)లో భాగస్వామి కానున్నది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఆఫీస్ బేరర్లతో శనివారం పాట్నాలో నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో దాదాపు నాలుగేళ్ళ విరామం తరువాత జెడి(యు), తిరిగి ఎన్డీయే కూటమిలో చేరుతున్నట్లయ్యింది. మహాకూటమిని విచ్ఛన్నం చేసి బిజెపి మద్దతుతో నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన అనంతరం తొలిసారిగా పాట్నాలో జరిగిన జెడి(యు) జాతీయ కార్యవర్గ సమావేశం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇదిలా ఉండగా బిజెపితో జత కట్టడం పట్ల నితీష్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడి(యు) సీనియర్ నేత శరద్ యాదవ్ శనివారం పాట్నాలో నిరసన సమావేశం ఏర్పాటు చేశారు. నితీష్ కుమార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆర్‌జెడితో కలిసి బిజెపి, నితీష్ అపవిత్ర పొత్తుకు వ్యతిరేకంగా పోరాడాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

మంత్రి వర్గంలో చేరే అవకాశం

ఎన్డీయేలో చేరనున్న జెడి(యు) నితీష్ వర్గానికి మోడి మంత్రి వర్గంలో స్థానం లభించనున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. జెడి(యు)తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు రెండు మంత్రి పదవులు ఇచ్చే అవకాశమున్నదని వారు పేర్కొన్నారు.

సిఎం నివాసం వెలుపల ఘర్షణ

జెడి(యు)లోని రెండు వర్గాలకు చెందిన మద్దతుదారులు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నివాసం వెలుపల శనివారం ఘర్షణ పడ్డారని పోలీసులు తెలిపారు. శరద్ యాదవ్ స్థానిక ఎస్‌కె మెమోరియల్ హాల్‌లో జన్ అదాలత్‌ను నిర్వహించేందుకు ఇక్కడకు చేరుకున్నారు. ఇక్కడి విమానాశ్రయం నుంచి కార్యక్రమం జరిగే ప్రదేశానికి వెళ్తున్న యాదవ్ వెంట ఆయన మద్దతు దారులు కూడా ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా మార్గం మధ్యంలో సిఎం నివాసం ఎదుట నితీష్ మద్దతుదారులతో ఘర్షణ జరిగింది. కాగా ఈ సంఘటనపై వ్యాఖ్యానించేందుకు అక్కడే ఉన్న శరద్‌యాదవ్ నిరాకరిస్తూ తాను హాజరయ్యే కార్యక్రమం వద్ద ఈ విషయమై మాట్లాడతానని విలేకరులకు తెలిపారు. దీనిపై దర్యాప్తు జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పాట్నా సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ మను మహారాజ్ తెలిపారు.

డార్జిలింగ్‌లో భారీ పేలుడు

- జిజెఎం హస్తంపై పోలీసుల అనుమానం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో శనివారం వేకువజామున భారీ పేలుడు సంభవించింది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గూర్ఖాల్యాండ్ కోసం నిరవధికంగా నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం ఇదే తొలిసారి. శుక్రవారం అర్థరాత్రి దాటిన తర్వాత 12.15-12.30 మధ్య ఈ పేలుడు సంభవించింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు గస్తీ వ్యానుకు సమీపంలో ఈ పేలుడు జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై డార్జిలింగ్ ఐజి మనోజ్ వర్మ స్పందిస్తూ, కొద్దిరోజుల క్రితం బిజాన్‌బరి పవర్‌ప్లాంట్ ప్రాంతంలో కొద్ది మొత్తంలో పేలుడు పదార్థాలు అపహరణకు గురయ్యాయన్నారు. ఆ పేలుడు పదార్థాలను ఇక్కడ ఉపయోగించినట్లు అనుమానిస్తామని తెలిపారు. జిజెఎం మద్దతుదారుల హస్తంపై కూడా అనుమాలున్నాయనీ అదిశగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు ఫొరెన్సిక్ బృందం కూడా ఆ ప్రాంతంలో తనిఖీ చేసిందన్నారు. అయితే ఈ ఘటనపై జిజెఎం అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలపై నాన్‌బెయిలబుల్ కేసులు

పాట్నా: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలపై ముజఫర్‌నగర్ రైల్వే కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. రైల్వే సేవలను అంతరాయం కలిగించారన్న ఆరోపణల నేపథ్యంలో 2012 ఏప్రిల్ 3న ముజఫర్‌నగర్ ఎమ్మెల్యే కపిల్ అగర్వాల్, బుద్ధన ఎమ్మెల్యే ఉమేష్ మాలిక్‌లపై కేసు నమోదయ్యింది. ఈ కేసులో నిందితులు విచారణకు సక్రమంగా హాజరుకాకపోవడంతో చీఫ్ జూడిష్యల్ మెజిస్ట్రేట్ గోపాల్ తివారి వీరిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాడు. సెప్టెంబరు 30న కోర్టు ఎదుట ప్రవేశపెట్టాల్సిందిగా పోలీసులను ఆదేశించింది.

అస్సాంలో 150కు చేరిన వరద మృతులు

గౌహతి : అస్సాంలో వరదల కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 150కు చేరుకుంది. శుక్రవారం ఒక్క రోజే 11 మంది మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 150 చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఇంకా అనేక ప్రాంతాలు వరద ముంపులోనే వున్నాయి. బక్స, బార్‌పేట్, బొంగావ్, సౌత్ కామ్ సల్మారా, కామ్‌రుప్, కక్రజార్ వంటి ప్రాంతాలో పరిస్థితి తీవ్రంగా వుంది. ఈ నెల 10 నుంచి బహ్మపుత్రా నదికి రెండో దశ వరదలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 12 నాటికే వరద కారణంగా దేశంతో అస్సాంకు రవాణ స్థంభించింది. ఇంకా అనేక వంతెనలు ముంపులోనే వున్నాయి.

15 ఖడ్గమృగాలు మృతి

బ్రహ్మపుత్రా నది వరద ఉధృతి కారణంగా ప్రసిద్ధి చెందిన కజరింగా నేషనల్ పార్క్ 50 శాతం నీటిలో మునిగిపోయింది. మొత్తంగా 225 జంతువులు మృతి చెందాయి. ఇందులో 15 ఖడ్గమృగాలు, 4 ఏనుగులు, 178 జింకలు, ఒక పులి వున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. జంతువులు ఆహారం కోసం తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని అధికారులు తెలిపారు.



దూరదర్శన్ తీరుకు వ్యతిరేకంగా అగర్తలలో భారీ ప్రదర్శన

అగర్తల : త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌పై దూరదర్శన్ వ్యహరించిన తీరుకు వ్యతిరేకరంగా అగర్తలలో నిర్వహించిన ర్యాలీ, ధర్నాలో భారీ సంఖ్యలో సిపిఎం కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి ర్యాలీగా అకాశవాణి భవన్‌కు చేరుకున్నారు. తరువాత అక్కడ ధర్నాను నిర్వహించారు. ఆగష్టు పదిహేనున స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాణిక్ సర్కార్ చేసిన ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి దూరదర్శన్ నిరాకరించిన సంగతి తెలిసిందే. ప్రజలు ఎన్నుకొన్న ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి నిరాకరించడం ప్రజాస్వామ్య విలువలను, స్ఫూర్తిని వ్యతిరేకించడమేనని ధర్నాలో పాల్గొన్న వ్యక్తులు విమర్శించారు.

అధికారంలో 50 ఏళ్లు కొనసాగుతాం

- అమిత్ షా అత్యాశ

భోపాల్: కనీసం యాభై ఏళ్లు అధికారంలో ఉండటమే బిజెపి లక్ష్యమని ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ నిర్వహించిన మధ్యప్రదేశ్ బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. "ఐదేళ్ల..పదేళ్ల కోసం మనం అధికారంలోకి రాలేదు. కనీసం 50 సంవత్సరాలు వరుసగా దేశాన్ని పాలించేందుకే అధికారంలోకి వచ్చాం. ఆ విధంగా మన పార్టీని బలపరిచేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలి. దేశంలో ప్రతి మూలకూ పార్టీని విస్తరించాలి" అని చెప్పారు. ప్రస్తుతం 330 మంది ఎంపీలతో కేంద్రంలో మెజార్టీ ప్రభుత్వం ఉందని, పలు రాష్ట్రాల్లో 1387 ఎమ్మెల్యేలు ఉన్నారని, అయినప్పటికీ పార్టీకి అంకితమైన కార్యకర్తలు ఇంకా సాధించాల్సింది చాలా ఉందని భావిస్తున్నారని అమిత్ షా అన్నారు. పార్టీ సభ్యత్వం పదికోట్ల పైచిలుకు దాటిందని, నేతలు, కార్యకర్తలు చేసిన త్యాగాలే పార్టీని ఈ స్థితికి తీసుకొచ్చాయని పేర్కొన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగించి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ, కామ్‌రూప్ నుంచి కచ్ వరకూ బిజెపి జెండా ఎగరని ప్రాంతం లేకుండా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

బిజెపి నాయకుడి గోశాలలో మృత్యుఘోష

- ఆకలితో మృత్యువాత పడ్డ 200 ఆవులు
- నోరు మెదపని గోగూండాలు
- చత్తీస్‌గఢ్‌లో బిజెపి నేత అరెస్టు

రాయ్‌పూర్: బిజెపి నాయకుడు నడుపుతున్న ప్రభుత్వ ఎయిడెడ్ గోశాలలో 200 ఆవులు ఆకలితో అలమటించి మృతి చెందిన విషాద సంఘటన చత్తీస్‌గఢ్‌లోని రాజ్‌పూర్‌లో జరిగింది. ఆవులకు 48 గంటల పాటు మేత నీళ్లు లేకపోవడంతో మృతి చెందాయి. ఈ ఘటనకు సంబంధించి ఆ ఫాం నిర్వాహకుడు, బిజెపి నేత హరీశ్‌వర్మను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జమీల్ మున్సిపాలిటీలో వర్మ ఉపాధ్యక్షుడిగా వున్నాడు. వర్మపై అగ్రికల్చరల్ క్యాటిల్ ప్రిజర్వేషన్ యాక్ట్-2004 కింద కేసు నమోదు చేశారు.

ఆవులకు సరిపడా మేత వేయకపోవడంతోనే మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. గోశాలలో కొంతకాలంగా ఆవులకు దాణా, వైద్య సదుపాయం అందించడం లేదు. మూడు రోజుల్లోనే 200 పైగా ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండడానికి ఒక్కొక్కదానే గుట్టుచప్పుడు కాకుండా పూడ్చి పెడుతూ వచ్చారు. ఒక్కో గుంటలో 10 నుంచి 15 ఆవులను పూడ్చిపెడుతున్నట్టు స్థానికులు వెల్లడించారు.

ఎంబిఎ, ఇంజనీర్లకు స్వీపర్ పోస్టులు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. అంతకుముందు స్వీపర్లుగా పనిచేసి మరణించినవారి పిల్లలను వారసత్వ కేటగిరీ కింద గత మూడేళ్లలో 50 మంది నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. వీరిలో ఇంజనీరింగ్, ఎంబిఎ చదివినవాళ్లు కూడా ఉన్నారు. నిజానికి వీళ్లు జూనియర్ అసిస్టెంట్, బిల్‌ట్యాక్సు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 17 ఏళ్ల క్రితం మార్చిన నిబంధనల ప్రకారం ఈ పోస్టులకు కనీస విద్యార్హత పదోతరగతిగా నిర్ణయించడం పాటు టైప్‌రైటింగ్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి చేశారు. కానీ దళిత అభ్యర్థులు టైప్‌రైటింగ్‌లో ఉత్తీర్ణులు కాకపోవడంతో జూనియర్ అసిస్టెంట్, బిల్ ట్యాక్సు పోస్టులను ఇవ్వలేకపోయామని, దీంతో వారికి స్వీపర్ పోస్టులు కేటాయించామని కార్పొరేషన్ వివరణ ఇచ్చింది. దీనిపై స్పందించిన దళిత విద్యార్థులు తమకు అన్ని అర్హతలున్నప్పటికీ కావాలనే స్వీపర్ కంటే పైస్థాయి ఉద్యోగాలను నిరాకరించారని వాపోయారు. అంతేసి మొత్తాలు ఖర్చు పెట్టి పెద్ద చదువులు చదివిన తాము ప్రతిరోజూ రోడ్లు ఊడ్చడానికి వీధులో అడుగు పెడుతున్నప్పుడు మనస్సులో బాధగా ఉంటోందని, చాలా అవమానకరంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఐటి ఢమాల్

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశంలో ఉద్యోగాలపై ప్రభావం చూపాయని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రధాన హామీతోనే మోడి 2014 ఎన్నికల్లో ఘన విజయం సాధించారని, 2019 ఎన్నికల్లో కూడా ఇదే ప్రధాన హామీ కావచ్చునని కూడా ఆయన చెప్పారు.


భారత్‌లో సాంకేతిక రంగంతో పాటు, ప్రైవేటు రంగం అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తోంది. గత దశాబ్దకాలంగా భారతీయ ఇంజనీర్లకు మంచి గుర్తింపు లభించింది. డాలర్లు సంపాదించడంలోనూ వారిదే కీలక పాత్ర. కాని ఇప్పుడు వారు ఎందుకూ పనికిరాని వారిగా మారారు. భారత ఇంజనీర్లు ఉపాధి కోల్పోవడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ తీసుకు వచ్చిన 'బై అమెరికా, హైర్ అమెరికా' ఉత్తర్వులు ఒక కారణమైతే, బ్రిటన్ వీసా ఛార్జీలు పెంచడం మరొక కారణమయ్యింది. దీనికి తోడు 2016 ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం యాంత్రీకరణ (ఆటోమేషన్) 69 శాతం ఉద్యోగాలపై ప్రభావం చూపింది.

దేశంలో 2020 నాటికి ప్రతి ఏడాది లక్షా 75 వేల నుంచి, రెండు లక్షల వరకు టెక్నాలజీ రంగంలో ఉద్యోగాలు కుదింపునకు గురవుతాయని హెడ్ హంటర్స్ ఇండియా అనే సంస్థ అంచనా వేసింది. ఆ రంగంలో సామూహిక లే ఆఫ్‌లు కూడా ఇందుకు కారణమవుతాయని పేర్కొంది.

భారత్‌లో 154 బిలియన్ డాలర్ల సమాచార, సాంకేతిక రంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నాసోచమ్ కూడా ప్రస్తుత పరిస్థితి మందగించిందని తన ఏప్రిల్-జూన్ త్రైమాసిక నివేదికలో పేర్కొంది. అయితే మరో నాలుగేళ్లలో ఆదాయం పెరుగుతుందని, అంతర్జాతీయంగా కార్యకలాపాలు కోలుకుంటాయని వెల్లడించింది.

ప్రస్తుత పరిశ్రమ భారత్ అవసరాలకు తగినంతగా కోలుకోవడం లేదని ముంబయికి చెందిన ఆర్థిక వేత్త థెరిస్సా జాన్ తెలిపారు. ప్రస్తుత కరెంటు ఖాతా లోటు మార్చి 2018 నాటికి జిడిపిలో 1.9 శాతానికి పెరగనున్నదని తెలిపారు. అదేస్థాయిలో రూపాయి బలహీన పడుతోందన్నారు.

ఇన్ఫోసిస్ దేశంలోనే రెండో అతి పెద్ద సాఫ్ట్‌వేర్ ఎగుమతిదారు. 1981లో ఏడుగురు ఇంజనీర్లు దీనిని ప్రారంభించారు. ఇప్పుడది 2 బిలియన్ డాలర్ల నికర లాభంతో నడుస్తున్నది. ఈ ఏడాది 10 బిలియన్ డాలర్లకు పైగానే ఆదాయాన్ని సంపాదించింది. దాదాపు రెండు లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బెంగళూరు కేంద్రంగా ఇది పనిచేస్తోంది. మందగిస్తున్న ఆర్థిక వృద్ధి నుంచి బయటపడేందుకు కంపెనీ ప్రయత్నిస్తున్నది. ఉద్యోగాల్లో కోత పెట్టడం, డాటా ఎనలిటిక్స్ వంటి కొత్త రంగాలలో పెట్టుబడులు పెట్టకపోవడం వంటి చర్యలను తీసుకుంటుంది. అయితే గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాలలో ఇన్ఫోసిస్ ఆదాయం 50 శాతం పెరిగేలా సిక్కా చర్యలు తీసుకున్నారు. అయితే ఇప్పుడు సిక్కా రాజీనామాతో ఇన్ఫోసిస్ సంక్షోభంలో పడింది.




ట్రంప్ ప్రత్యేక సలహాదారు కార్ల్ ఐకాన్ రాజీనామా

స్టీఫెన్ బానన్ తొలగింపు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక సలహాదారు, కోటీశ్వరుడు, ఐకాన్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత అయిన కార్ల్ ఐకాన్ తన పదవికి రాజీనామా చేశారు. అధ్యక్షుని సలహాదారు స్థాయిలో తాను ప్రతిపాదించిన విధానపరమైన సిఫార్సులు తన పెట్టుబడులు లాభాలు సంపాదించడా నికే దోహదపడతాయని విమర్శలు వెల్లువెత్తడంతో ఆయన రాజీనామా చేశారు.ఐకాన్ రాజీనామా చేసిన వెంటనే వైట్‌హౌస్‌లో కొన్ని మార్పులు జరిగాయి. వైట్‌హౌస్‌లో ముఖ్య వ్యూహకర్త స్టీఫెన్ బానన్‌ను ట్రంప్ తొలగించారు.

భారత్‌లో రష్యా రాయబారిగా నికొలవ్ కుదషెవ్



మాస్కో : భారత్‌లో రష్యా నూతన రాయబారిగా నికొలవ్ కుదషెవ్‌ను రష్యా అధ్యక్షుడు పుతిన్ నియమించారని రష్యా ఎంబసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగ్నేయాసియా వ్యవహారాల్లో నిపుణుడైన కుదషెవ్ ప్రస్తుతం విదేశాంగ మంత్రిత్వ శాఖలో సెక్రటేరియట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా వున్నారు. భారత్‌లో ఇంతకుముందు రష్యా రాయబారిగా చేసిన అలెగ్జాండర్ కదకిన్ మృతి తర్వాత దాదాపు ఏడు మాసాలకు ఈ నియామకం జరిగింది. హిందీ బాగా మాట్లాడే కదకిన్ భారత్‌కు మంచి మిత్రుడుగా భావించేవారు. ఈ ఏడాది జనవరి 26న ఆయన మరణించారు.

ఐసిస్‌పై పట్టు బిగించిన సిరియా ఆర్మీ, హిజ్బుల్లా

బీరుట్ : లెబనాన్ సరిహద్దుల్లో సిరియా వైపు గల, ఐసిస్ ఆక్రమించిన భూభాగంపై సిరియా సైన్యం, హెజ్బుల్లా దాడి చేశాయని హిజ్బుల్లా సైన్యానికి చెందిన మీడియా విభాగం తెలిపింది. కాగా లెబనాన్ వైపు నుండి గల భూభాగంపై లెబనాన్ సైన్యం కూడా దాడికి సమాయత్తమవు తోందని, త్వరలోనే దాడి చేపట్టనున్నట్లు లెబనాన్ సైనిక వర్గాలు తెలిపాయి.

రష్యాలో దుండగుడి స్వైర విహారం : 8 మందికి కత్తిపోట్లు

మాస్కో : రష్యాలోని ఉత్తర ప్రాంత నగరమైన సర్గట్ వీధుల్లో కత్తితో దుండగుడు ఒకరు స్వైర విహారం చేయడంతో 8మంది కత్తిపోట్లకు గుర య్యారు. అనంతరం పోలీసులు ఆ దుండ గుడిని కాల్చివేశారని అధికారులు శనివారం తెలి పారు. రోడ్డుపై వెళుతున్న పాదచారులపై ఆ వ్యక్తి దాడిచేయడంతో ఎనిమిది మందికి గాయా లయ్యాయి. వెంటనే రంగంలోకి దిగిన సాయుధ పోలీసులు ఆ వ్యక్తిపై దాడి చేసి హతమార్చారని అధికారులు తెలిపారు. మాస్కోకు 2,100కిలో మీటర్ల దూరంలోని నగరంలో జరిగిన ఈ దాడిలో గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది.

ఆఫ్ఘన్ వ్యూహంపై ట్రంప్ సమీక్ష

మరిన్ని బలగాలను పంపడంపై తేలని నిర్ణయం



హేగర్స్‌టౌన్/వాషింగ్టన్ : ఆఫ్ఘనిస్తాన్‌పై అనుస రించాల్సిన వ్యూహ రచన కోసం అమెరికా అధ్య క్షుడు ట్రంప్ జాతీయ భద్రతా సలహాదారులతో చర్చలు జరుపుతున్నారు. దీనిపై తన ముందుగల పలు అవకాశాలను, మార్గాలను సమీక్షిస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధానికి మరిన్ని బలగాలను పంపాలా లేదా అనే విషయమై ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆఫ్ఘనిస్తాన్ పరిణామాలపై చర్చిం చేందుకు శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. దక్షిణాసియాలో అమెరికా ప్రయోజనాలను కాపాడేందుకు అనుసరించాల్సిన కొత్త వ్యూహంపై ట్రంప్ సమీక్షించారని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి సారా శాండర్స్ విలేకర్లకు తెలిపారు. తన ముందు గల అవకాశాలను, మార్గా లను అధ్యక్షుడు అధ్యయనం చేస్తున్నారని, సరైన సమయం లో అమెరికా ప్రజలకు, మిత్రపక్షాలకు, భాగస్వాములను ద్దేశించి ఒక ప్రకటన చేస్తారని శాండర్స్ తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు మెక్‌మాస్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆఫ్ఘన్‌లో బలగాలను పెంచాలన్న ప్రతిపాదనకు వీరు మద్దతు తెలుపుతున్నారు. జులైలో జరిగిన సమావేశంలో కూడా వీరు ఇదే వైఖరి తీసుకున్నారు. 3నుండి 5వేల మంది వరకు అదనపు బలగా లను పంపించాలని సూచించారు. అయితే ముఖ్య వ్యూహకర్త పదవి నుండి ట్రంప్ తనను తొలగించడానికి ముందుగా స్టీవ్ బానన్ దీనిపై స్పందిస్తూ అమెరికా బలగాలను ఆఫ్ఘన్ నుండి ఉపసంహరిం చాల్సిందేనన్నారు. ప్రస్తుతం ఆఫ్ఘన్‌లో వున్న 8400మంది అమెరికా బలగాలను యథా తథంగా వుంచడమా, లేక కొద్దిగా పెంచడ మా లేక కొద్దిగా కుదించడమా అనే అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. డ్రోణ్ దాడులను ముమ్మరం చేసిన నేపథ్యంలో తీవ్రవాదంపై సాగుతున్న పోరును కూడా వారు సమీక్షించారు. ఇప్పటికి 15ఏళ్ల నుండి ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా పోరు కొనసాగుతునే వుంది. బలగాలను పెంచినప్పటికీ ఆఫ్ఘనిస్తాన్‌లో పరిస్థితి వచ్చే ఏడాదికి ఇంకా క్షీణిస్తుందని గత మే నెల్లో అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేశాయి. కేంప్ డేవిడ్ రిసార్ట్‌లో జరిగిన ఈ సమావేశంలో పాకిస్తాన్‌పై జరిగిన చర్చలో విభేదాలు పొడసూపాయి. ఆఫ్ఘన్ తాలిబన్ స్థావరాలను మూసివేయడంలో, ఆఫ్ఘన్ తీవ్రవాదులను అరెస్టు చేయడంలో విఫలమైనందుకు పాకిస్తాన్‌పై కఠిన వైఖరి అవలంబించే విషయమై అభిప్రాయభేదాలు తలెత్తాయి.

శ్రీలంక నేవీ చీఫ్‌గా తమిళ జాతీయుడు



కొలంబో : శ్రీలంక నావికా బలగాల అధినేతగా రియర్ అడ్మిరల్ ట్రావిస్ సిన్నయ్య శనివారం నియమితుల య్యారు. దేశ నావికాదళానికి నాయకత్వం వహిస్తున్న మొదటి మైనారిటీ తమిళ జాతీయుడైన సిన్నయ్య దేశ అంతర్యుద్ధం సమయంలో సముద్ర జలాల్లోనే ఎల్‌టిటిఇ యుద్ధ నౌకలను ధ్వంసం చేయడంలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. అనేక దశాబ్దాల పాటు శ్రీలంక నావికాదళానికి విశేష సేవలందించిన సిన్నయ్య నేవీ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించారని అధ్యక్షుడు సిరిసేన ట్వీట్ చేశారు. ఈ నెల 22 నుండి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. 1960వ దశకంలో మొదటిసారిగా తమిళుడైన రాజన్ కదిరిగమర్ శ్రీలంక నావికాదళానికి నాయకత్వం వహించగా ఇప్పుడు రెండవసారి సిన్నయ్య బాధ్యతలు చేపట్టనున్నారు.

అమెరికాలో పోలీసు అధికారులపై కాల్పులు

ఒకరు మృతి


వాషింగ్టన్ : అమెరికాలోని ఫ్లోరిడా, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లో శుక్రవారం రాత్రి ఆరుగురు పోలీసు అధికారులపై కాల్పులు జరగగా, ఒకరు మరణించారు. సెంట్రల్ ఫ్లోరిడాలోని కిస్సిమీ నగరంలో జరిగిన కాల్పుల్లో పోలీసు అధికారి మాథ్యూ బాక్సర్ చనిపోయారు. సార్జెంట్ శామ్ హోవార్డ్ పరిస్థితి విషమంగా వుందని శనివారం పోలీసు చీఫ్ జెఫ్ డెల్ తెలిపారు. మాదకద్రవ్యాల కార్యకలాపాలకు పేరు మోసిన ఈ ప్రాంతంలో శుక్రవారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో పోలీసు అధికారులు అనుమానితులను సోదా చేస్తుండగా ఒక్కసారిగా కాల్పులు జరిగాయి. పోలీసు అధికారులందరూ తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడి వున్నారని డెల్ చెప్పారు. ఈ సంఘటన జరిగిన వెంటనే అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ ట్వీట్ చేశారు. ఉత్తర ఫ్లోరిడా నగరమైన జాక్సన్‌విల్లెలో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ కాల్ రాగా వెళ్ళిన వారిపై అనుమానితుడు ఒకరు కాల్పులు జరిపారని డైరెక్టర్ మైక్ బ్రూనో తెలిపారు. పరస్పరం జరిగిన కాల్పుల్లో ఇద్దరు అధికారులు గాయపడ్డారు. కాగా అనుమానితుడిని కాల్చి చంపారు. శుక్రవారం రాత్రి జరిగిన మరో ఘటనలో పెన్సిల్వేనియాకు చెందిన ఇద్దరు పోలీసులపై కాల్పులు జరిగినట్లు రాష్ట్ర పోలీసు ప్రతినిధి మెలిండా తెలిపారు.

యెమెన్ పరిస్థితిపై ఐరాస ఆందోళన

ఐక్యరాజ్య సమితి : యెమెన్‌లో హింసాకాండ పెచ్చరిల్లుతోందని, పరిస్థితి క్షీణిస్తోందని ఐక్యరాజ్య సమితి అధికారులు శుక్రవారం హెచ్చరించారు. హుతీ రెబెల్స్ అధీనంలో గల ఉత్తర ప్రాంతంలో ఐరాస మానవతా సాయం అందించడానికి వెసులుబాటు కల్పించాల్సిన అవసరం వుందని ఐరాస మానవతాసాయం వ్యవహారాలు చూసే అధికారి స్టీఫెన్ ఓ బ్రియాన్ పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులు తీసుకెళ్లే నౌకలకు ప్రవేశం నిరాకరిస్తున్న యెమెన్ ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. దాదాపు 80శాతం ఆహారపు దిగుమతులు చేరుకునే హుడెడా ఓడరేవుపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవడానికి ఐక్యరాజ్య సమితి కృషి చేస్తోందని చెప్పారు.

ఎన్‌హెచ్‌ఎస్‌లో సంక్షోభానికి బ్రిటనే కారణం

భౌతిక శాస్త్రవేత్త హాకింగ్ విమర్శ



లండన్ : బ్రిటీష్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్)లో సంక్షోభానికి ప్రభుత్వమే కారణమని భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ విమర్శించారు. అమెరికా ఆరోగ్య వ్యవస్థ తరహాలో లాభాలు ఆర్జించే సంస్థగా మారకుండా ఎన్‌హెచ్‌ఎస్‌ను కాపాడాల్సి వుందని అన్నారు. బ్రిటన్ ఆరోగ్య మంత్రి తన విధానాలను సమర్థించుకోవడానికి ప్రయత్నించ డాన్ని విమర్శించారు. 1948లో స్థాపించబడిన ఎన్‌హెచ్‌ఎస్ బ్రిటన్ జాతీయులకు గర్వకారణంగా వుండేది. అందరికీ ఉచిత సంరక్షణ అందేది. ఇటీవలి కాలంలో బడ్జెట్ కుదించబడడం, వృద్ధుల సంఖ్య పెరగడం, వైద్య ఖర్చులు పెరగడం, సంక్లిష్టమైన చికిత్సలు వంటి కారణాలతో ఎన్‌హెచ్‌ఎస్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. మన సమాజానికి కీలకమైన మైలురాయి ఎన్‌హెచ్‌ఎస్ అని హాకింగ్ వ్యాఖ్యానించారు. బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు, పెరుగుతున్న ప్రైవేటీకరణను వ్యతిరేకించే ప్రజలకు మధ్య ఘర్షణ చోటు చేసుకుందని అన్నారు. కానీ అమె రికాలో పరిస్థితి ఇలా లేదని అన్నారు. అక్కడ ఇటువంటి కార్పొరేషన్లు పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తున్నా యన్నారు. బ్రిటన్‌లోని రోగుల కన్నా అమెరికాలోని రోగులు ఎక్కువ వ్యయాన్ని భరిస్తున్నారని అన్నారు.

స్పెయిన్‌పై ఐసిస్ దాడి



బార్సిలోనా : స్పెయిన్ నగరం బార్సిలోనాలో గురు వారం జరిగిన తీవ్రవాద దాడితో యావత్ ప్రపంచం నివ్వెరపోయింది. ఇటీవల కాలంలో తీవ్రవాద దాడులకు యూరప్ దేశాలు లక్ష్యమవుతున్నప్పటికీ తాజా దాడిలో స్పెయిన్ లక్ష్యం కావడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఈ దాడికి తమదే బాధ్యత అని ఐసిస్ ప్రకటించింది. ఇరాక్, సిరియాల్లో తమ కార్యకలాపాలకు అడ్డం వస్తున్న దేశాలపై, ప్రత్యక్షంగా అక్కడి పోరులో భాగస్వాములవుతున్న దేశాలపై ప్రతీ కార చర్య పేరుతో ఐసిస్ తీవ్రవాద దాడులకు పాల్ప డుతోంది. ఐసిస్‌పై జరిగే పోరులో స్పెయిన్ పాత్ర చాలా పరిమితమైనది. ఐసిస్ వ్యతిరేక కూటమిలో, సైనిక చర్యల్లో చేతులు కలిపేందుకు కూడా స్పెయిన్ విము ఖత చూపింది. ముప్పు తక్కువగా వుండే పాత్ర పోషిం చడానికే మొగ్గు చూపింది. స్థానిక ఇరాకీ బలగాలకు అవసం మైన శిక్షణ ఇవ్వడం, విదేశాల్లోని ఐసిస్‌కు మద్దతునిచ్చేం దుకు దేశీయంగా జరిగే ప్రయత్నాలను నివారించడం వంటి చర్యలు తీసుకుంది. ఫ్రాన్స్, అమెరికాతో పోలిస్తే ఐసిస్‌పై పోరులో స్పెయిన్‌ది చాలా పరిమితమైన పాత్ర. అయినా ఐసిస్ దాడుల జాబితాలో స్పెయిన్ చోటు చేసుకుంది.

మొదటి పేజీ తరువాయి

గోరఖ్‌పూర్‌లో రాహుల్ పర్యటన

మార్చలేక పోయారని వ్యాఖ్యానించారు. కాగా ఆక్సిజన్ కొరతతో పిల్లలు మృతి చెందారని వచ్చిన ఆరోపణలను బిజెపి ప్రభుత్వం తోసిపుచ్చింది. వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌ను, సంఘటన జరిగిన వార్డు ఇన్‌ఛార్జ్ డాక్టర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపింది. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించింది.

వేడెక్కిన నంద్యాల

తన వద్దకు తీసుకురాలేదన్నారు. విశాఖ, తిరుపతి తరహాలో నంద్యాలను అభివృద్ధి చేస్తామని, తమకు అండగా నిలవాలని కోరారు. రోడ్‌షోలో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, మంత్రులు ఆదినారాయణరెడ్డి, అఖిలప్రియ, ఎంపి టిజి.వెంకటేష్, ఎమ్మెల్సీ ఎన్‌ఎండి.ఫరూక్, హాస్యనటుడు వేణుమాధవ్ పాల్గొన్నారు.

కాలర్ పట్టుకుని నిలదీయాలి : జగన్

ఏ నాయకుడైనా ఇచ్చిన మాట తప్పితే కాలర్ పట్టుకొని అడిగే పరిస్థితి రావాలని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి అన్నారు. నంద్యాలలో జగన్‌రోడ్‌షో శనివారానికి 11వ రోజుకు చేరింది. ఈ రోడ్‌షో సంజీవనగర్ రామాలయం నుంచి నీలివీధి రేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు కొనసాగింది.నంద్యాలలో పేదలందరికీ ఉచితంగా పక్కాగృహాలు నిర్మించి ఇస్తామన్నారు. నంద్యాలను పులివెందులలాగా గొప్పగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి భయాలు వద్దని నా బాధ్యత అని జగన్ హామీ ఇచ్చారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టిన బాబు ఆ డబ్బుతో ఎమ్మెల్యేలను కొన్నారని, ఇప్పుడు నంద్యాల ఓటర్లను కూడా కొనాలనుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు పనితీరు మోసాలు, అవినీతి, దుర్మార్గాలను ప్రజలు చూస్తున్నారన్నారు. పేదలకు మూడుసెంట్ల స్థలమిచ్చి ఇల్లు కట్టిస్తానన్న బాబు ఇప్పటివరకు ఒక ఇల్లైనా కట్టించారా అని ప్రశ్నించారు. పేదలకు భూములు పంచుతానని పేదల భూమిని లాక్కుంటున్నారన్నారు. ఒక్కసారి వైఎస్‌ఆర్ పాలన గుర్తుకు తెచ్చుకొండి.. పేదలందరూ చదువుకోవాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ పెట్టారని, అదే బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్తులను అమ్మి పిల్లలను చదివించుకుంటున్నారని విమర్శించారు.

ఎన్నికలు రద్దు చేయాలి : ఎన్.రఘువీరారెడ్డి

నంద్యాల ఉపఎన్నికను రద్దు చేయాలని పిసిసి అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి అన్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. నంద్యాల ఉపఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతూ, ఓటర్లను కొనుగోలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. శనివారం నంద్యాలలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడం లేదన్నారు. రోజూ వందలాది వాహనాలతో టిడిపి, వైసిపి నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని చెప్పారు. మరోవైపు బహిరంగ సభల్లో టిడిపి, వైసిపి నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు.

సిఎం పర్యటనలో తుడా ఛైర్మన్‌కు అవమానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పద్మావతి గెస్ట్‌హౌస్‌లో సిఎం చంద్రబాబునాయుడు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తుండగా శనివారం ఉదయం తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, ఆయన అనుచరులు కలవడానికి ప్రయత్నించారు. అయితే భద్రతా సిబ్బంది వీరిని అడ్డుకున్నారు. ఛైర్మన్‌ను మాత్రమే లోనికి అనుమతిస్తామని, అనుచరులను లోనికి పంపమని చెప్పడంతో తుడా ఛైర్మన్ అందుకు అంగీకరించలేదు. దీంతో ఛైర్మన్ నర్సింహయాదవ్ అక్కడే కొద్దిసేపు ధర్నా చేశారు. గెస్ట్‌హౌస్‌లో వున్న ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధ్యక్షులు పి.నాని జోక్యం చేసుకుని నర్సింహయాదవ్‌ను బుజ్జగించారు.

వైసిపి నేత ఇంట్లో రూ.40 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - కర్నూలుప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకులు డబ్బులు పంచుతున్నారనే నేపథ్యంలో పోలీసులు సోదాలను ముమ్మరం చేశారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో పక్కా సమాచారంతో వైసిపి నేత దస్తగిరిరెడ్డి ఇంటిపై శనివారం దాడి చేసి రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి అనుచరులైన అమృతరాజ్, నాగిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, భువనేశ్వరరెడ్డి, లక్ష్మినారాయణ తదితరుల ఇళ్లపైనా శుక్రవారం అర్ధరాత్రి దాడులు చేశారు. ఇప్పటిదాకా నంద్యాల ఉప ఎన్నికల్లో మొత్తం రూ.68 లక్షల నగదు, 1400 గ్రాముల బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మృత్యు శకటం!

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో రాత్రి 11 గంటల సమయానికి 23 మంది మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. 72 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సహాయ చర్యలు ఇంకా కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య, గాయపడిన వారి సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ ఘోర రైలు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

స్పందించిన ఖతౌలి ప్రజలు

కళ్ల ముందే ఘోర ప్రమాదం జరగడంతో తీవ్ర షాక్‌కు గురైన ఖతౌలి ప్రజలు ఆ వెంటనే పెద్ద ఎత్తున స్పందించారు. దాదాపుగా స్థానికులు అందరూ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొందరు ప్రయాణికులను రైలు పెట్టెల నుండి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. స్థానికులు చూపిన ఈ చొరవ పలువురిని మృత్యు ముఖం నుండి కాపాడింది. ఆ తరువాత ప్రమాద సమాచారం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని, సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ముజఫర్‌నగర్ జిల్లా అధికారులతో పాటు ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. 30కి పైగా అంబులెన్సులు సహాయక కార్యక్రమాల్లో



సహాయక చర్యల్లో నిమగ్నమైన స్థానికులు

ఉన్నాయి. రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు ఈ ప్రమాదంపై వెంటనే స్పందించి, విచారణకు ఆదేశించారు. జిల్లా అధికారులు, రైల్వే అధికారులు సమన్వయంతో సహాయక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రమాద స్థలికి రైల్వే శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా వెళుతున్నారని తెలిపారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రైల్వే బోర్డు ఛైర్మన్‌కు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతగానో కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అలాగే ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్, ఒడిషా ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, నవీన్ పట్నాయక్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షత గాత్రుల చికిత్స అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆదిత్యనాథ్ తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు ఎక్స్‌గ్రేషియాను నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీవ్రంగా స్పందించారు. 'రైలు ప్రమాదం చాలా విచారకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలి. వారికి సహాయం అందించాలి' అని ట్విట్టర్‌లో రాష్ట్రపతి పేర్కొన్నారు.

భయానకంగా ప్రమాద స్థలం

ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ముజఫర్ నగర్ ఖతౌలి ప్రాంతం భయానకంగా మారింది. పెద్ద శబ్దంతో పట్టాలు తప్పిన 14 బోగీల్లో కొన్ని ఒకదానిపైకి మరొకటి దూసుకుపోయాయి. ఈ బోగీలలో ఇరుక్కు పోయిన వారిని బయటకు తీయడం సహాయక దళాలకు సవాల్‌గా మారింది. రైల్వే లైనుకు రెండు వైపులా ఇళ్లు ఉండటంతో ఒకటి, రెండు బోగీలు ఇళ్ల మీదకు కూడా దూసుకుపోయాయి. దీంతో ఆ ఇళ్లలో ఉన్న వారు సైతం మృత్యువాత పడ్డారు. బోగీలను కోసి వాటిలో చిక్కుకుపోయిన వారిని బయటకు తీయడానికి రక్షణ దళాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు ఒడిషాలోని పూరీ నుంచి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు ప్రయాణిస్తోంది. పూరీలో శుక్రవారం రాత్రి 9:00 గంటలకు బయలుదేరి రైలు శనివారం రాత్రి 9:00 గంటలకు హరిద్వార్ చేరుకోవాల్సివుంది.

రీషెడ్యూల్‌కు రాం..రాం..

మొదటి పేజీ తరువాయి

రీషెడ్యూల్ ప్రక్రియ కొనసాగించగా, గ్రామీణ, సహకార, ప్రైవేటు బ్యాంకులు అసలుకే స్పందించలేదు. చంద్రబాబు సర్కారు అరకొర రుణ మాఫీతో బ్యాంకులు రైతు రుణాల రీషెడ్యూల్ ప్రక్రియకు ఎగనామం పెట్టాయి. రుణమాఫీపై బ్యాంకులు ఎక్కడ అడుగుతాయోనని ఏపీ ప్రభుత్వం రీషెడ్యూల్, తాజా రుణాల పంపిణీపై నోరెత్తట్లేదు. ఇటు సర్కారు అటు బ్యాంకులు అవలంబిస్తున్న వైఖరితో రీషెడ్యూల్ ప్రక్రియ నిలిచిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అన్నదాతకు ఊరట

కరువులు, తుపాన్లు, వరదలు వంటి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు విపత్తు ప్రాంతాలను అధికారికంగా ప్రకటించి ఆ వివరాలను రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ), జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు)లకుకు పంపుతాయి. వాటి అనుమతితో విపత్తు ప్రాంతాల్లో ఆ వ్యవసాయ సీజనులో రైతులకు ఇచ్చిన పంట రుణాలను బ్యాంకులు రీషెడ్యూల్ చేస్తాయి. రీషెడ్యూల్ ఉద్దేశం రుణాల చెల్లింపును వాయిదా వేసి రైతులు కొత్తగా పంటలేసుకు నేందుకు తాజా రుణాలివ్వడం. అప్పులు వాయిదా వేసి కొత్తగా రుణాలిస్తే రైతులకు పంటలేసు కోడానికి పెట్టుబడులు సమకూరతాయి. సాధారణంగా ఆర్‌బిఐ రైతు రుణాల చెల్లింపులను నాలుగేళ్లు వాయిదా వేస్తుంది. స్వల్పకాలిక అప్పులు దీర్ఘకాలిక అప్పులుగా మారతాయి. మొదటి సంవత్సరం మారటోరియం విధిస్తారు. ఆ ఏడాది రైతులు అసలు పాత రుణం చెల్లించాల్సిన అవసరం లేదు. అక్కడి నుంచి మూడేళ్లలో సమాన వాయిదాల్లో వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించాలి. రీషెడ్యూల్ అనంతరం రైతులకు కొత్త రుణాలివ్వాలి. విపత్తు తీవ్రత అధికంగా ఉంటే రీషెడ్యూల్ పరిమితి ఐదేళ్లుంటుంది. అందులో రెండేళ్ల మారటోరియం అమలవుతుంది.

మూడేళ్ల నుంచీ అంతే...

రాష్ట్రంలో మూడేళ్ల నుంచీ కొన్ని జిల్లాల్లో కరువులు, వరదలు వచ్చినా, ప్రభుత్వం విపత్తు మండలాలను ప్రకటిస్తున్నా, కేంద్ర బృందాలు పర్యటిస్తున్నా రైతుల రుణాలు రీషెడ్యూల్ కావట్లేదు. రుణ మాఫీ గందరగోళంతో 2014-15, 2015-16లో రూపాయి కూడా రీషెడ్యూల్ కాలేదు. కొత్త అప్పులివ్వలేదు. 2016-17లో సర్కారు గుర్తించిన 301 కరువు మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. వడ్డీ రాయితీ పథకాలున్నప్పుడు రీషెడ్యూల్‌తో పనేంటని ప్రభుత్వం, బ్యాంకులు రైతులను దగా చేస్తున్నాయి.

రుణాల రీషెడ్యూల్ (రూ.కోట్లలో)

బ్యాంకులు	రీషెడ్యూల్ చేయాల్సింది	రీషెడ్యూల్ చేసింది	ఇచ్చిన కొత్త రుణాలు
ప్రభుత్వరంగ బ్యాంకులు	3,359	396	10.09
గ్రామీణ బ్యాంకులు	3,251	0.62	0.26
సహకార బ్యాంకులు	351	000	000
ప్రైవేటు రంగ బ్యాంకులు	000	000	000
మొత్తం	6,961	396.62	10.35

పోలవరం వ్యయాన్ని కేంద్రమే భరించాలి

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌కు అఖిలపక్షం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికయ్యే పూర్తి వ్యయాన్ని కేంద్రమే భరించాలని అఖిలపక్షం నేతలు కోరారు. కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి కన్వీనర్ కొలనుకొండ శివాజి ఆధ్వర్యంలో ఎపి రైతు సంఘం (సిపిఎం) అధ్యక్షులు వై కేశవరావు, మల్లాది విష్ణు(వైసిపి), ఎన్ నరసింహారావు(కాంగ్రెస్), రైతు సంఘం (సిపిఐ) నాయకులు యలమందరావు, అల్లం రాజేశ్(యువ రైతు సంఘం) తదితరులు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (జల వనరులు) ఛైర్మన్ హుకుంసింగ్‌ను విజయవాడలో శనివారం కలిసి పోలవరం ప్రాజెక్టు సహా పలు అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత వ్యవధిలో పూర్తయ్యేలా కేంద్రం యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ చేపట్టాలన్నారు. అమరావతి రాజధాని నగరంలో మురుగు నీరు కృష్ణా నదిలో కలవకుండా శుద్ధి చేసే ప్లాంట్లు, నదీ ఘాట్లు నిర్మించేలా కేంద్ర ప్రభుత్వానికి స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేయాలని కోరారు. పెరిగిన అంచనాల ప్రకారం పోలవరం నిర్మాణానికయ్యే పూర్తి వ్యయాన్ని భరించబోమని, కేవలం 2010-11 అంచనాల ప్రకారం రూ.16 వేల కోట్లను భరిస్తామని, ఐదేళ్ల కాల వ్యవధిలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయలేని పక్షంలో ఈ మొత్తాన్ని అప్పుగా పరిగణిస్తామని కేంద్రం షరతులు విధించడాన్ని అఖిలపక్షం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్ర విభజన నాటికి కాగ్ అంచనాల ప్రకారం రూ.16 వేల కోట్ల ఆర్థిక లోటును భర్తీ చేయలేదన్నారు. సాగు, తాగు నీటి విషయంలో తీవ్ర సంక్షోభం నెలకొందని ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆగస్టు నెలాఖరుకు కూడా శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్ల లోకి 25శాతం కూడా నీరు చేరలేదని వారు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసుకుని, గోదావరి నదీ జలాలను వినియోగించుకో వడం తప్ప రాష్ట్రానికి వేరే గత్యంతరం లేదని వివరించారు. విభజన చట్టం ప్రకారం ఎపికి దక్కాల్సిన ప్రయోజనాలకు గండి కొడుతూ కేంద్రం అనుసరిస్తున్న ధోరణి పట్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. గంగా నది ప్రక్షాళణకు రూ. 20 వేల కోట్లు మంజూరు చేసిన కేంద్రం, విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాజెక్టయిన పోలవరానికి తగిన విధంగా నిధులు మంజూరు చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

సినిమా

ఈ అబ్బాయివి అన్నీ మంచి లక్షణాలే


నాని

కథానాయుడు నాని, నిర్మాత దిల్‌రాజు కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఎంసీఏ' (మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి) చిత్రం షూటింగ్ యాభై శాతం పూర్తయింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోన్న సినిమా ఇది. 'ఫిదా' ఫేమ్ సాయి పల్లవి నాయికగా నటిస్తోంది. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు.

దిల్‌రాజు మాట్లాడుతూ 'మా బ్యానర్‌లో నాని హీరోగా ఈ ఏడాది 'నేను లోకల్' సినిమా విడుదలై విజయాన్ని సాధించింది. ఇప్పుడు మా హిట్ కాంబినేషన్ మరోసారి ఈ చిత్రం రాబోతుంది. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందనున్న ఈ ఈ సినిమా మా బ్యానర్‌లో మరో హిట్ చిత్రంగా నిలుస్తుంది. చక్కటి కథ, అన్నీ సమపాళ్ళలో ఉన్న అంశాలతో నానిని దర్శకుడు సరికొత్త స్టయిల్లో చూపించనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి కూడా మ్యూజిక్ అందిస్తున్నాడు. హీరోయిన్ భూమిక ఇందులో కీలక పాత్రలో నటిస్తుంది. తప్పకుండా సినిమా అందరినీ ఆకట్టుకోవడమే కాదు, ప్రేక్షకుల్లో మా బ్యానర్ వాల్యూను పెంచే చిత్రమవుతుంది భావిస్తున్నాను. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను మొదలుపెట్టాం. డబ్బింగ్ పనులతో ఈ కార్యక్రమాలకు నాంది పలికాం. సినిమాను డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.

వెంకటేష్ ట్యూన్స్‌ను రానాకు వాడేశాం


- సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్



"నాకు ఇష్టమైంది సంగీతమే. స్టార్స్‌తో పనిచేయాలని అందరికీ ఉన్నట్లే నాకూ ఉంది. ఒక్కో స్టార్ దగ్గర ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. వారి దగ్గర నుంచి చాలా నేర్చుకుంటా. అలా రానా దగ్గరా నేర్చుకున్నాను. గొప్పింటి కుర్రాడయినా సామాన్యుడిలా ప్రవర్తించే విధానం నన్నెంతో ఆకట్టుకుంటుంది. హీరో అనే ఇగో లేదు. ఎవరితోనైనా ఇట్టే కలిసిపోతారు. అలాగే బాలకృష్ణ కూడా. తనతో పనిచేసేటప్పుడు భయపడేవాడిని. ఆయనతో ఒకసారి కలిసి మాట్లాడితే అవన్నీ పటాపంచలైనాయి" అని సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అన్నారు. ఇతను తాజాగా సంగీతం సమకూర్చిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. తేజ దర్శకుడు. సురేష్ ప్రొడక్షన్‌లో రూపొందింది. ఈ సందర్భంగా శనివారం అనూప్ పలు విషయాలను వెల్లడించారు.

- తేజతో చాలాకాలం జర్నీ చేశాను. తనకి నాకూ రాజకీయ నేపథ్యం సినిమా కొత్తగా అనిపించింది. మొదట ఓ పాటకు ట్యూన్ చేశాను. అది డ్యూయెట్టా? మరో పాటా? అనేది ఆలోచించాం. కానీ కథకు సరిపడ లేదని చేయలేదు. ముఖ్యంగా ఇలాంటి కథకు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కీలకం. దాన్ని బాగా చేశానని ఇండస్ట్రీ నుంచి కాంప్లిమెంట్లు వచ్చాయి. ఇష్క్, గుండెజారి గల్లంతయిందే, మనం, గోపాల గోపాల తర్వాత బాగా పేరొచ్చింది ఈ సినిమా బ్యాక్‌గ్రౌండ్ సంగీతానికే.
- రష్ చూసినప్పటి నుంచీ బ్యాక్‌గ్రౌండ్ బేస్డ్ సినిమా అనిపించింది. దాన్ని ఎలా హైలైట్ చేయాలనేది కేర్ తీసుకున్నాం. పాత తరహాలో ఉండకూదు. గ్రామీణ వాతావరణానికి దగ్గరగా ఉండాలి. హీరోకు రకరకాల షేడ్స్ ఉంటాయి. వడ్డీ వ్యాపారిగా, భయస్తునిగా ఉంటాడు. ఆ నేచురల్ ఫీలింగ్‌ను మ్యూజిక్ ద్వారా ఎలా హైలైట్ చేయాలి? కథకు ఎక్కడ సైలెంట్ కావాలి? ఎఫెక్ట్, డైలాగ్‌కు అనుగుణంగా ఇవ్వాలనే దృష్టిలో పెట్టుకుని చేసిన సినిమా ఇది. ఇందులో పాట కూడా కథగా రన్ అవుతుంది.
- సహజంగా కొన్ని చిత్రాల్లో పాటలు విదేశాల్లో తీస్తారు. అవి కథకు సెట్‌కావు. కానీ కథానుగుణంగా ఉండే సినిమా ఇదే. ఇలాంటివే నాకు ఇష్టం. దీనికోసం పెద్ద పెద్ద పరికరాలు ఉపయోగించలేదు. ఆర్కెస్ట్రానే వాడాను. కోరస్ యూజ్ చేశాం.
- రానా నుంచి చాలా నేర్చుకున్నా. పెద్ద ఫ్యామిలీలో పుట్టినా, స్టార్ అయినా.. సామాన్యుడిలా ఆలోచిస్తారు. హీరో అనే బెట్టులేదు. ఓ సీన్‌లో ఆయన ఏడవాలి. కానీ ఆయన పక్కన ఉన్న వారు ... మీరు ఏడిస్తే బాగుంటుందా? అని అడిగేవారు. కానీ ఆయన వారికి సరైన సమాధానం చెప్పేవాడు. ఫ్యామిలీలో భార్య చనిపోతే ఎందుకు ఏడవరు? అని ఎదురు ప్రశ్నించాడు.
- ఇక తేజతో చాలా సినిమాలు చేశాను. ఆయన స్టయిల్ నాకు తెలుసు. ఆరేళ్ళ క్రితం 'సావిత్రి' అనే సినిమా వెంకటేష్‌తో అనుకున్నాం .సాధ్యపడలేదు. అప్పుడు సాంగ్స్ కంపోజ్ చేశాం. 'సావిత్రి..సావిత్రి..' అనే ట్యూన్‌ను.. జోగేంద్ర...జోగేంద్రకు వాడేశాం. అలాగే మరో ట్యూన్ కూడా.
- కథ చెప్పినప్పుడే ఇచ్చిన ట్యూన్ ఓకే అయిన సందర్భాలున్నాయి. కొన్నిసార్లు ఐదారుసార్లు ఇవ్వాల్సి వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. ఒక్కోసారి సీన్ సందర్భానుసారం కుదరక కొన్నిరోజులు పట్టేవి. కెరీర్ మొదట్లో సంగీతపరంగా ఇబ్బంది పెట్టిన దర్శకులున్నారు. ఇప్పుడు అటువంటి లేదు. ఎందుకంటే మొదట్లో నిర్ణయం తీసుకోలేను కాబట్టి.
- ఇప్పుడు ప్రతి ఒక్కరూ అప్‌డేట్ అయినట్లే.. నేనూ వరల్డ్ మ్యూజిక్ వింటాను. సాఫ్ట్‌వేర్స్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అవుతున్నాయి. వాటిని ఫాలో అవుతుంటాను. నా కిష్టమైన పరికరం కీబోర్డు, గిటార్.
- ఇప్పుడు కొత్త గాయకులు వస్తున్నారు. వారికి రకరకాల అవకాశాలున్నాయి. వెబ్‌ఛానల్స్, టీవీ సీరియల్స్ ద్వారా వెలుగులోకి వస్తున్నారు. ఒకప్పుడు సింగర్ అంటే తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించేవారు కాదు. రానురాను మారారు. నాకు రోజూ కొత్త సింగర్ తమ వాయిస్ పంపిస్తూనే ఉంటారు. వాయిస్ బాగున్న వారిని ప్రోత్సహిస్తూనే ఉంటాను. ప్రతి దర్శకుడికీ ఒక టీమ్ ఉంటుంది. అయినా కొత్తవారిని ఎంకరేజ్ చేస్తుంటాను.
- ప్రస్తుతం బాలకృష్ణతో 'పైసా వసూల్'కు సంగీతం అందించాను. అందులో తొలిసారిగా బాలయ్య వాయిస్ వింటారు. ఆయనతో పాడించాలనేది నేను, పూరీ తీసుకున్న నిర్ణయం. 43 ఏళ్ళ కెరీర్‌లో చాలామంది ప్రయత్నించారు కానీ మీ సినిమాకు సెట్ అయిందని బాలకృష్ణ అన్నారు. బాలకృష్ణతో సినిమా చేయాలంటే భయమేసింది. ఆయన గురించి చాలా రకరాలుగా విన్నాను. కానీ ఆయన్ను కలిశాక ఆయనపై గౌరవం పెరిగింది.
- అలాగే విక్రమ్ కుమార్ దర్శకత్వంలో అఖిల్ నటిస్తున్న సినిమాకూ సంగీతం అందించాను. అందులోనూ అఖిల్ పాడాడు. తనకు సంగీతం గురించి తెలుసు. 'సైమా'లో పాడాడు. అది ఈ సినిమాలోనూ ఉంటుంది. ఈ వారంలో ఆ పాటను విడుదల చేస్తాం.

హైదరాబాద్‌కు వచ్చేస్తున్నారు


మహేష్ బాబు

మహేష్ బాబు, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో 'భరత్ అనే నేను' చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. కైరా అద్వానీ ఇందులో కథానాయికగా చేస్తోంది. ఈ సినిమాలో మేజర్ షెడ్యూల్‌లో భాగంగా ముఖ్యమైన పోరాట సన్నివేశాలు చిత్రీకరించడానికి చిత్రబృందం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు వెళ్లింది. అక్కడ చారిత్రాత్మక ప్రదేశాలైన మూసబాగ్, జహంగిరిబాద్ వంటి చోట కీలక ఘట్టాలు షూట్ చేయదలిచారు. కానీ ఆ ప్రాంతాల్లో చిత్రీకరణకు పురావస్తు శాఖ అనుమతిని నిరాఖరించిందని సమాచారం. అక్కడ షూటింగ్ నిషేధించినట్టు చిత్రబృందానికి స్పష్టం చేసినట్టు తెలిసింది. చారిత్రక కట్టడాలకు నష్టం వాటిల్లితుందని షూటింగ్‌కు నిరాకరించినట్టు బోగట్టా. అందువల్ల ఈ యూనిట్ మళ్లీ హైదరాబాద్ రాబోతుంది. ఈనెల 22 నుంచి ఇక్కడే ఆ యాక్షన్ సీన్స్ చిత్రీకరించనున్నారట. ఈ చిత్రాన్ని డి.వి.వి దానయ్య నిర్మిస్తున్నారు. ఇందులో మహేష్ బాబు రాజకీయ నాయకుడి పాత్రను పోషిస్తున్నాడు. దేవీశ్రీ ప్రసాద్ బాణీలు సమకూరుస్తున్నాడు.

'సరసుడు' సిద్ధం

శింబు, నయన తార, ఆండ్రియా, ఆదా శర్మ కాంబినేషన్‌లో తమిళంలో రూపొందిన చిత్రం 'ఇదు నమ్మ ఆళ్'. ఈ సినిమాను తెలుగులో 'సరసుడు'గా విడుదల కానుంది. శింబు సినీ ఆర్ట్స్ అండ్ జేసన్ రాజ్ ఫిలింస్ బేనర్స్‌పై పాండిరాజ్ దర్శకత్వంలో టి.రాజేందర్ నిర్మించారు. ఈ బేనర్‌లో 'కుర్రాడొచ్చాడు' తర్వాత తెలుగులో రిలీజవుతున్న చిత్రమిది. శింబు, నయనతార ప్రేమ బ్రేకప్ అయ్యాక కథ బాగా నచ్చి చేసిన చిత్రమిది. వాళ్లిద్దరి మధ్య వచ్చే రొమాంటిక్ సీన్స్ అన్నీ చాలా రియలిస్టిక్‌గా ఉంటాయని, యూత్‌కి బాగా కనెక్ట్ అయ్యే విధంగా ఈ చిత్రం ఉంటుందని దర్శకుడు తెలిపారు. శింబు సోదరుడు టి.ఆర్. కురళరసన్ అందించిన ఈ చిత్రం ఆడియో సూపర్‌హిట్ అయిందనీ, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం తెలుగులో సెప్టెంబర్ 8న విడుదల కాబోతోందనీ ఆయన చెప్పారు.


'సరసుడు'లో నయన తార, శింబు

మనుగడ కోసం ఓ నాయకుని పోరాటం


మంచు మనోజ్, లక్ష్మి, అజయ్ ఆండ్రూస్, ఎస్.ఎన్. రెడ్డి, లక్ష్మీకాంత్

"మన ఇంట్లోకి వచ్చి ఎవరైనా దౌర్జన్యం చేస్తే అప్పుడు మనమెలా రియాక్ట్ అవుతామనేదే అసలు ఫీలింగ్. దాన్ని హింస అంటామా? అహింస అంటామా? అనేది పరిస్థితిని బట్టి ఉంటుంది, ఇదే నేను సినిమాలో చూపించాను" అని దర్శకుడు అజయ్ ఆండ్రూస్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. మంచు మనోజ్ ఎల్.టి.టి.ఈ మిలిటెంట్ చీఫ్ ప్రభాకరన్ పాత్ర పోషిస్తున్న చిత్రమిది. పద్మజ ఫిలింస్ ఇండియా ప్రై.లి బ్యానర్‌పై ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీకాంత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకొన్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ను శనివారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో విడుదల చేశారు. మంచు లక్ష్మి ట్రైలర్‌ను విడుదల చేశారు.

అనంతరం దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటి వరకు తెలుగు సినిమాలో రాని పాయింట్. హింస, అహింస అనే రెండు విషయాలను ఎలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తాం. ఒక దేశం, రాష్ట్రం, కుటుంబంలో పెద్ద ఫెయిల్ అయితే దాని ప్రభావం ఆ సమాజం లేదా కుటుంబంపై ఎలా చూపుతుందనేదే ఈ కథ. 21వ శతాబ్దంలో మనిషి ఆకలి, మనుగడ కోసం పోరాడుతూనే ఉన్నాడు. దీని కోసం ఓ నాయకుడు పోరాడుతున్నప్పుడు ఎలాంటి ఫలితాన్ని చూపుతాయనేదే ఈ సినిమా. సామాన్యులు అణగదొక్కడం వల్లే ప్రతిసారి వారి నుండి ఓ నాయకుడు పుడతాడు. అతను ఏ మార్గం ఎంచుకుంటాడనేది పరిస్థితి బట్టి ఉంటుంది. అలాంటి కథే ఒక్కడు మిగిలాడు' అని చెప్పారు.

హేయ్..పిల్లగాడ

హేయ్ పిల్లగాడ...ఏందిరో పిల్లగాడ...నా గుండెకాడ...ఈ గీతం ఇప్పుడు అందరినీ ఫిదా చేస్తోంది కదా. ఎందుకంటే 'ఫిదా' చిత్రంలో హీరోను ఆటపట్టించింది సాయి పల్లవి. అదే పాటను ఆమె హీరోయిన్‌గా నటించిన చిత్రానికి టైటిల్‌గా ఖరారు చేశారు. ఇందులో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్నారు. మలయాళంలో వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'కలి'. ఈ సినిమాను తెలుగులో లక్ష్మీ చెన్నకేశవ ఫిలింస్ పతాకంపై 'హేయ్.. పిల్లగాడ'గా పేరు పెట్టారు. సమీర్ తాహిర్ దర్శకుడు. ఈ సినిమా లోగోను శనివారం దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ 'కలి' చిత్రం మలయాళం, తమిళంలో పెద్ద విజయాన్ని సాధించింది. తెలుగులోనూ పెద్ద హిట్ కావాలని కోరుకుంటూ దుల్కర్, సాయి పల్లవి సహా నిర్మాతకు అభినందనలు తెలిపారు. సెప్టెంబర్ 8న చిత్రం విడుదల చేస్తున్నట్టు నిర్మాత డి.వి. కృష్ణ స్వామి ప్రకటించారు.


'హేయ్ పిల్లగాడ' చిత్రంలో దుల్కర్, సాయి పల్లవి

మహిళలూ సూపర్ స్టార్లే


రాధికా ఆప్టే

పురుషుల్లా మహిళలూ సూపర్ స్టార్లే అని ప్రేక్షకులు అనుకున్నప్పుడే స్త్రీ-పురుష నటుల మధ్య ఉన్న అంతరానికి తెరపడుతుందని నటి రాధికా ఆప్టే పేర్కొంది. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ చాలా మంది హీరోలు తమ కంటే ఎక్కువగానే పారితోషికం పొందుతున్నారని చెప్పింది. "నాతో పని చేసే మేల్ కో స్టార్స్‌కు నాకూ చాలా అసమానతలు ఉన్నాయి. ఎవరు ఎంత పొందుతున్నారో(పారితోషికం) నాకు తెలుసు. నా కంటే నాతోటి (మగ)వారు మూడు రెట్లు ఎక్కువగా పారితోషికం తీసుకుంటున్నారు. ఈ విషయంలో సమాన స్థాయిని సాధించుకునేందుకు మాకు చాలా మంది పురుష నటులు సపోర్టుగా ఉన్నారు కానీ మహిళల సంఖ్యే తక్కువగా ఉంది. వారి సపోర్టే ఎక్కువగా లభించడం లేదు. ఈ పరిస్థితి ఒక సినీ ఇండస్ట్రీలోనే కాదు. మొత్తం సమాజంలోనే ఉంది. ప్రియాంక చోప్రా, దీపికా పదుకొనే వంటివారు సల్మాన్ ఖాన్‌లా పనిచేయడం మొదలు పెడితే మేమంతా ఫీమేల్ సూపర్‌స్టార్స్‌గా మారుతాం. మహిళా స్టార్లూ సూపర్‌స్టార్లే అన్న నిజాన్ని ఇప్పటికీ ప్రేక్షకులు జీర్ణించుకోలేకపోతున్నారు. కానీ కొందరు దర్శకులు మాత్రం మహిళలకు ప్రాధాన్యమిచ్చే చిత్రాలు తీస్తునందుకు ఆనందంగా ఉంది' అని రాధికా ఆప్టే పేర్కొంది.



నరియన్ కార్తికేయన్ 19 ఏళ్లకు పూర్వం భారతదేశ యువప్రతిభను అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించాడు. బ్రిటీష్ రేసింగ్ డ్రైవర్స్ క్లబ్ (బిఆర్‌డిసి) ఫార్ములా 3 చాంపియన్‌షిప్‌లో గెలిచిన మొట్టమొదటి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. ఇన్నాళ్లే తర్వాత అదే స్ఫూర్తిని అందించడానికి 19 ఏళ్ల వయసున్న మరో యువకెరటం 'కృష్ణరాజ్ మహాదిక్' వెలుగులోకి వచ్చాడు. నరియన్ వారసత్వాన్ని నిలిపిన రెండవ భారతీయుడిగా రేసులో విజయం సాధించాడు. అయితే ఆ రేసులో పాల్గొనే అవకాశం అనుకోకుండా రావడం మరో విశేషం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ ప్రతిష్టాత్మక మోటార్ రేసింగ్ చాంపియన్‌షిప్స్‌లో ప్రవేశం.. కృష్ణరాజ్ రేసింగ్ ప్రస్థానం ఈ వారం 'జోష్'.

అనుకోని అవకాశం.. అరుదైన విజయం

ఫార్ములా 1 రేస్‌లో విజయం సాధించిన ఏకైక భారతీయ రేసర్ నరియన్ కార్తికేయన్. మొదటిసారి బిఆర్‌డిసి రేసింగ్ 3 గెలిచిన సంవత్సరంలో పుట్టాడు కృష్ణరాజ్. ఎనిమిదేళ్ల వయసులో కొల్హాపూర్‌లోని గో-కార్టింగ్ రేసింగ్ ట్రాక్ దగ్గర గంటల కొద్దీ గడిపేవాడు. స్వతహాగా క్రీడాకారులైన తన తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. రెజిలింగ్, బాక్సింగ్‌లో తండ్రి ధనంజయ్ మహాదిక్ జాతీయస్థాయి చాంపియన్ అయితే తల్లి అరుంధతి జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి. మోటార్‌స్పోర్ట్స్‌లోకి రాకమునుపు కృష్ణరాజ్ బ్యాట్‌మింటన్, స్విమ్మింగ్, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడల్లో పాల్గొనేవాడు. రాష్ట్రస్థాయి బ్యాడ్మెంటన్, ఫుట్‌బాల్ క్రీడల్లోనూ పాల్గొన్నాడు. ఎనిమిదేళ్ల వయసులో రేసింగ్‌పై ఇష్టం పెంచుకున్న కృష్ణరాజ్.. పదేళ్ల వయస్సు వచ్చేటప్పటికి ఎంతో థ్రిల్లింగ్‌గా అనిపించే రేసింగ్‌లో పాల్గొనాలని నిర్ణయించుకున్నాడు. తన స్నేహితుడి తండ్రి కొల్హాపూర్‌లోని గో-కార్ట్ రేసింగ్ ట్రాక్ యజమాని కావడంతో తన కోరికను నిజం చేసుకోవడానికి అవకాశం దొరికింది.


ఇష్టంతో విజయం

పద్నాలుగేళ్ల వయసుకే నేషనల్ గో-కార్టింగ్ చాంపియన్‌షిప్‌లో గెలిచేవాడు. దాని తర్వాత పోర్చుగల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కార్టింగ్ ఈవెంట్ రోటాక్స్ మ్యాక్స్ వరల్డ్ గ్రాండ్ ఫైనల్స్‌లో వరుసగా రెండుసార్లు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, విజయం సాధించాడు. దానిలో పాల్గొన్న మొట్టమొదటి భారతీయుడూ కృష్ణరాజే. గో-కార్టింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తన సత్తా చూపించిన తర్వాత కృష్ణరాజ్ 2013లో సింగిల్-సీటర్ రేసింగ్‌లో పాల్గొనాలని నిర్ణయించుకున్నాడు. బిఎమ్‌డబ్ల్యూ ఫార్ములా 4 సిరీస్‌తో ప్రారంభించిన ప్రస్థానం 2015లో జెకె టైర్ నేషనల్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానంతో ముగించాడు. అంతర్జాతీయ ప్రాంగణాల్లో స్టీరింగ్ పట్టిన కృష్ణరాజ్ 2016 బిఆర్‌డిసి ఫార్ములా 3 చాంపియన్‌షిప్‌లో ప్రొఫెషనల్ రేస్ టీమ్ అయిన క్రిస్ డిట్‌మ్యాన్ రేసింగ్‌లో తన ప్రతిభ చూపించాడు.

అనుకోని విజయం

బిఆర్‌డిసి చాంపియన్‌షిప్‌లో పాల్గొనడం అనుకోకుండా జరిగిందంటాడు కృష్ణరాజ్. నిజానికి 2018లో నిర్వహించబోయే బ్రిటీష్ ఫార్ములా 3 కోసం ప్రాక్టీస్ చేస్తూ.. చాలా బిజీగా ఉన్న సమయంలో దాని కోసం తాను ఒప్పందం కుదుర్చుకున్న డబుల్ ఆర్ రేసింగ్‌కు చెందిన ఒక డ్రైవర్‌కు గాయం కావడంతో వాళ్లు 2018లో పాల్గొనాల్సిన కృష్ణరాజ్‌కు 2017లోనే అవకాశం ఇచ్చారు. గత నాలుగు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్న కృష్ణరాజ్ ఆ అవకాశాన్ని వదలదల్చుకోలేదు. అప్పటికే డబుల్ ఆర్ రేసింగ్ టీమ్ మేనేజర్ రుపోర్ట్ కూక్, జాక్ క్లార్కే పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ తీసుకుంటూ, క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తున్నాడు గనుక కృష్ణరాజ్ నమ్మకంగా ఉన్నాడు.

ఎలాంటి ఒత్తిడీ లేకుండా పాల్గొనడానికి సిద్ధపడ్డాడు. పోల్ స్థానం నుండి రేస్ 2 ప్రారంభమయ్యాక ఫస్ట్ హాఫ్ వరకూ రేస్‌లో మొదటి స్థానంలో నిలిచిన కృష్ణరాజ్ తీవ్రంగా పోరాడి, చివరికి రెండవ స్థానంలో నిలిచాడు. అయితే మొదటి స్థానంలో నిలిచిన టోబి సొవెరి కొన్ని సాంకేతిక కారణాల వలన అనర్హుడిగా మిగలడంతో కృష్ణరాజ్ ప్రథమస్థానంలో నిలిచాడు.



ఏదేమైనప్పటికీ మొదటి ప్రయత్నంలోనే 19 ఏళ్ల చరిత్రను పందొమ్మిదేళ్ల కుర్రాడు తిరిగి ప్రతిష్ఠించడం గొప్ప విజయంగా చెప్పుకోవాలి. అంతకుమించి ఏడాది తర్వాత పాల్గొనాల్సిన పోటీ అవకాశం ఏడాది ముందే వచ్చినా కంగారుపడకుండా.. నమ్మకంగా, నిబ్బరంతో పాల్గొని విజయం సాధించాడు. ఇది ఇష్టమైన పనిలో అతనికున్న నిబద్ధతను తెలియజేస్తుంది. ప్రస్తుతం ఎస్.వై.బి.కామ్ చదువుతున్న కృష్ణరాజ్ ఫార్ములా 1 రేస్‌లో పాల్గొని, దిగ్విజయంగా దేశ గౌరవాన్ని నిలుపుతానంటున్నాడు. ★

ప్రేమ విఫలమై.. పుస్తకాల పురుగై..!




ప్రేమ విఫలమైతే పిచ్చోళ్లవుతారని అందరూ అనుకుంటారు. కానీ ఇతగాడి ప్రేమ ఇతణ్ణి పుస్తకాల పురుగుని చేసింది. అంతేకాదు, ఇప్పుడా పురుగు మరింత మంది పురుగులతో పుస్తకాలను చదివిస్తుంది. హిమాన్షు ఇంజినీరింగ్ చేరే సమయానికి అతడు ఒక్క నవలా చదవలేదు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో తన ప్రేయసితో విడిపోయిన తర్వాత.. తన ఆలోచనల నుండి ఆమెను దూరంపెట్టడానికి చదవడం ప్రారంభించాడు. మరలా ప్రేమలో పడ్డాడు...అయితే ఈసారి ప్రేమలో పడింది కథలతో. హ్యారీపోటర్‌తో మొదలుపెట్టిన అతని సాహిత్య ప్రయాణం కిక్కిరిసే రీడింగ్ క్లబ్ ఏర్పాటుచేసే వరకూ వచ్చింది. 27 ఏళ్ల హిమాన్షుకు పుస్తకాలు చదవడం హాబీగానే తీసుకోలేదు. ఎనలిటిక్స్ కన్సల్‌టెంట్‌గా చేస్తున్న మంచి ఉద్యోగం మానేసి, తనకి ఆసక్తి ఉన్న పుస్తకాలవైపు మొగ్గుచూపాడు. 'బ్లాక్ ఫెదర్స్' అనే ఆన్‌లైన్ మ్యాగజైన్ ప్రారంభించాడు. ప్రస్తుతం దీనికి రెండువేల మంది కంట్రిబ్యూటర్లుగా ఉన్నారు. విజ్ఞానమే మారకంగా భావించే ఈ చోటులో కథలు, కవిత్వం రాయడంతో పాటు వారి ఫోటోలనూ పోస్ట్ చేసుకోవచ్చు.

ఇక హిమాన్షు స్థాపించిన క్లబ్ గురించి తెలుసుకుందాం. పుస్తకాలు విపరీతంగా చదివేవారు సమాజంతో ఎక్కువగా కలవరనే అపోహ ఒకటి ఉంది. వాళ్ల మొఖం పేజీల్లో పాతుకునిం ఊహల్లో విహరిస్తారని అనుకుంటారు. కానీ హిమాన్షు స్థాపించిన హైదరాబాద్‌లోని 'హిమాన్షు సింగ్ బుక్ క్లబ్' సాక్షిగా 'రైజ్ ఆఫ్ బిబ్లియోఫైల్స్' అనే పేరుతో పుస్తకాల పురుగులన్నీ ఒకచోట చేరి, ఆ అపోహకి సరైన సమాధానం ఇస్తున్నారు. అక్కడి రీండింగ్ కమ్యూనిటీ పుస్తకాల్ని ఎక్స్‌ఛేంజ్ చేసుకుంటారు. అంతేకాదు, స్పాట్ రైటింగ్ వంటి విజ్ఞానానికి సంబంధించిన వివిధ కార్యక్రమాల్ని నిర్వహిస్తారు. హిమాన్షు సింగ్ ప్రారంభించిన ఈ క్లబ్ వయసు నాలుగు నెలలే. కానీ మాసానికి రెండుసార్లు నిర్వహించే కార్యక్రమాలకి వచ్చే జనాలతో ఇప్పుడు ఇది హౌస్‌ఫుల్ అయ్యింది. వంద మంది ఉండే ఈ గ్రూప్ నుండీ ప్రతి సెషన్‌లో 30 మంది పాల్గొంటారు. అక్కడ పుస్తకాలు ఎక్స్‌ఛేంజ్ చేసుకుని, ఒక పుస్తకం చదవడానికి ఒకొక్కరికీ పట్టే సమయాన్ని నిర్దేశించుకుంటారు. ఇక్కడ పాయింట్ల సిస్టం కూడా ఉంటుంది. పొందిన రివార్డు పాయింట్లను బట్టి.. ఆ నెలకి ఎవరు పుస్తకాల పురుగో నిర్ణయిస్తారు. అక్కడ స్పాట్ రైటింగ్‌తో పాటు కథలు చెప్పడం వంటి ఇతర సాహిత్య సవాళ్లనూ ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీనికి 'రైజ్ ఆఫ్ లిటరటి' అనే పేరు పెడదామని ఆలోచిస్తున్నారు క్లబ్ సభ్యులు.

ఈ క్లబ్‌ను స్థాపించడం అంత సులువుగా జరగలేదు. ఒకప్పుడు తాను నడుపుతున్న ఆన్‌లైన్ మ్యాగజైన్‌పై పూర్తి సమయాన్ని కేటాయించడానికి హిమాన్షు ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కానీ ఈ మధ్యనే వివాహం చేసుకోవడం వలన.. సామాజిక ఒత్తిళ్ల వలన మరలా ఉద్యోగంలో చేరాల్సిన పరిస్థితి వచ్చింది, ఉద్యోగంలో చేరాడు కూడా. అయినప్పటికీ సదరు రీడింగ్ క్లబ్ మొదలుపెట్టే సమయానికి మరలా ఉద్యోగాన్ని వదిలేశాడు. ఆ సమయంలో తన భార్య తనకు అండగా ఉండటంతో అనుకున్న కార్యం నెరవేరింది. అలాగని ఇప్పుడు సంపాదించడం లేదంటే పొరపాటే. ప్రస్తుతం హిమాన్షు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ప్రకటనల ద్వారా డబ్బు సంపాదిస్తున్నాడు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో పుస్తకాలు, స్టేషనరీ అమ్మడం, ప్రూఫ్ రీడింగ్, ఘోస్ట్ రైటింగ్ వంటివాటిల్లో బహుముఖంగా పనిచేస్తున్నాడు. తన నెట్‌వర్క్ ద్వారా పుస్తకాలు డిజైనింగ్ కూడా చేస్తాడు. వీటితో వచ్చే డబ్బుల కంటే హిమాన్షు వివిధ కాలేజీల్లో ఎనలటిక్స్ గురించి గెస్ట్ లెక్చర్లు ఇస్తూనే బాగా సంపాదిస్తున్నాడు. అందుకే మనసుంటేనే మార్గం కాదు... ఇక్కడ మనసు పగిలినా మార్గం ఏర్పడింది మరి! ★



అంబేద్కర్ అందరివాడు



అంబేద్కర్‌ను భారతదేశ ప్రజలందరి ప్రయోజనాల్ని కాంక్షించిన జాతీయ నాయకుడి. అలాకాక సమాజంలో కొన్ని సామాజిక సంఘాలకు మాత్రమే పరిమితం చేసే పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతుండటం బాధాకరం. భారతదేశ అభ్యున్నతికి అడ్డుగోడలుగా నిలిచిన కుల దొంతర్ల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసిన స్వాతంత్ర్యోద్యమనేతగా గుర్తించాలి. అందుకు ఆయన సిద్ధాంతాలను ప్రజల్లో ప్రచారమయ్యేలా ప్రభుత్వాలే చర్యలు చేపట్టాలి. ఆ మేరకు సహాయం చేయగలిగిన ఆయన రచనల్లోన్ని కొన్ని భాగాలను.. చిన్నచిన్న పుస్తకాలుగా, అందరూ కొనుగోలు చేయగలిగే ధరల్లో ప్రచురించాలి. అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చే పనిని చేపట్టడానికి ప్రభుత్వాలు ముందుకురావాలి. వివిధ అంశాలపై ఆయన రాసిన రచనలను వర్గీకరించి, ప్రచురించడం వల్ల సామాజిక, ఆర్థిక విషయాలపై ఆయన భావాలు అందరికీ చేరువవుతాయి.

- ఉప్పలపు శేషు, పి.నైనవరం.

ఆహ్వానం : యువ పాఠకుల కోసం ప్రతి ఆదివారం ప్రచురితమౌతున్న 'జోష్'లో మీరూ భాగస్వామి కావచ్చు. క్యాంపస్ కబుర్లు, ప్రాజెక్టుల వివరాలు, విజయాలు 'జోష్' పాఠకులతో షేర్ చేసుకోవచ్చు. 'జోష్' వాట్సప్ నంబర్ : 8333818985

పొడుపు కథ

తల నుండి పొగ చిమ్ముతుంది.. భూతం కాదు.
కన్నులెర్రగా ఉండు.. రాకాసి కాదు.
పాకిపోవుచుండు.. పాము కాదు?

గుర్తె : రైలు

జోక్..

బంటి : "నాన్నా! నేను ఎక్కువ తింటానని అరుస్తావుగా. మరి నాకు పోటీలో మొదటి బహుమతి వచ్చింది తెలుసా?
తండ్రి: మంచిది! ఇంతకీ ఏ పోటీలో?
బంటి : తిండి పోటీలో
తండ్రి : ఆఆఆఆ...!!??




రైలుపట్టాల కింద కంకరే ఎందుకు?



భారతదేశంలో నానాటికీ పెరుగుతున్న ప్రయాణీకులను ఒకచోట నుంచి మరొకచోటుకు చేర్చడానికి ఎన్ని రవాణా సౌకర్యాలు ఉన్నా.. రైలుకు సాటి మరొకటి లేదు. అయితే రైలు బండి అనగానే మనకు గుర్తొచ్చేది రైలుపట్టాలు. రైలు ప్రయాణిస్తున్నప్పుడు వింత శబ్ధంతో కొత్త అనుభూతిని కలుగచేస్తాయి. ఎప్పుడైనా రైలు ప్రయాణంలో గమనిస్తే రైలు పట్టాల మధ్య, కింద కంకరపోసి ఉంటుంది. ఈ కంకర ఉపయోగం ఏమిటి? పట్టాల కింద కంకరనే ఎందుకు వాడతారు? అని అనుమానమొస్తుంది. అయితే ఇంటికి రాగానే మర్చిపోతుంటాం. ఈ రైలుపట్టాల మధ్య కంకర వేసే విధానాన్ని సాంకేతిక నిపుణులు 19వ శతాబ్దంలో రూపొందించారు. రైలు పట్టాల కింద కంకరవల్ల ఎన్ని సాంకేతిక సమస్యలు పరిష్కారమవుతాయో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగకమానదు. సాధారణంగా రైలు మార్గం క్షితిజ సమాంతర తలం.. లంబతలం.. రెండూ ఒకే మట్టంలో ఉండాలి. రైలు పట్టాలు వేసేటప్పుడు ముందు స్లీపర్లు వేసి, వాటిపై పట్టాలను బిగిస్తారు. ఆ తర్వాత కంకర రాళ్ళు దానిచుట్టూ వేస్తారు. నిరంతరం ఈ పట్టాల మీద రైళ్ళు ప్రయాణించడం వల్ల కొన్నిచోట్ల స్లీపర్లు క్రుంగి, మట్టం మారవచ్చు. అందుకే నిరంతరం ఈ రైలు పట్టా మట్టాన్ని తనిఖీ చేస్తుంటారు. రైల్వే గ్యాంగ్‌మెన్ నాలుగు చక్రాల తోపుడుబండిపై పట్టాలపై ప్రయాణిస్తూ.. మట్టం మారినచోట స్లీపర్ల కింద కంకరతో మట్టాన్ని సరిచేయాలి. అందుకు కంకర అందుబాటులో ఉండాలి. అందుకే ఎక్కువ మొత్తంలో కంకరను పట్టాలకు ఇరువైపులా ఉంచుతారు. ఈ కంకర బదులుగా కొన్ని దేశాలలో అగ్నిపర్వతాలు విడుదల చేసిన బూడిదవంటి పదార్థాన్నీ వినియోగిస్తుంటారు. మొత్తం మీద రైలు పట్టాల మధ్య కంకర చేసే మంచిపని ఇది. ★






గడులు నింపండి!

పిల్లలూ.! పైనున్న చిత్రంలో కొన్ని బొమ్మలున్నాయి. వాటికెదురుగా ఇచ్చిన గడులలో వాటి పేర్లతో నింపండి!

సాహసం-3

కథ: శాఖమూరి శ్రీనివాస్ (సెల్: 94410 73750)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98402 87509)



ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

12 విజయవాడ
ఆదివారం 20 ఆగస్టు 2017

ఆటలు



నెం.1 నాదల్

సిన్సినాటి: స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో మూడేళ్ల తర్వాత నెం:1 స్థానాన్ని అధిష్టించాడు. సిన్సినాటి మాస్టర్స్ క్వార్టర్స్‌లో ఆస్ట్రేలియా టెన్నిస్ ఆటగాడు నిక్ కిర్గియోస్‌పై జయభేరి మోగించి సెమీస్‌కు చేరాడు. దీంతో నెం:1 స్థానం ఖరారైంది. సోమవారం విడుదల చేసిన ఏటిపీ ర్యాంకుల్లో అతడు నెంబర్ వన్‌కు చేరుకుంటాడు. దీంతో ఈ నెల 28న ప్రారంభమయ్యే యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పోరుకు జోష్‌గా సన్నద్ధం కానున్నాడు. ఇప్పటి వరకు నాదల్ 15 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. జూన్‌లో పదో ఫ్రెంచ్ ఓపెన్ సాధించిన విషయం తెల్సిందే. జూలై 2014 తర్వాత మళ్లీ నెంబర్ వన్ స్థానాన్ని అధిష్టించాడు. బార్సిలోనాలో గాయంతో బాధపడిన తనను అభిమానులు ఎంతో ఆదరించారని నాదల్ తెలిపాడు.

ప్రపంచకప్‌కు కౌంట్‌డౌన్

- నేడు భారత్-శ్రీలంక తొలి వన్డే
- ఒత్తిడిలో ఇరుజట్ల కీలక ఆటగాళ్లు
- రహానే, పాండే బెంచ్‌కే పరిమితం?



దంబుల్లా: శ్రీలంక, భారత్ మధ్య జరగనున్న వన్డే సిరీస్ నుంచి 2019లో జరిగే ప్రపంచకప్ కౌంట్‌డౌన్ మొదలు కానుంది. భారత్‌లో ప్రపంచకప్ సన్నద్ధతకు ఆటగాళ్ల ఫిటెనెస్‌ను బిసిసిఐ పరీక్షించనుండగా, శ్రీలంక కనీసం రెండు మ్యాచ్‌లైనా గెలవకపోతే పోటీల్లో పాల్గొనే అవకాశం ప్రమాదం పడనుంది. దీంతో ఇరుజట్లకు ఇది బస్తిమే సవాలే. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా శ్రీలంక,భారత్‌లు తొలి వన్డేలో దంబుల్లా వేదికగా ఆదివారం తలపడనున్నాయి. ఎటువంటి వత్తిడి లేకుండా టీమిండియా అలవోకగా శ్రీలంకపై 3-0తో తొలిసారి క్లీన్‌స్వీప్‌తో చరిత్ర సృష్టించింది. మరోవైపు సిరీస్‌లో ఘోరంగా వైఫల్యం చెందిన లంకేయులు వన్డే సిరీస్‌లో నిలబెట్టుకోకపోతే ఆ దేశంలోనే మరోసారి అభిమానుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొనే ప్రమాదంలో పడింది.దంబుల్లాలో భారత్, శ్రీలంకల మధ్య 11 మ్యాచ్‌లు జరగ్గా శ్రీలంక కేవలం 4 వన్డేల్లోనే విజయం సాధించింది. మరోవైపు ఇక్కడ నుంచి కెప్టెన్ కోహ్లీ 2008లో తొలి మ్యాచ్‌ను మొదలెట్టాడు. దీంతో తొమ్మిదేళ్ల అనంతరం మళ్లీ విరాట్ ఏ విధంగా బ్యాటింగ్ చేస్తాడన్నది ఆసక్తి కరంగా మారింది. దీంతో తొలి వన్డే నుంచి అటు విరాట్, ఇటు తరంగా ఆధిపత్యం సాధించడంపైనే గురిపెట్టాల్సి ఉంటుంది. ఈ సిరీస్‌లో రెండు వన్డేలను గెలిస్తే 2019 ప్రపంచకప్‌కు నేరుగా శ్రీలంక అర్హత సాధించనుంది. భారత్ కూడా 4-1తో సిరీస్ గెలవకపోతో నెం:1 కోల్పోయే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ప్రపంచకప్‌కు అనుకూలమైన జట్టును ఈ సిరీస్ నుంచి ఎంపిక చేయనున్నట్లు చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్ హెచ్చరికలు జారీ చేశాడు. ఇందులో భాగంగా స్టార్ బ్యాట్స్‌మెన్ యువరాజ్ సింగ్‌ను పక్కన పెట్టేశారు. దీంతో అటు ఓపెనర్ల నుంచి ఇటు మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ వరకు ఒత్తిడి పెరిగిందనే చెప్పాలి. ఈ నేపథ్యంలో పరుగుల వరదతో ఫిట్‌నెస్ నిరూపించకపోతే స్వదేశంలో జరిగే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లకు దూరం కానున్నారు. అదే జరిగితే ప్రపంచకప్ తుది జట్టు నుంచి నిష్క్రమించాల్సి ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని భారత్ ఆటగాళ్లు రాణించాల్సి ఉంది.

ధోనీకి అగ్ని పరీక్ష.. ఓపెనర్‌గా రాహుల్‌కు సవాల్

మూడు ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా తప్పుకుని కేవలం వన్డే, టి 20ల్లోనే సభ్యుడిగా ఉన్న మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అసలైన పరీక్ష శ్రీలంకలోనే మొదలు కానుంది. 36 ఏళ్ల ధోనీ 2019 ప్రపంచ కప్‌లో స్థానం సాధించాలంటే తన ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుంది. తాజా జట్టులో ఇతర వికెట్ కీపర్ ఎవర్ని తీసుకోలేదు. దీంతో అతడ్ని పరీక్షించే యోచనలో సెలక్టర్లులున్నారన్నది స్పష్టమైవుతోంది. ఐదో స్థానంలో ధోనీ బరిలో దిగనుండగా, ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్య ఏడో స్థానంలో బ్యాట్ పట్టనున్నాడు. ఐసిసి ఛాంపియన్‌షిప్ ఫైనల్ పేలవమైన ప్రదర్శన, విండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కొంత విమర్శలు ఎదుర్కొన్న ఎంఎస్ ఈ సిరీస్‌లో సత్తా చాటడానికి పావులు కదుపుతున్నాడు. టెస్ట్‌ల్లో ఓపెనర్‌గా కెఎల్ రాహుల్ తన సత్తా నిరూపించుకున్నాడు. ఇప్పుడు వన్డేల్లో నాలుగో స్థానంలో రాహుల్ బరిలో దిగుతాడని టీమ్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ఇప్పటి వరకు కేవలం ఆరు వన్డేల్లోనే కెఎల్ ఆడిన అనుభవం ఉంది. 2016లో జింబాబ్వే వన్డే సిరీస్‌తో వన్డే జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు వన్డేల్లో ఓపెనర్‌గా కేవలం 24 పరుగులే చేశాడు. ఆ తర్వాత గాయాల బారిన పడి జట్టుకు పలుమార్లు దూరం అయ్యాడు. లోయర్ డౌన్‌లో రాహుల్ ఐపిఎల్-10లో 12 ఇన్నింగ్స్‌ల్లో 44.11 సగటుతో 397 పరుగులు చేశాడు. నెం:4 బ్యాట్స్‌మెన్‌గా 2015 నుంచి రహానే తన ప్రతిభను చాటుకుని జట్టులో స్థానాన్ని నిలుపుకున్నాడు. ఓపెనింగ్ జోడిగా శిఖర్, శర్మ సత్తా చాటుతున్న నేపథ్యంలో రోహిత్‌కు మూడో అవకాశాన్ని సెలక్టర్లు ఇచ్చారు. దీంతో వైస్ కెప్టెన్‌గాను జట్టులో నిలదొక్కుకోకపోతే ఓపెనర్‌గా మనీష్ పాండే, కేదారీ జాదవ్‌లతో ఆ స్థానాన్ని భర్తీ చేసే యోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. పేస్ బౌలర్లుగా భువనేశ్వర్‌తో బుమ్రా బంతిని పంచుకోనుండగా, స్పిన్నర్ల కొటాలో చైనమన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్‌కు అగ్రతాంబూలం ఇవ్వనున్నారు. రెండో బౌలర్‌గా అక్షర్ లేదా చాహల్ అనేది టాస్ ఆధారంగా నిర్ణయించనున్నారు.



ముంబా ఆటగాడ్ని పట్టేసిన టైటాన్స్

టైటాన్స్ గెలిచిందోచ్

- ముంబాపై 37-32తో జయకేతనం
- ఈ సీజన్‌లో రెండో విజయం

లక్నో: ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ మళ్లీ పట్టాలెక్కింది. ఏడు ఓటముల తర్వాత గెలుపు గుర్రం ఎక్కింది. కెప్టెన్ రాహుల్ చౌదరీ అత్యధికంగా 13 పాయింట్లతో కోర్టులో దుమ్మురేపడంతో యు ముంబాపై 37-32తో జయకేతనం ఎగుర వేసింది. 20 రోజుల తర్వాత టోర్నీలో రెండో విజయంతో జోన్ బిలో ఐదో స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరుకుంది. శనివారం నాటి తొలి మ్యాచ్‌లో ఆది నుంచి ఆధిక్యంలో నిలిచిన టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రతిభతో ముంబాను ఖంగుతినిపించింది.తొలి అర్ధభాగంలో టైటాన్స్ జట్టు 19-15తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో చివరి 10 నిమిషాల వరకు ముంబాపై 27-20తో ముందంజ వేసినా తెలుగు జట్టు ఆ తర్వాత పట్టు కోల్పోయింది. ఈ దశలో చెలరేగిన ముంబా రైడర్లు దూకుడు పెంచారు. షాబిర్ బాపు నాలుగు పాయింట్లతో దుమ్మురేపాడు. దీంతో అనుహ్యంగా ముంబా జట్టు టైటాన్స్ ఆధిక్యంను తగ్గించే దిశగా సాగింది. చివర్లో అతను సాధించిన నాలుగు పాయింట్లతో ముంబాకు విజయంపై ఆశలు రేకెత్తినా రాహుల్ చౌదరీ వ్యూహాత్మకంగా తప్పిదాలకు పోకుండా జట్టును విజయ పథాన నడిపించాడు.తొలి రైడ్‌కు వెళ్లిన తెలుగు కెప్టెన్ రాహుల్ చౌదరీ తొలి పాయింట్‌తో బణి చేశాడు. మొత్తం 20 సార్లు ప్రత్యర్థి జట్టుపై దండెత్తిన రాహుల్ మరోసారి 13 పాయింట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటి వరకు రెండు విజయాలు, ఏడు ఓటములు, ఓ మ్యాచ్ డ్రా ద్వారా 17 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకుంది.

హెచ్‌సిఏ ఎన్నిక చెల్లదన్న అజహర్

హైదరాబాద్: లోధా కమిటి సిఫార్సుల ప్రకారం చూస్తే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నిక(హెచ్‌సీఏ) ఎన్నిక చెల్లదని, దాన్ని వెంటనే రద్దు చేయాలని భారత మాజీ కెప్టెన్ అజారుద్దీన్ డిమాండ్ చేశాడు. హెచ్‌సిఏ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశాడు. అసోసియేషన్‌లో చట్టవ్యతిరేక వ్యవహారాలు జరుగుతున్నాయని అజార్ ఆరోపించాడు. భారతీయ క్రికెటర్లకు హెచ్‌సిఏలో గుర్తింపు లేదని, హైదరాబాద్ క్రికెట్ జట్టు నుంచి కొందరూ కూడా రంజీకి ఎంపిక కాకపోవడం నిరాశ కలిగించదన్నాడు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అన్యాయం జరిగిందని అజార్ వాపోయాడు. ఈ వ్యాఖ్యలు ఎవర్ని నిందించడానికి చేసినవి కావన్నాడు.

సిన్సినాటి నుంచి సానియా, బోపన్న ఔట్

ఒహియా(అమెరికా): సిన్సినాటి మాస్టర్స్ డబుల్స్‌లో భారత్ టెన్నిస్ తారలు సానియా మీర్జా, రోహన్ బోపన్నలు పోరాటం ముగిసింది. సెమీస్‌లో మీర్జా,క్వార్టర్స్‌లో బోపన్న ద్వయాలు ఓటమి చవిచూసి ఇంటి ముఖం పట్టాయి. మహిళల డబుల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ మీర్జా, పెంగ్ షాయాయి సెమీస్ పోరులో సు-వుయ్(తైవాన్), మోనికా నికోలస్(రోమేనియా) జంట చేతిలో 4-6,6-7తో ఇంటి ముఖం పట్టారు. క్వార్టర్స్ ఫైనల్లో బోపన్న, డూడింగ్ జంట రెండో సీడ్, పోలెండ్ ద్వయం లూకాస్ కుబట్, మార్కోలో మెలో చేతిలో 1-6, 7-6,7-10తో పోరాడి ఓటమి చెందారు. ఇరుజట్ల మధ్య పోరు గంటా 36 నిమిషాల పాటు హోరాహోరీగా సాగింది.

టాప్‌సీడ్‌తో అమీతుమీకి సౌమ్యజిత్, సత్యయాన్

బల్గేరియా టిటి ఫైనల్స్‌కు చేరిక



న్యూఢిల్లీ: 2017 ఐటిటిఎఫ్ ప్రపంచ టూర్‌లో భారత టేబుల్ టెన్నిస్ తారలు సౌమ్యజిత్ ఘోష్, జి. సత్యయాన్ ఫైనల్స్‌కు చేరారు. శనివారం నాటి సెమీస్‌లో ఆగ్రేల్ బల్గేరియా ఓపెన్ డబుల్స్‌లో అమల్‌రాజ్, సనీల్ శెట్టి(భారత్)జంటపై 11-3, 12-10,11-8తో జయకేతనం ఎగుర వేశారు. భారత్ జంట జపాన్ టాప్‌సీడ్స్ జిన్ ఉదా, మహ్రు యోషిమురతో టైటిల్ పోరులో ఆదివారం ఢీకొననున్నారు. అంతకు ముందు ఘోష్,సత్యయాన్‌లు క్వార్టర్ ఫైనల్లో యింగ్ హెంగ్-వుయ్, లిన్ ఉన్ జు జంటపై 3-2తో విజయం సాధించి సెమీస్‌కు చేరిన విషయం తెల్సిందే. మహిళల డబుల్స్ సెమీస్‌లో మౌనిక బత్రా, మౌమా దాస్ స్వీడన్-హంగరీ జంట ఎక్లహోమ్, జార్గోనా చేతిలో 4-11, 11-8, 12-14, 12-14తో పోరాడి పరాజయం చెందారు.

సత్యనారాయణకు 'ద్రోణా' లేదు

న్యూఢిల్లీ: ద్రోణాచార్య అవార్డు జాబితా నుంచి పారా స్పోర్ట్స్ కోచ్ షిమోగా సత్యనారాయణ పేరును తొలగిస్తున్న కేంద్ర క్రీడాశాఖ మంత్రి విజయ్ గోయల్ ప్రకటించారు. ఇటీవల అర్జున,ద్రోణాచార్య అవార్డులకు ఎంపిక జాబితాలో పారా ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత తంగవేలు మరియప్పన్ కోచ్‌గా ఉన్న సత్యనారాయణ పేరును ప్రతిపాదించారు. ఢిల్లీ కోర్టులో పరువు నష్టం కేసుకు సంబంధించి సత్యనారాయణపై కేసు పెండింగ్‌లో ఉన్న కారణంగా, పలువురు ఈ అంశంపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అతని పేరును తిరస్కరించినట్లు క్రీడావర్గాలు చెబుతున్నాయి. కాగా పరువు నష్టం కేసు విషయమై తనపై ఛార్జిషీటే దాఖలు కాలేదని, కావాలనే కొంత మంది అసూయతోనే తన అభివృద్ధి ఓర్వలేక ఈ విధంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని సత్యనారాయణ పేర్కొన్నారు. అవార్డుల జాబితాలో సత్యనారాయణ పేరు కత్తిరింపుతో అర్జున అవార్డుల జాబితాలో చోటు కోసం భారత టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న, వెయిట్‌లిఫ్టర్ సంజితా ఛాను పేర్ల పరిశీలనకు అవకాశం లేనట్లేనని తెలుస్తోంది. ఈ నెల 29న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పేరుతో జాతీయ క్రీడా దినోత్సవం జరగున్న సందర్భంలోనే రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం చేయనున్నారు. వీరిద్దరి పేర్లు ఆలస్యంగా ప్రతిపాదించిన విషయం తెల్సిందే.

ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు

- వైసిపి నేతలపై చర్యలు తీసుకోండి...
- కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష వైసిపి చర్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి భద్రతకు ముప్పుతెచ్చే విధంగా ఉన్నాయంటూ శనివారం టిడిపి జాతీయ కార్యాలయ కార్యదర్శి టిడి జనార్ధన్ కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమీషనర్‌కు లేఖ రాశారు. ఉప ఎన్నికల్లో రెండు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నంద్యాలకు వెళుతున్న సందర్భంగా ఆయనకు సంబంధించిన ఆహార పదార్ధాల వాహనంలో డబ్బు తరలిస్తున్నారంటూ వైసిపి తప్పుడు ప్రచారం చేసి, వాహన తనిఖీలు చేయించిందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి భద్రతకు ముప్పువాటిల్లే విధంగా వ్యవహరిస్తున్న వైసిపి నేతల తీరుపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. పాలుకూరి గ్రామంలో వైసిపికి చెందిన పాలకూరి వెంకటరామిరెడ్డి సోదరుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న రూ. 47.40 లక్షలు నంద్యాల ఉప ఎన్నికల్లో పంచడానికే తెచ్చారని తెలిపారు. సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

'అవసరమైతే' ఇస్తాం ?

- ఎన్నికలు ఎక్కడ జరిగినా ఇస్తారా? అన్ని ప్రశ్నించిన విలేకరులు
- సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించిన మంత్రి సుజనా చౌదరీ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుజనా చౌదరి

ఎన్నికలు ఎక్కడ జరిగినా ఈ విధంగానే అభివృద్ధికి నిధులు ఇస్తారా? అని కేంద్ర మంత్రి సుజనా చౌదరిని విలేకరులు ప్రశ్నించగా.. అవసరమైతే ఇస్తాం.. అని చెప్పారు. శనివారం ఉదయం విశాఖలోని టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. 'చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందనీ, నంద్యాలలో టిడిపి గెలుపు ఖాయ'మంటూ ప్రెస్‌మీట్ మొదలుపెట్టారు. 'చాలా ఎక్కువగా డబ్బు, మందిని అక్కడ మోహరించారు.. దేశంలో ఎక్కడా ఈ పరిస్థితి ఉండదనీ' మీడియా ప్రతినిధులు అడగ్గా...'ఉప ఎన్నిక కాబట్టి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం'... అని సమాధానమిచ్చారు. 'డబ్బు అధికంగా ఖర్చుపెడుతున్నారని ప్రతిపక్షం ఆరోపిస్తుంది కదా.. ' అని అడగ్గా, 'ప్రతిపక్షం ఆరోపణలు చేయడం సహజం.. ఎన్నికల సంఘం ఆ సంగతి చూసుకుంటుందని అన్నారు. రూ.వందల కోట్లు ఒక్క అసెంబ్లీసెగ్మెంట్‌లో ఖర్చుపెట్టడం ఎంతవరకూ సబబని ప్రశ్నంచగా, 'అభివృద్ధి కోసం నిధులు ఇస్తున్నామ'ని అన్నారు. అవసరమంటే మీ దృష్టిలో 'ఎన్నికలా?' అని విలేకరులు అడగ్గా.. సీటులోంచి లేచిపోయి 'థ్యాంక్యూ' అంటూ పయనమయ్యారు. 'మీ కోసం గంటకు పైగా నిరీక్షిస్తే అర్ధాంతరంగా వెళ్లిపోతారేంటని ప్రశ్నించగా 'ఫ్లైట్‌కి టైం అయిపోయిందంటూ వెళ్లిపోయారు.

సుధాకరరాజు కేసులో మాజీ రిజిస్ట్రారును ప్రశ్నించిన సిట్

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ వేలీ స్కూలు వద్ద గల 25 ఎకరాలను 'దశరథ మహారాజు' తనకిచ్చినట్లు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి కబ్జా చేసేందుకు చూసిన చేకూరి సుధాకరరాజు అరెస్ట్ కేసులో జిల్లా మాజీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును సిట్ అధికారులు ప్రశ్నించారు. సుధాకరరాజు భూ కుంభకోణాలను ఇటీవలే 'ప్రజాశక్తి' వెలుగులోకి తెచ్చిన తర్వాత ఆయన అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుంభకోణాలకు పాల్పడిన వైనం... డాక్యుమెంట్ల తారుమారు విషయాలను గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేసిన పి. వెంకటేశ్వరరావును కూడా సిట్ ప్రశ్నించింది. ఈయన సర్వీసునుంచీ రిటైర్ అయి వేరొక చోట ఉంటుండగా సిట్ అధికారుల నుంచి ఫోన్ కాల్ రావడంతో రెండు రోజుల క్రితమే విశాఖకు వచ్చి సిట్ ముందు హాజరయ్యారు. గతంలో తనకు ఈ భూమిపై సిఎం పేషీ నుంచి ఒత్తిడి వచ్చిందని, అందుకు సంబంధించిన రిఫరెన్స్ నెంబరు కూడా తాను రాసుకున్నట్లు సిట్ అధికారుల వద్ద ఆయన వెల్లడించినట్లు తెలిసింది. చేకూరి సుధాకరరాజు ప్రభుత్వ పోరంబోకు, ఫారెస్ట్ ల్యాండ్స్‌ని, ప్రైవేట్ వ్యక్తుల (జిరాయితీ) భూములను కబ్జా చేసుకుంటూ 10ఏళ్లకు పైగా విశాఖ చుట్టు పక్కల తిష్టవేస్తూ పై స్థాయిలో పలుకుబడి సంపాదించుకుంటూ తిరుగుతున్నాడు. గత నెలలో ఈయన్ను విశాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. తరువాత అతడు బెయిల్‌పై బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది.

ఇప్పటికి ఎనిమిది మంది అరెస్టు

విశాఖ భూకుంభకోణం దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకూ ఎనిమిదిమంది అరెస్టయ్యారు. ఇప్పటివరకూ లక్ష్మణరావు, రామకృష్ణ, చంద్రశేఖర్, చేకూరి సుధాకరరాజు, చంద్రశేఖర్ వంటి వారు అరెస్ట్ అయ్యారు. భీమిలి, చినగదిలి తహశీల్దార్లను అరెస్ట్ చేశారు. తాజాగా గణేశ్వరరావు (సర్వేయరు) అరెస్ట్ అయ్యారు. కానీ ఎవ్వరూ బయటకు రాలేని పరిస్థితి ఉండగా.. సుధాకరరాజు మాత్రం బయటకు రావడం వెనుక ఎంత పెద్ద లాబీయింగ్ ఉంటుందని పరిశీలకులు అంటున్నారు. కాగా సర్వేయరు గణేశ్వరరావును సిట్ అధికారులు శనివారం అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68